సామాజిక వాదం (ad)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 332 పేజీలు: 10+4 వెల: 6.50

కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

# నీళ్ల గుట్టు తేల్చేస్తాం..

## పాలమూరు- రంగారెడ్డి సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి ఎవరికోసం మార్చారు?

## కమీషన్లు ఎవరికి వెళ్లాయో, అంచనాలు ఎలా మారాయో అన్నీచెప్తాం



గురువారం ప్రజాభవన్‌లో 'నీళ్ల- నిజాలు'పై ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

### కెసిఆర్ అసెంబ్లీకి వస్తే మాట్లాడొచ్చు..

### ఆయన గౌరవానికి ఎలాంటి భంగం రానివ్వం

### జలవివాదం ద్వారా లబ్ధి పొందాలన్నదే కెసిఆర్ యత్నం

### నీళ్ల విషయంలో కెసిఆర్, హరీష్‌కు ఉరిశిక్ష వేసినా తప్పులేదు

### ప్రజాభవన్‌లో 'నీళ్లు- నిజాలు'పై ప్రసంగంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి1:** కృష్ణా జలాలపై మాట్లాడేందుకు బిఆర్ఎస్ చీఫ్, మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన గౌరవానికి, వాద నలకు ఎలాంటి ఆటంకం కలిగించబోమని, అయన అనుభవాన్ని పంచుకోవాలని స్పష్టం చేశారు. ఎవరి కోసం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుసోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలం వద్దకు మార్చారు, కమిషన్లు ఎవరికి వెళ్లాయి. పేరు,ఊరు,అంచనాలు ఎలా మారాయి. దీనిపై విచారణ జరగాలని అని వ్యాఖ్యానించారు. గురువారం ప్రజా భవన్‌లో నదీ జలాల అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరిం చారు. ఈ ప్రజంటేషన్‌కు హాజరై సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారుసాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణాజలాల విషయంలో కెసిఆర్,హరీశ్‌రావు రాష్ట్రానికిచేసిన అన్యాయానికి ఉరి తీసినా తప్పులేదని

>>2

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు

# రూ.80వేల కోట్లు

### రూ.27వేల కోట్లు వ్యయం చేసినా ఎకరాకు నీరివ్వని బిఆర్ఎస్

### 'నీళ్లు - నిజాలు'పై ప్రజాప్రతినిధులకు పిపిపి ఇచ్చిన మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జనవరి 1,ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.80 వేల కోట్లు అవసరమని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలి పారు. ప్రజా భవన్‌లో గురువారం నీళ్ళు నిజాలు సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇవ్వకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,టిపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చెప్పడమే కాదు 90శాతం పూర్తిచేశామని అసత్యాలు వల్లెవేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేయడానికి 55వేలకోట్లు అంచనా వ్యయం అంటూ డిపిఆర్ పంపిన కెసిఆర్ 27వేల కోట్లు వ్యయం చేసిందని సగం నిధులు ఖర్చుచేస్తే 90శాతం పనులు ఎలాపూర్తి అయ్యాయని ప్రశ్నించారు. పాలమూరు రంగా రెడ్డి ఆలస్యం చేయాలని కెసిఆర్ ఆదేశాలు జారీచేయడంతో జాప్యం జరిగిందని దీనితో ప్రస్తుతం దీని వ్యయం రూ.80వేల కోట్ల చేరింది.33వేల కోట్లు ఖర్చుచేసేన పూర్తి అయ్యేదని, 55వేల కోట్ల అంటూ వాళ్ళువ్యయం పెంచారు ప్రాజెక్టుపై రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తే

>>2

## ఐడి కార్డులకు

# క్యూఆర్ కోడ్

### సచివాలయంలో అమలు

### మార్ఫింగ్‌కు సర్కార్ చెక్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి1:** తెలంగాణ సచివాలయంలో కొం దరు. నకిలీ ఐడీ కార్డులతో లోపలికి ప్రవేశించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. ఈ మేరకు ఉద్యోగుల ఐడీ



కార్డులు మార్ఫింగ్‌కు చెక్ చేస్తూ గురువారం నుంచి సచివాలయ ఉద్యోగులకు అత్యాధు నిక టెక్నాలజీని అత చేస్తూ కొత్త ఐడీ కార్డు ల పంపిణీని ప్రారంభించారు. గత ఏడారి ఫిబ్రవరి నెలలో సచివాలయంలో షేక్ ఐడీ కార్డులతో ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించడం, సెల్ఫీలు తీసుకోవడం వంటి సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. భద్రతా లోపాలు స్పష్టమువ్వడంతో

>>2

### రిసార్ట్‌లో భారీ అగ్నిప్రమాదం

40 మందికిపైగా మృతి 5

### జర్మనీలో అగ్నిప్రమాదం

భవనంపై నుంచి దూకి జనగామ విద్యార్థి మృతి 6



గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

## ముందు తరాలకు

# అందాల నగరం

## అందివ్వాలన్నదే మా సంకల్పం

### ఫ్యూచర్ సిటీతో ప్రపంచంలో మారనున్న హైదరాబాద్ రూపు రేఖలు

### నుమాయిష్ ఆదాయంతో ఎంతో విద్యావికాసం

### నాంపల్లి ఎగ్జిబిషన్ ప్రారంభించిన డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

**హైదరాబాద్ (గోషామహల్), జనవరి 1 ప్రభాతవార్త:** ప్రతియేటా ఎగ్జిబిషన్ సొసైటి నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ద్వారా దేశంలోనే హైదరాబాద్ నగరానికి ఎంతో గుర్తింపు వస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క పేర్కొన్నారు.ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా ఎగ్జిబిషన్ సొసైటి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏరా ్పటు చేసిన 85వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనను మంత్రులు పొన్నం ప్రభాకర్,దుద్దిల శ్రీధర్‌బాబు సొసైటి ప్రతినిధులతో కలిసి ప్రారంభిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజల్వన చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ సొసైటి ప్రతియేటా కలిసికట్టుగా అఖిలభారత ప్రదర ్శన చేయడం పట్ల వారిని ప్రత్యేక అభినందించారు. ఎగ్జిబిషన్ సొసైటి ద్వారా నుమాయిస్ అంచెలం

>>2

## మూడు నెలల్లో ఎస్సారెస్పీ

# మరమ్మతులు పూర్తి

### రూ.64కోట్లు మంజూరు చేసిన సర్కార్

### కట్ట పునరుద్ధరణ, రివిట్మెంట్, చెట్లు, పొదల తొలగింపునకు చర్యలు



**హైదరాబాద్, జనవరి 1,ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామ సాగర్ ప్రాజెక్టును మరమ్మతు చేసేందుకు రూ.64.55 కోట్లు మంజూరైనా యి.కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌పై గత ప్రభుత్వం పూర్తిగా దృష్టిసారించి, పాత ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ విషయంలో ఉదాసీనంగా ఉండ టంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టుతోపాటు ప్రధానకాలువ కాకతీయకెనాల్, ఇంది రమ్మ వరదకాలువ పూర్తిగా ధ్వంసమైనాయి.గత పాలకులు కట్టిన కాళేశ్వరం కూలిపోయి నిరుపయోగంగా మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర తెలం గాణ ఎడారిగా కాకుండా ఎస్సారెస్పీ మరమ్మతుకు దృష్టిని సారించింది. ఎస్సారెస్పీ జలాశయం రివిట్మెంట్ దెబ్బతినిఆనకట్ట కుంగిపోయింది, అంతే కాదు 14 కిలోమీటర్ల మేరఉన్న ఆనకట్టకు ఇరువైపులా భారీగాతుమ్మ చెట్లు, పొదలు పెరిగి కట్టకోతకు గురై తెగిపోతుందని ప్రభుత్వం గుర్తించింది. శ్రీరామసాగర్ జలాశయంలో పూడిక పేరుకోవడంతో గరిష్ఠంగా 120 టిఎం సిల నీటిసామర్థ్యం కలగిన ఆప్రాజెక్టు ఇప్పుడు 80 టిఎంసిలకు పడిపోయిం ది. ఎస్సారెస్పీ జలాశయంనుంచి ఉమ్మడికరీంనగర్,వరంగల్, నిజామాబా ద్, నల్లగొండ జిల్లాలో సూర్యాపేట వరకు 9.12 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. జూలై ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలతో జలాశయానికి వరద పోటెత్తడంతో ఆవరద ప్రవాహానికి రివిట్మెంట్ ధ్వంసమై, రాళ్లు కొట్టుకుపో తున్నాయి. ఆనకట్ట పైభాగం కుంగుటం కూడా మొదలైంది.ఆనకట్ట ఎత్తు పలుచోట్ల 125-250 అడుగుల వరకు ఉంది. కట్ట కింద నుంచి వచ్చే ఊట జలాలు, వర్షపు నీటిని తరలించేందుకు నిర్మించిన టో డ్రెయిన్ల ఉనికి కానరావడంలేదు. అధికారులు సిబ్బంది వాటి వద్దకు వెళ్లలేనివిధంగా చెట్లు, ముళ్లపొదలు పెరిగాయి. ఎస్సారెస్పీ ఆనకట్ట దృఢత్వం అంచనావేసేందుకు 166 పీజో మీటర్లు ఏర్పాటు చేసినా అవి కూడా మట్టిలో పూడుకుపోయా యి. వరద ఉధృతిని కట్ట తట్టుకుంటుందా... లేదా? ప్రవాహం అసాధా రణంగా వచ్చిందా? అన్నది పీజోమీటర్ల సాయంతో గుర్తిస్తారు. పెద్దఎత్తున పోటెత్తే వరదను కిందకు వదిలే 55 ప్రెజర్ రిలీఫ్ వెల్స్ సైతం ఉనికిలో లేవు.ప్రధాన కాలువల కట్టలు సైతం దెబ్బతిన్నాయి. ఇదిఇలా ఉంటే ఇంది రమ్మ వరద కాలువకు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ సమీపంలోని గాండ్లపేట అక్టోబర్ 9న నీటిని విడుదల చేయడంతో గండి పడింది.శ్రీరా మసాగర్ ప్రాజె క్టు మరమ్మతులు, ఆధునికీకరణకు రూ.67 కోట్ల

>>2

### భర్త మృతిని తట్టుకోలేక.. విషాహారం తిని తల్లీకూతురు మృతి

3 కొడుకు పరిస్థితి విషమం

## వందేభారత్ స్లీపర్‌లు

# వచ్చేస్తున్నాయ్..

### గువాహతి - కోల్‌కతా మధ్య తొలి రైలు

### 18, 19న ప్రధాని ప్రారంభించే అవకాశం



**న్యూఢిల్లీ, జనవరి 1:** రైలు ప్రయాణికులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు త్వరలో పట్టా లెక్కుతున్నాయి. తొలి రైలు గువాహతికోల్‌కతా మధ్య అందు బాటులోకి రానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రకటిం చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జెండా ఊపి ప్రారంభించనున్నట్లు తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైలు టెస్ట్ డ్రైవ్ పూర్తైంది. త్వరలో ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. తొలి రైలు గౌహతికోల్‌కతా మధ్య అందుబాటులోకి వస్తుంది. ఈ మార్గంలో వందే భారత్ స్లీపర్ రైలు సేవలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జెండా ఊపి ప్రారంభిస్తారు. వందే భారత్ స్లీపర్‌ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మెరుగైన భద్రత, రాత్రిపూట సుదూర ప్రయాణాలకు ఆధునిక ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు. జనవరి 18,19 తేదీల్లో ప్రారంభోత్సవం ఉండొచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. వందేభారత్ స్లీపర్ 182 భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో ఈ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. 2019లో ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలో రైల్వేశాఖ స్లీపర్ వర్షన్ అందుబాటులోకి తెచ్చింది.

>>2



## జోరెక్కిన

# కిక్కు

### హైదరాబాద్‌లో మద్యం అమ్మకాలు ఆల్‌టైం రికార్డు

### ఐదు రోజుల్లో రూ.1344 కోట్ల 'మందు' సేల్

### డిసెంబర్‌లోనే రూ. 5,102 కోట్ల అమ్మకాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి1:** 2026 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మందు బాబులు ఎక్కడా తగ్గేదేలే అన్నట్లు రికార్డు స్థాయిలో తాగేశారు. డిసెంబర్ 31న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ స్థాయిలో అమ్మకాలు జరిగాయి. మద్యం ఏరులై పారింది. మధ్యాహ్నం నుంచే మందుబాబులు దుకాణాల వద్ద బారులు తీరారు. గతేడాది కంటే అధికంగా లిక్కర్ అమ్మకాలు జరిగాయి.గత ఐదు రోజుల వ్యవధిలోనే రూ.1344 కోట్ల విలువైన మద్యం తాగేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మద్యం సేల్స్ పెరిగాయి. 2025 చివరి రోజు రూ.736 కోట్ల అమ్మకాలు జరిగాయి. కొత్త సంవత్సరం రాష్ట్ర ఖజానాకు కిక్కిచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కనివినీ ఎరగని రీతిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. గత మూడు రోజుల్లోనే వెయ్యి కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మూడు రోజుల్లో 8.30 లక్షల లిక్కర్ కేసులు, 7.78 లక్షల బీర్ల కేసులు విక్రయించారు. నూతన సంవత్సరం సందర్భంగా వైన్ షాప్‌ల వద్ద జోరుగా మద్యం అమ్మకాలు జరిగాయి. పలుచోట్ల రెట్టింపు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. వైన్ షాప్‌ల వద్ద మందుబాబుల

>>2

## యాదగిరిగుట్ట ఇఒ వెంకట్రావు

# ఆకస్మిక రాజీనామా

### అనారోగ్య కారణాలంటూ వివరణ..

### కానీ తెర వెనుక లోతైన పాలనా సంక్షోభం!

### రాష్ట్ర దేవాదాయ శాఖలో కలకలం



**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మరోసారి వార్తల్లో నిలిచింది. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) వెంకట్రావు తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేయడం ఆలయ వర్గాలు, అధి కార యంత్రాంగం, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల సమయంలో యాదగిరిగుట్టపై ఆలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఈవో వెంకట్రావు, తాను ఈవో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆరోగ్య సమస్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు అందజేశానని కూడా ఆయన వెల్లడించారు. వెంక ట్రావు గతంలో దేవాదాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రిటైర్మెంట్ అనంతరం కూడా ప్రభుత్వం ఆయన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా నియ మించింది. వేలాది భక్తుల రద్దీ, కోట్ల రూపాయల ఆదాయం, భారీ అభివృద్ధి ప్రాజెక్టులతో కూడిన ఆలయ పరిపాలనను ఆయన పర్యవేక్షిస్తూ వచ్చారు. ఈవో ఆరోగ్య కారణాలనే అధికారికంగా పేర్కొన్నప్పటికీ, రాజీనామా ఇంత అకస్మాత్తుగా రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగాఆలయ అభివృద్ధి పనుల అమలుపరిపాలనలో తీసుకున్న కీలక నిర్ణయాలుసిబ్బంది నియామకాలు, బదిలీలపై చర్చలుఆలయ ఆదాయం, టెండర్లు, కాంట్రాక్టుల వ్యవహారందేవాదాయ శాఖ, ప్రభుత్వ స్థాయిలో మారుతున్న విధానాలుఈ అంశాల నేపథ్యంలో అంతర్గత ఒత్తిళ్లుఉన్నాయా? అన్నప్రశ్నలు వినిపిస్తున్నాయి.అయితే, ఈ విషయాలపై ఇప్పటివరకు

>>2



రిపబ్లిక్‌డే పెరేడ్ రిహార్సల్స్‌ను గురువారం న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహిస్తున్న జవాన్లు

## యాదగిరిగుట్ట ఇఒ వెంకట్రావు
# ఆకస్మిక రాజీనామా

>> అధికారికంగా ఎలాంటి స్పష్టత వెలువడలేదు. ఆలయ ఉద్యోగుల్లో అనిశ్చితి. . ఈవో రాజీనామా ప్రకటన అనంతరం ఆలయ ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంది. కొత్త ఈవో నియామకం ఎప్పుడు?అప్పటి వరకు పరిపాలన ఎవరి చేతుల్లో ఉంటుంది?అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**అభివృద్ధి పనులే అసలు పాయింట్?. .**

యాదగిరిగుట్ట ఆలయ పరిధిలో కొనసాగుతున్నరోడ్లుభక్తుల వసతి గృహాలుప్రసాద విభాగంపార్కింగ్, రవాణా వ్యవస్థవంటి అభివృద్ధి పనులపై ఫైళ్లు ముందుకు కదలకపోవడం, కొన్ని కీలక నిర్ణయాలపై పైనుంచి వచ్చిన సూచనలతో ఈవో అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో అధికార పరిధి లేకుండా బాధ్యతలు ఎలా?" అన్న ప్రశ్నను ఆయన అధికారిక సమావేశాల్లో లేవనెత్తినట్లు తెలుస్తోంది. సిబ్బంది వ్యవహారాలపై వివాదాలు. . ఇటీవలి కాలంలోకాంట్రాక్ట్ సిబ్బంది నియామకాలుభద్రతా సిబ్బంది బాధ్యతలుఆలయ ఉద్యోగుల విధుల మార్పులువిషయాల్లో అంతర్గత అసమ్మతి ఏర్పడింది. ఈ అంశాల్లో ఈవో తీసుకున్న నిర్ణయాలకు కొంతమంది వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అవి ఉన్నతస్థాయికి చేరడంతో, ఈవోపై మానసిక ఒత్తిడి పెరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**ట్రస్ట్ బోర్డు నీడలో ఈవో పదవి?. . .**

యాదగిరిగుట్టకు త్వరలో ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటు జరగనున్న నేపథ్యంలో, ఈవో పాత్ర పరిమితం అవుతుందనికీలక నిర్ణయాలు ట్రస్ట్ చేతుల్లోకి వెళ్తాయని ఈ పరిణామాలు ముందే తెలిసిన వెంకట్రావు బాధ్యత ఉంది కానీ అధికారాలు లేవన్న భావనతోనేగౌరవప్రదంగా తప్పుకోవడమే సరైందని నిర్ణయించుకున్నారని అధికార వర్గాల అంచనా. తనపై వచ్చే ఆరోపణలకు ముందస్తు రక్షణగాలేదా ఉద్యోగుల్లో గందరగోళం రాకుండాతన వైపు నిజం చెప్పే ప్రయత్నంగాచేసిన చర్యగా విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం బాల్ పూర్తిగా ప్రభుత్వ కోర్టులో ఉంది. రాజీనామాను వెంటనే ఆమోదిస్తుందా?. లేక కొనసాగించమని కోరుతుందా?తాత్కాలిక ఈవో నియమించి కొత్త ట్రస్ట్ బోర్డు వరకు వేచిచూస్తుందా?అన్నది ఆసక్తికరంగా మారింది. ఈవో రాజీనామాతోఆలయ పరిపాలన, అభివృద్ధి పనులుభక్తుల సౌకర్యాలుఅన్నింటిపైనా నిశ్శబ్ద ఉత్కంఠ నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు, ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగానే కొనసాగనుంది.

# ముందు తరాలకు అందాల నగరం

>> చెలుగా అభివృద్ధి చెందుతూ నేడు భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న ఉత్పత్తులను అమ్మకాలు చేయడం ద్వారా సొసైటికి, హైదరాబాద్ నగరానికే గర్వకారణమన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఎంతో మంది వ్యాపారులు ఇక్కడి వస్తారన్నారు. భవిష్యత్తు తరాలకు అందమైన నగరాన్ని ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసేందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళిక రూపొందిండం జరిగిందన్నారు. సైబారాబాద్ తరహాలో ఫ్యూచర్‌సిటి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెట్టుబడిదారులకు అన్ని వసతులను కల్పించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్, ఫ్యూచర్‌సిటి హైదరాబాద్ గ్లోబల్ సిటిగా మారుతుందన్నారు. 30వేలమంది విద్యార్థీనులకు ఈ సొసైటి ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. 45 రోజుల పాటు ఉపాధి లభిస్తుందన్నారు. నుమాయిష్‌తో వచ్చే ఆదాయంతో పాఠశాల, కళాశాల విద్యసంస్థలను నడువడం గొప్ప విషయమన్నారు. 10వేలమంది సొసైటి ద్వారా ఉపాధి పొందుతున్నట్లు వివరించారు.

సొసైటి అధ్యక్షులు మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతియేటా జనవరి మాసంలో జరిగే ఎగ్జిబిషన్ ద్వారా అన్ని కులాలు, మతాలకు చెందిన బడా వ్యాపారులను, చిరువ్యాపారుల వరకు ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. 45 రోజుల పాటు ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

ఎగ్జిబిషన్‌లో రకరకాల వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర రోడ్డురవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సొసైటి 45 రోజుల పాటు కొనసాగే ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వచ్చే సందర్శకుల కోసం ఆర్‌టిసి కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ్యులు వి. హనుమంత్‌రావు, ఎగ్జిబిషన్ సొసైటి కార్యదర్శి బి. ఎన్. రాజేశ్వర్, ఉపాధ్యక్షులు ఆర్. సుఖేష్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎన్. సంజీవకుమార్, సొసైటి సభ్యులు బి. హన్‌మంత్‌రావు అశ్వాక్‌హైదర్, నరోత్తంరెడ్డి, బి. ప్రభాశంకర్, ఎన్. వినయ్‌కుమార్, సురేర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా చుక్‌బుక్ రైల్‌లో మంత్రులు, సొసైటి ప్రతినిధులు ఎగ్జిబిషన్‌ను చుట్టిముట్టి వచ్చారు. మొదటిరోజు కావడంతో ఎగ్జిబిషన్‌సందర్శకులతో కిటకిటలాడింది.

## ఐడి కార్డులకు
# క్యూఆర్ కోడ్

>> పోలీసు శాఖ సిఫార్సుల మేరకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన కొత్త ఐడీ కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, కొత్త ఐడీ కార్డుల్లో తెలంగాణ తల్లి విగ్రహం, సచివాలయం లోగో, ఉద్యోగి ఫోటో, ఎంప్లాయీ ఐడీ నెంబర్, క్యూఆర్ కోడ్ (స్కాన్ చేసి తక్షణమే వివరాలు ధృవీకరించే వీలు కలిగేలా), ఇంటర్నల్ చిప్ (ఆర్‌ఎఫ్‌ఐడి టెక్నాలజీను జత చేశారు. దీంతో ఐడీ కార్డు మార్ఫింగ్, నకిలీ తయారీ అవకాశం దాదాపు తుడిచిపెట్టబడింది. ప్రస్తుతం సచివాలయంలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 1,300 మందికి, క్లాస్4 ఉద్యోగులు 300 మందికి. మొదటి దశలో ఈ కొత్త ఐడీ కార్డులు అందజేస్తున్నారు.

త్వరలో మిగిలిన ఉద్యోగులకు కూడా పంపిణీ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాజా పరిణామంతో సచివాలయంలో భద్రత మరింత బలోపేతమవుతుందని, ఉద్యోగుల పేరుతో సచివాలయంలోకి నకిలీ ఎంట్రీలు అడ్డుకట్టపడతాయని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఇటీవలే ఉద్యోగులకు ఫేస్. రికగ్నిషన్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో భద్రతా చర్యలు మరింత ప్రాధాన్యత. సంతరించుకున్నాయి.

# జోరెక్కిన కిక్కు

>> రద్దీ కనిపించింది. గతేడాది ఒక్క డిసెంబర్ నెలలోనే రూ.3,805 కోట్ల విలువైన 38.07లక్షల కేసుల లిక్కర్, 45.09లక్షల కేసులు బీర్లు అమ్ముడు పోయినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.ఒక డిసెంబర్ నెలలోనే రూ.5,102 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు.న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31 రాత్రి ఒక్కరోజే రూ.350 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరగడం విశేషం. సర్పంచ్ ఎన్నికలు,న్యూ ఇయర్ వేడుకలు ఒకేసారి రావడం వల్ల మద్యం వినియోగం భారీగా పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది సంబరాలు అంబరాన్నంటిన వేళ శాంతి భద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. తాగి వాహనాలు నడుపుతున్న వారి కోసం హైదరాబాద్ వ్యాప్తంగా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పోలీసులను దూరం నుంచే చూసి పలువురు వెనక్కి తిరిగి పారిపోగా పలువురు మందు బాబులు చిక్కినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. 3 కమిషనరేట్ల పరిధిలో 2,731 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,198, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 928, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 605 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లుగా పోలీసులు వివరించారు. హైదరాబాద్‌లో డిసెంబర్ నెలలో మద్యం అమ్మకాలు చారిత్రాత్మక రికార్డును సృష్టించాయి.

## మూడు నెలల్లో ఎస్సారెస్పీ
# మరమ్మతులు పూర్తి

>> డ్రిప్ పద్దుకింద నిధులివ్వా లని ప్రతిపాదనలు ప్రాజెక్టులోని క్షేత్రస్థాయి అధికారులు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుతో పంపారు.శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆనకట్ట రివిట్మెంట్ వరద కాలువలకు గండ్లు, సిమెంటు లైనింగ్, కట్ట, కాలువల మరమ్మతులకు కేంద్రజలసంఘంకు డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రాజెక్టు కింద నిధులు మంజూరు చేసింది. టెండర్ నిర్వహించి, మూడు నెలల్లోపు పనులు చేయడానికి ఎస్సా రెస్పీ అధికారులు సమయాత్తమవుతున్నారు. కట్టమరమ్మతు కోసం రూ.32.55 కోట్లు మంజూరు కాగా శాండ్ ఫిల్టర్ లేయర్‌తో కట్టను పటిష్ఠం చేస్తారు. కట్టపై చెల్లాచెదురైన రివిట్మెంట్ రాళ్లు సరిగా పేర్చడం కోసం రూ.18.27 కోట్లు కేటాయించారు. డ్యామ్ పొడవునా కొత్త లైట్లు అమర్చేందుకు, పాటు, గేట్లను ఎత్తే నూతన కేబుల్ కు రూ.2.5 కోట్లు వెచ్చించనున్నారు.14 కి. మీ. పొడవైన ఆనకట్టపై 7,300 వరకు తుమ్మ, పెద్దచెట్లు పెరిగాయని అధికారులు గుర్తించారు. వీటిని తొలగిస్తారు.

## వారం - వర్జ్యం

**02-01-2026, శుక్రవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**పుష్యమాసం, దక్షిణాయణం**
**హేమంత ఋతువు, శుక్లపక్షం**
చతుర్దశి సా.6.55, పూర్వాషాఢ కార్తె
మగృశిర రా.8.05,
వర్జ్యం : రా.3.35-తె.5.00
దు.ఉ.8.51-ఉ.9.36,
2) మ.12.34-మ.1.19
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** భాగస్వామ్య పెట్టుబడులతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

**వృషభం:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

**మిథునం:** దైవానుగ్రహం వలన మీ ఊహ వాస్తవికతకు దూరం అవుతుంది. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు.

**కర్కాటకం** :ముఖ్యమైన పత్రాలకు జత చేయవలసిన వాటిని మర్చిపోయే అవకాశం ఉంది. జాగ్రతలు పాటించండి.

**సింహం:** హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకుని చర్చలు సాగిస్తారు. సాంకేతిక విద్యావకాశాలు లాభిస్తాయి.

**కన్య:** సంతాన విద్యా విషయంలో కొంత అశాంతికి లోను అవుతారు. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**తుల** : ముఖ్యమైన విషయ వ్యవహారములను వాయిదా వేయడం మంచిది. ఎదుటి వారి విషయాలలో జోక్యం వద్దు.

**వృశ్చికం:** గృహ సంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

**ధనుస్సు:** ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సహనాన్ని, ఓర్పు వహించడం చెప్పదగిన సూచన. వస్త్ర లాభం.

**మకరం:** సన్నిహిత వర్గం నుండి ఆర్థిక సహాయ సహకారాలు నామమాత్రంగా అందుకుంటారు. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం:**మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**మీనం :** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. పురాతన వస్తు సేకరణ చేస్తారు. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నీళ్ల గుట్టు తేల్చేస్తాం

>> సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కంటే వీరిద్దరూ దుర్మార్గులని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్ల చేసిన తప్పుకు మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే రాళ్లతో కొట్టి చంపేవారని ధ్వజమెత్తారు. పాలమూరు-రంగారెడ్డిపై చర్చకు సిద్ధమని చెప్పగానే తమ తప్పులుబయటపడతాయని భయపడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అండ్ కో తమ ప్రభుత్వంపై కావాలనే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్దాల పోటీలో కెసిఆర్,కెటిఆర్,హారీశ్‌రావుకు ఫస్ట్ ప్రైజ్ వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నేతలది సంకుతిత స్వభావమని విమర్శించారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ఏపీ ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి తెస్తున్నామని చెప్పుకొచ్చారు. గతంలో కేసీఆర్, హారీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ నీటి చౌర్యం చేస్తున్న.. తెలంగాణ వాటాను మనం వాడుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ఆ ప్రాజెక్టును మార్చారని మండిపడ్డారు. తలా వదిలేసి తోక దగ్గర నీళ్ల తెచ్చేలా ప్రాజెక్టు డిజైన్ చేశారని విమర్శించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల ఒప్పందానికి కేసీఆర్ సంతకం చేశారని ధ్వజమెత్తారు.

కెసిఆర్ పెట్టిన సంతకం ఏపీకి అడ్వాంటేజ్‌గా మారిందని, అప్పుడు ఏపీకి 66శాతం, తెలంగాణకు 34శాతం జలాలకు ఆయన అంగీకరించారని తెలిపారు.21 ఏళ్లుగా తదుపరి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు రాకుండా వాయిదా వేస్తున్నారని, తెలంగాణ నీటి లెక్కలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం సృష్టించి, తద్వారా లబ్ది పొందాలని బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా నీళ్ల హక్కుల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగిందని, కృష్ణా,గోదావరి జలాలను సక్రమంగా వాడుకుంటే ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచి ఉండేదన్నారు.నీళ్ల కోసం ఉమ్మడి రాష్ట్రంలో పిజెఆర్ స్వంత ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తు చేశారు. గతంలో నీళ్ల విషయంలో ఎన్నో పొరపాట్లు జరిగాయని, ఆ పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు.

**అందుకే దాస్‌పై ఆరోపణలు**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు వివాదం వేళ వార్తల్లో నిలిచిన నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యానాథ్ దాస్ గురించి సిఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులపై అవగాహన ఉండటంతోనే ఏపీలో పనిచేసిన ఆయనను తీసుకొచ్చామన్నారు.ఆయనది అటు ఏపీ, ఇటు తెలంగాణ కాదని, దాస్ బిహార్‌కు చెందిన వాడని తెలిపారు. కెసిఆర్,హారీశ్‌రావు దొంగతనాన్ని బయట పెడతాడనే భయంతోనే ఆయనపై బిఆర్‌ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ పార్టీని బతికించుకునేందుకు కెసిఆర్ మళ్లీ చంద్రబాబు పేరును,నీటి సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కెసిఆర్ ఏడేళ్ల డిపిఆర్ సమర్పించలేదన్నారు. దీంతో పర్యావరణ అనుమతులు రాలేదని, అనుమతులు లేని ప్రాజెక్టు నిర్మిస్తున్నారంటూ కొందరు కేసులు వేశారన్నారు. డిపిఆర్ లేని ప్రాజెక్టుకు కమిషన్ల కోసం,లిఫ్టుల కంపెనీలకు కెసిఆర్ రూ.27వేల కోట్లు చెల్లించారని విమర్శించారు. ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా అయితేనే కమిషన్లు భారీగా వస్తాయని కుట్ర చేశారని ఆరోపించారు. జూరాల నుంచి లిఫ్టులు ఎక్కువ పెట్టలేమని భావించిన కెసిఆర్ దాన్ని శ్రీశైలానికి మార్చారని, తల దగ్గర నుంచి నీరు తీసుకునేది వదిలేసి తోక దగ్గర నీళ్ల తీసుకునేలా డిజైన్ చేశారన్నారు. సుప్రీంకోర్టులో కేసులు వేయడంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాగునీటి ప్రాజెక్టు కాదని అఫిడవిట్ వేశారు. తాగునీటి కోసం 7.15 టిఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కోర్టుకు చెప్పారని పేర్కొన్నారు. నదీ జలాల అంశంలో రాజకీయ లబ్ది పొందాలనుకోవడం లేదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టిఎంసీల నీళ్ల కేటాయింపులు జరిగాయి.అందులో ఏపీకి 66శాతం ఇచ్చేలా కెసిఆర్ సంతకం చేశారు. టిజికి 299 టిఎంసీలు చాలని బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. కెసిఆర్ తప్పు చేసి తెలంగాణ గొంతు కోశారని ఆరోపించారు. జూరాల నుంచి పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు సోర్స్ శ్రీశైలంకు మార్చడానికి కెసిఆర్ మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, ఆ విషయం బయట పడుతుందనే కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదన్నారు. ఈ అంశంపై తమ ప్రభుత్వం విచారణ జరుపుతుందని, అందుకే హారీశ్‌రావు బనకచర్లపైన మాట్లాడుతున్నారన్నారు. ఇప్పుడు తాము 522 టిఎంసీల కోసం ఏపిపై ఒత్తిడి తెస్తున్నామని,నదీ పరివాహకం ప్రకారం చూస్తే... కృష్ణా జలాల్లో తెలంగాణకు 71శాతం రావాలని పేర్కొన్నారు. అసెంబ్లీ,లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పరాజయం పాలైందని, ఎన్నికల్లో వరుస ఓటములతో బిఆర్‌ఎస్ మనుగడ కష్టమవుతోందని కెసిఆర్ గుర్తించారని, మళ్లీ జల వివాదం రేపి ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు సృష్టించి తన పార్టీని బ్రతికించుకోవాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. దాంట్లో భాగంగా ఒక అబద్దాల సంఘాన్ని ఏర్పాటు చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని అపోహాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, పార్టీని బతికించేందుకు మళ్లీ నీళ్ల సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు పేరు చెప్పి తెలంగాణలో మళ్లీ పార్టీని బతికించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని సిఎం విమర్శించారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు
# రూ.80వేల కోట్లు

>> 90 శాతం పూర్తయినట్టా? పాలమూరు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్ల ఇవ్వలేదు.మేం వచ్చాక రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి తీయలేదని ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోంది అని ఉత్తమ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పాలనలో 2014వరకు 797టిఎంసిలు తరలించుకుపోతే బిఆర్‌ఎస్ హయాంలో ఆంధ్రప్రదేశ్ 1442టిఎంసిలు తరలించుకొని పోయామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, ఇతరపథకాలపై ఉత్తమ్ వివరణ ఇచ్చారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.80 వేల కోట్లకుపైగా కావాలనీ ఆయన తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ కోసం ఏ అనుమతులు లేవని కెసిఆర్ అబద్ధాలు చెప్పారని తెలిపారు.పిఆర్‌ఎల్ఐఎస్‌కు 45 టిఎంసిలు కి ఒప్పుకున్నారు అనేది అవాస్తవమని అన్నారు. హరీష్ తెలివితో మాయమాటలు చెప్తున్నారు.హరీష్ రావు విచిత్ర, వికారం మాటలను ఖండిస్తున్నామని చెప్పారు.కెసిఆర్ ప్రభుత్వానికి పాలమూరు కట్టాలని లేదు.2020లో సెంట్రల్ కు పంపిన నీటి వాటాల పంపకాల్లో పాలమూరు, ఎస్ఎల్‌బిసి డిండికి నీళ్ల అడుగలేదు.పదేళ్లలో బిఆర్‌ఎస్ తెలంగాణ ప్రజలను మోసం చేసింది.1.83 లక్షల కోట్లు ఇరిగేషన్ కు ఖర్చు బిఆర్‌ఎస్ పాలనలో ఒక్క ఎకరాకు నీళ్ల ఇవ్వలేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కట్టిన ప్రాజెక్టలతోనే నీళ్లను పంపిణి చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పేరుతో ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీకి కెసిఆర్ సహకరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను నిలిపివేశాం.వచ్చే మూడేళ్లలో ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నారు.



నూతన సంవత్సరం రోజున ఆగర్తలలోని గాంధీ మెమోరియల్ ఆసుపత్రిలో జన్మించిన నవజాత శిశువులు

## వందేభారత్ స్లీపర్‌లు
# వచ్చేస్తున్నాయ్..

>> ఈ వందే భారత్ స్లీపర్ రైళ్ల మరికొన్ని రోజుల్లో పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఈ రైలుకు ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి. రైలు వేగాన్ని పెంచేందుకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాజస్థాన్ కోటానాగ్దా సెక్షన్ల మధ్య ట్రయల్స్ నిర్వహించారు. ఈ ట్రయల్స్ విజయవంతమైనట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 182 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. ఈ హైస్పీడ్‌లో వాటర్ టెస్ట్ కూడా నిర్వహించారు. వందే భారత్ స్లీపర్ రైలుకు చాలా ప్రత్యేకతలున్నాయి. విమానం తరహాలో ప్రయాణికులకు ఈ రైలులో సౌకర్యాలుంటాయి. ఈ రైలు గంటకు 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్నది. వందే భారత్ స్లీపర్ రైలులో ఒకేసారి 823 మంది ప్రయాణికులు ప్రయాణించవచ్చు.ఇందులో ఒక ఫస్ట్ ఏసీ కోచ్, నాలుగు సెకండ్ ఏసీ, 11 థర్డ్ ఏసీ కోచ్‌లు ఉంటాయి. వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. దాంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనున్నది. రైలులో ఫైర్ సేఫ్టీతో పాటు ప్రతి బెర్త్ వద్ద అత్యవసర స్టాప్ బటన్స్ సైతం ఉంటాయి. ప్రయాణికులు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు బెర్తులను మెరుగైన కుషన్‌తో ఏర్పాటు చేశారు. అప్పర్ బెర్తులు ఎక్కేలా మెట్లు ఏర్పాటు చేశారు. దాంతో ప్రయాణికులకు సరికొత్త ఫీలింగ్ ఉంటుంది.

రైలులో అత్యాధునిక సేవలు అందించనున్నారు. బయో వాక్యూమ్ టాయిలెట్లు, టచ్ ఫ్రీ ఫిట్టింగ్‌లు, షవర్ క్యూబికల్స్, ఆటోమేటిక్ డోర్లు, జీపీఎస్ ఆధారిత డిస్‌ప్లేలు, ఛార్జింగ్ సాకెట్లు వంటి సౌకర్యాలతోపాటు టాయిలెట్‌లో ఎలాంటి బటన్ నొక్కకుండానే నీళ్ల వస్తాయి. ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి వెళ్లేందుకు ఆటో మేటిక్ డోర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కోచ్‌లో ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ సైతం ఉంటుంది. ప్రతి కోచ్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. బెర్త్ వద్ద చిన్న లైట్ సైతం ఉంటుంది. దాంతో ఎవరైనా బుక్‌లు, పేపర్ చదువుకోవచ్చు.

సేఫ్టీ కవచ్ సిస్టమ్, బ్లాట్ ప్రూఫ్ బ్యాటరీ, 3 గంటల ఎమర్జెన్సీ బ్యాకప్ ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తాయని రైల్వేశాఖ పేర్కొంది. కొత్త వందే భారత్ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్లలో కోచ్‌ల సంఖ్య దాదాపు 1620 మధ్య ఉంటుంది.

# 2731 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
## ఎక్సైజ్, పోలీసులతో కలిసి ఈగల్ ఫోర్స్ తనిఖీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి1:** నూతన సంవత్సరం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని పోలీసులు చేపట్టారు. హైదరాబాద్ నగరంలోని 3 కమిషనరేట్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 2,731 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, డ్రగ్స్ సరఫరా చేసే వారితో పాటు తీసుకునే వారికి శిక్ష తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల్లో మాదకద్రవ్యాలను అరికట్టడమే లక్ష్యంగా తెలంగాణ ఈగల్ టీం, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని మూడు కమిషనరేట్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలో ఉన్న పబ్‌లు, రిసార్ట్‌లను లక్ష్యంగా చేసుకుని ఈగల్ ఫోర్స్ బృందాలతో మెరుపు దాడులు చేశారు. ఈ తనిఖీల్లో 15 ఈగల్ ఫోర్స్ బృందాలు, 8 ఎక్సైజ్ బృందాలు పాల్గొన్నాయి. గతంలో లాగా కేవలం అనుమానంపై కాకుండా ఈసారి పక్కా శాస్త్రీయమైన ఆధారాలతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు అధునాతన యూరిన్, సలైవా డ్రగ్ టెస్టింగ్ కిట్లతో చేశారు మోడ్రన్ టెక్నాలజీ డ్రగ్ టెస్టింగ్ కిట్ తక్కువ సమయంలోనే వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నారో లేదోనని కచ్చితంగా నిర్ధారిస్తాయి. ఈ తనిఖీల్లో భాగంగా అధికారులు పబ్‌లు, రిసార్ట్‌లలో ఉన్న 51 మందికి ఈ టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఏకంగా నలుగురు డీజే ఆపరేటర్లు డ్రగ్స్ సేవించినట్లు తేలింది. అంతేకాకుండా హైదరాబాద్ నగరంలోని ప్రధాన కూడళ్లలో చేపట్టిన వాహన తనిఖీల్లో 38 మందిని పరీక్షించగా, ఒక వాహనదారుడికి డ్రగ్స్‌టెస్ట్ నిర్వహించగా పాజిటివ్‌గా వచ్చింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మాదక ద్రవ్యాలు సప్లై చేసినా వాటిని తీసుకున్నా వదిలి పెట్టబోమని అధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని 3 కమిషనరేట్ల పరిధిలో 2,731 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించిన పోలీసులు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,198, సైబరాబాద్ పరిధిలో 928, మల్కాజ్ గిరి కమిషనరేట్ పరిధిలో 605 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. కూకట్ పల్లి జేఎన్‌టీయూ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు 50 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రగతి నగర్‌లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 28 ద్విచక్ర వాహనాలు, 18 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నార్సింగిలోని గోల్డెన్ టెంపుల్ వద్ద ఎస్‌వోటీ(స్పెషల్ ఆపరేషన్ టీం) పోలీసుల సోదాల్లో డ్రగ్స్ తీసుకున్న ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 7 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు కొకైన్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## లోక్‌భవన్‌లో గవర్నర్‌ను
# కలిసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి1:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్‌కు ఆయన సిఎం శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా గవర్నర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం,జ్ఞాపికను అందజేశారు. అనంతరం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇద్దరూ కాసేపు చర్చించినట్లు తెలుస్తోంది.



గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌తో భేటీ అయిన సిఎం రేవంత్



## జార్ఖండ్ తొలి మహిళా డిజిపి నియామకం

### 1994 బ్యాచ్ ఐపిఎస్ అధికారిణి తధాశా మిశ్రా బాధ్యతల స్వీకరణ

**రాంచి, జనవరి 1:** జార్ఖండ్ రాష్ట్రానికి మొట్టమొదటి మహిళా డిజిపి నియమితులయ్యారు. 1994 బ్యాచ్ ఐపిఎస్ అదికారిణి తదాశామిశ్రా రాష్ట్ర డిజిపిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రం ఏర్పడిన 25 యేళ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా జార్ఖండ్‌లో మహిళా డిజిపి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెనువెంటనే ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌ను కంకేలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అంతకుముందు హోంశాఖలో స్పెషల్ కార్యదర్శిగా పనిచేసారు. హోం, జైళ్లు, ప్రకృతి ఉపద్రవ నివారణ విభాగాలను పర్యవేక్షించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మిశ్రా అనేక కీలక పదవులు నిర్వహించారు. ఎడిజి, ఐజి, గిరిధ్ ఎస్పీ, బొకారో, రాంచి సిటీ ఎస్పీగా కూడా బాధ్యతలు నిర్వహించారు. స్నేహపూర్వక పోలీసింగ్ ఉంటుందని, పౌరులతో పోలీస్ సత్సంబంధాలు మెరుగుపరుస్తానని అన్నారు. విధినిర్వహణలో బాధ్యతాయత వైఖరి మరింత పెంపొందించడంతోపాటు, దర్యాప్తులు వేగవంతం, మెరుగైన రీతిలో విచారణలు ఉంటాయని తెలిపారు. దిగువ కేడర్ అధికారులు కూడా ప్రజలతో మర్యాదగాను, హుందాగాను వ్యవహరించాలని కోరారు. ఇప్పటివరకూ డిజిపిగా పనిచేసిన అనురాగ్‌గుప్తా స్వచ్ఛంద పదవీవిరమణ చేసారు. 2024 జూలై నుంచి కూడా గుప్తా తాత్కాలిక డిజిగా వ్యవహరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన్ను ఎన్నికల సంఘం తొలగించింది. అయితే ఆ తర్వాత మళ్లీ పునర్నియమితులయ్యారు.

# త్వరగా 265 ఎఇఇలు, ఎఇలు, పోస్టులు భర్తీ చేస్తాం

### హ్యామ్ రోడ్ల ప్రతిష్టంభన త్వరలో కొలిక్కి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్ జనవరి 1, ప్రభాతవార్త:** రోడ్లు భవనాలు శాఖను సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఖాళీగా ఉన్న 265 ఎఇఇలు, ఎఇలు పోస్టులను కూడా అత్యంత త్వరలో భర్తీ చేస్తామనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. 2026 నూతన సంవత్సరం పురస్కరించుకుని గురువారం ఎర్రమంజిల్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఆర్‌సి ప్రెసిడెంట్‌గా ఇటీవల నియామకమైన ఈఎన్సీ మోహన్ నాయక్ ను సన్మానించిన మంత్రి సన్మానించి మంత్రి మాట్లాడుతూ కొత్త ఏడాదిలో మొదటి రోజే డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించుకున్న ఏకైక డిపార్ట్మెంట్ మన ఆర్ అండ్ బి అని, తన ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఏడాది మొదటి రోజే అన్ని సమగ్ర వివరాలతో కూడిన డైరీ ఆవిష్కరణ చేయడం మొదటి సారనీ ఆర్ అండ్ బి అధికారులకు కితాబిచ్చారు. ఆర్ అండ్ బి ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని శాఖ ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ఉద్యోగులతో కలిసి మంత్రి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సీనియారిటీ సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని, ఆ సమస్యలు పరిష్కారమైన వెంటనే, సీనియారిటీ ప్రకారం అన్ని కేడర్లలో పదోన్నతులు మంజూరు చేయబడతాయన్నారు. ఇప్పటికే పదోన్నతులు ఇచ్చామని 38 మందికి ఎఇఇలు ఇచ్చామని118కి డిఇఇలు72మందికి ఇఇలు, 29మందికి ఎస్ఇలు5సిఇలు, 3 ఇఎన్‌సిలుఇచ్చామని గణాంకాలతో మంత్రి ఏకరువుపెట్టారు. ఆర్‌అండ్‌బి బలోపేతం చేసే దిశగా 153 ఎఇఇలు 38 ఎఇలు 60 జెటిఒ నియామకాలు కూడా చేపట్టామన్నారు. ఉద్యోగుల కోరిక మేరకు కొత్త సంవత్సరంలో అన్ని హంగులతో కూడిన ఆడిటోరియం నిర్మిస్తామని, ఫీల్డ్ లో ఉండే ఎఇ లకు ల్యాప్ టాప్ లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆర్ అండ్ బిశాఖ ఆధ్వర్యంలో కాలేజీలు, టిమ్స్, నిమ్స్, ఉస్మానియా హాస్పిటల్స్, హైకోర్టు, జిల్లా కోర్టులు, కలెక్టరేట్లతో పాటు 60వేల కోట్ల విలువైన రోడ్లు డబుల్ లేన్, ఫోర్ లేన్, 6లేన్ రోడ్లు ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని అన్నారు. రూ. 11,399 కోట్లతో ప్రతిపాదించిన హ్యామ్‌రోడ్లు త్వరలో కొలిక్కి రానుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రానున్న రోజుల్లో రీజినల్‌రింగ్‌రోడ్డుకు సమాంతరంగా రూరల్ రోడ్లు డెవలప్‌మెంట్ చేయాలని తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వచ్చి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ వేదికగా చరిత్రలో ఎన్నడు లేని విధంగా మొదటి సారి ఆర్ అండ్ బి రోడ్ పాలసీని ఆవిష్కరించుకున్నామని తెలిపారు. శాఖ విజన్‌కు నిదర్శనమన్నారు. మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, గ్రీన్ ఫీల్డ్ హైవేలు, ఎన్నో గొప్ప కార్యక్రమాలతో ఆర్‌అండ్‌బి ముందుకు సాగుతోందనీ అన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తనకు ఉన్న పరిచయంతో 2 యేళ్లలో ఎన్నడూ లేనివిధంగా 2వేల కోట్ల సిఆర్ఐఎఫ్ నిధులు తెచ్చామని చెప్పారు.



గురువారం ఎర్రమంజిల్ ఆర్అండ్‌బి ప్రధాన కార్యాలయంలో సంవత్సర డైరీలను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

# రేపటి నుంచి టెట్-2026 పరీక్షలు

### 2,37,754 దరఖాస్తులు.. 20 వరకు కొనసాగింపు

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జర గనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్షలు రేపటి(శనివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే డిసెంబర్ 27 నుంచి హాల్‌టికెట్లను విడుదల చేసిన నేపథ్యంలో పరీక్షలకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 80 శాతానికిపైగా అభ్య ర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకు న్నారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. పరీక్షల సమయానికి 15 నిమిషాల ముందుగానే గేట్లను మూసివేయనున్న నేపథ్యంలో అభ్యర్థులు పావుగంట ముందుగానే పరీక్ష కేంద్రా ల్లోకి వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. టెట్- 2026 కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షల్లో భాగంగా జనవరి 3, 4, 5, 6, 8, 9, 11 తేదిల్లో మేజర్ పరీక్షలు జరగనుండగా జనవరి 19, 20 తేదీల్లో మైనర్ పరీక్షలు జరగ నున్నాయి. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వ హించనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్షలను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం పరీక్షలకి 8.45 గంటలకు గేట్లను మూసేయనుండగా.. మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు క్లోజ్ చేయనున్నారు. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరి రెండోవారంలో విడుదల చేయనున్నారు. టెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 2,37,754 దరఖా స్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో వారినుంచి 71,670 దరఖా స్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా, పేపర్-2కు 1,52,216 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని జిల్లాల్లో పరీక్షా కేం ద్రాలను ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులకు సుదూర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆరోపించారు. టెట్ పరీక్షలకు హాజర వుతున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఒడి సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

## డ్రోన్ నుంచి జారవిడిచిన డ్రగ్స్, ఐఇడిల స్వాధీనం

**జమ్మూ, జనవరి 1:** జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి అనుమానిత పాకిస్థాన్ డ్రోన్ కదలికను గుర్తించిన భద్రతా దళాలు గాలింపు చర్యలుముమ్మరంచేసారు. నూతన సంవత్సరం వేళ నియంత్రణ రేఖ వెంబడి పాక్ డ్రోన్ కలకలం సృష్టించింది. భారత గగనతలంలోకి ప్రవేశించి ఐఈడీ, మాదక ద్రవ్యాలను జారవిడిచింది. భద్రతా దళాలు ఆ ప్రాంతం నుంచి ఆ ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నాయి. పూంఛ్ సెక్టారులోని నియంత్రణ రేఖ వెంబడి ఈ ఘటన చోటు చేసుకుంది. ఖాదీ కర్మదా ప్రాంతంలోకి పాకిస్థాన్ డ్రోన్ చొరబడి, ఐదు నిమిషాలు అక్కడే చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలోనే ఐఈడీ మందుగుండు సామగ్రి, డ్రగ్స్‌ను జారవిడిచింది. డ్రోన్ కదలికలను గుర్తించిన వెంటనే భద్రతా సిబ్బంది, జారవిడిచిన సామగ్రిని స్వాధీనం చేసుకుంది.

## భర్త మృతిని తట్టుకోలేక..

## విషాహారం తిని తల్లీకూతురు మృతి

### కొడుకు పరిస్థితి విషమం

### నూతన సంవత్సరం వేళ కల్వకుర్తిలో దారుణం



లావణ్య (ఫైల్), మేఘన (ఫైల్)

**కల్వకుర్తి, జనవరి 1, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం వేళ కల్వకుర్తిలో గురువారం దారుణం చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలకు పురుగుల మందు కలిపిన అన్నం తినిపించి తాను తిన్న సంఘటన అందరిని కలిచి వేస్తోంది. కల్వకుర్తిలోని తిలక్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రసన్న (40), కుమార్తె మేఘన (13), కుమారుడు ఆశ్రిత్‌తో కలిసి బుధవారంరాత్రి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం పురుగులమందు కలిపిన అన్నం పిల్లలకు తినిపించి తాను తిన్నట్లు సమా చారం. ఈ ఘటనలో తల్లీకుతూరు మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అనంతరం మృత దేహాలను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసన్న భర్త భీమ్‌శెట్టి ప్రకాష్ మృతి చెందారు. భర్త మృతుని తట్టుకోలేని భార్య తాము బతికి ఉండటం కన్న చావడమే మేలని భావించి ముగ్గురు తనువు చాలించాలని భావించి పురుగులమందు కలుపుకొని అన్నం తిని ఈ అఘాయిత్యం పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎయిరిండియాకు డిజిసిఎ నోటీసులు!

**న్యూఢిల్లీ, జనవరి 1:** భద్రతా ప్రమాణాల ఉల్లంఘనపై ఎయిర్ ఇండియా కాక్‌పిట్ సిబ్బందికి విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీటోక్యో మధ్య నడిచిన విమానాల్లో భద్రతా లోపాలు, నిబంధనల అతిక్రమణ ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా విమానాలను నడిపినందుకు ఈ నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్యంగా ఢిల్లీ నుంచి టోక్యో వెళ్లిన ఎఐ357, తిరుగు ప్రయాణంలో టోక్యో నుంచి ఢిల్లీ వచ్చిన ఎఐ358 విమానాల నిర్వహణలో లోపాలు జరిగినట్లు డీజీసీఏ గుర్తించింది.

ఈ విమానాలకు సంబంధించిన మినిమమ్ ఎక్విప్‌మెంట్ లిస్ట్ నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంది. ఇది కేవలం ఒక్కసారి జరిగిన పొరపాటు కాదని, గతంలోనూ వేరే సెక్టార్లలో ఇలాంటి ఉల్లంఘనలే జరిగాయని డీజీసీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్, సివిల్ ఏవియేషన్ నిబంధనల ప్రకారం.. బాధ్యులైన పైలట్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. మరోవైపు గత నెలలో ఢిల్లీముంబై విమానం (ఎఐ 887) ఇంజిన్ సమస్యతో వెనక్కి వచ్చిన ఘటనపైనా డీజీసీఏ విచారణ జరుపుతోంది. ఆ విమానం టేకాఫ్ అయిన కాసేపటికే రెండో ఇంజిన్‌లో ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోవడంతో పైలట్లు వెంటనే ఆ ఇంజిన్‌ను షట్ డౌన్ చేసి ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో వరుసగా సాంకేతిక లోపాలు తలెత్తుతున్నా వాటిని నడపడంపై డీజీసీఏ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ ఘటనలన్నింటిపైనా డైరెక్టర్ ఎయిర్ సేఫ్టీ పర్యవేక్షణలో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

## 'మాటా' రెండో కన్వెన్షన్‌లో పాల్గొనండి

### మంత్రి దామోదర రాజనర్సింహాను అమెరికాకు ఆహ్వానించిన సంస్థ ప్రతినిధులు

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** అమెరికాలో జరిగే మా అమెరికన్ తెలుగు అసోసియేషన్(మాటా) కన్వెన్షన్‌లో పాల్గొనాలని అసోసియేషన్ ప్రతినిదులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను ఆహ్వానించారు. జూన్ 19, 20 తేదీల్లో జరగనున్న 2వ కన్వెన్షన్‌లో పాల్గొనాలని ప్రతినిధులు కోరారు. మాటా ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రిని కలిసిన మాటా ప్రతినిదులు.. అమెరికాలోని గ్రేటర్ ఫిలిడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్‌లో జూన్ 19, 20 తేదీల్లో జరగనున్న ఆటా 2వ కన్వెన్షన్స్ (సంబరాలు)లో పాల్గొనాలని మంత్రిని ఆహ్వానించారు. మాటా అసోసియేషన్ చేస్తున్న హెల్త్ క్యాంప్‌ల ద్వారా చేపట్టిన సేవ కార్యక్రమాలను వివరించారు.

## న్యూఇయర్ వేళ పట్టుబడిన మందుబాబులు

### గ్రేటర్‌వ్యాప్తంగా 2,731 కేసులు నమోదు

### ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 1,ప్రభాతవార్త:** న్యూ ఇయర్ అంటే చాలు.. మద్యం ప్రియులకు పండగే పండగ.. కొత్త ఏడాదికి స్వాగతం పలికే జోష్ లో మద్యం తాగి రోడ్డెక్కి పోలీసులకు పట్టుబడ్డారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్లో పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పోలీసులు పదేపదే హెచ్చరికలు చేసినప్పటికీ మందుబాబులు మాత్రం లెక్కచేయకపోవడంతో భారీ సంఖ్యలో పట్టుబడ్డారు. మూడు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 2731 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. పట్టుబడిన వారందరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1198, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 928, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 605 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పోలీసుల చేతికి చిక్కారు. అలాగే ఫుల్లుగా మద్యం తాగి కొన్ని ప్రాంతాల్లో మందు బాబుల న్యూసెన్స్ చేయడంతో పోలీసులు వారితో వాదించాల్సి వచ్చింది. నాంపల్లి, వనస్థలిపురం వంటి ప్రాంతాల్లో మద్యం మత్తులో కొందరు హల్‌చల్ చేయడంతో.. పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. వనస్థలిపురంలో ఓ వ్యక్తిని డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేయగా.. కానిస్టేబుల్ తనను ఎందుకు కొట్టాడని రోడ్డుపై పడుకుని హల్ చల్ చేశాడు. పోలీసులు వచ్చేలోగా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలాగే న్యూసెన్స్ సృష్టించిన వారిపై కేసులు నమోదు చేశారు. మరోవైపు కొత్త సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి తెలంగాణ సచివాలయం, చార్మినార్, కేబీఆర్ పార్కు, మెహిదీపట్నంలో.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కేక్ కట్ చేశారు. నగర ప్రజలు, పోలీసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రతే తమకు ప్రాధాన్యమని, నేర రహిత నగరమే లక్ష్యమని సజ్జనార్ చెప్పారు.



## పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ దాడి నిజం కాదు!

### అమెరికా ఇంటెలిజెన్స్ సిఐఎ స్పష్టీకరణ

**వాషింగ్టన్, జనవరి 1:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అమెరికా గట్టి షాక్ ఇచ్చింది. క్రెమ్లిన్ ఆరోపించినట్లుగా ఉక్రెయిన్, పుతిన్‌ను హత్య చేయడానికి ప్రయత్నించలేదని అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ సీఐఏ స్పష్టం చేసింది. పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి యత్నించిందని రష్యా ఆరోపించింది. అయితే రష్యా అధ్యక్షుడి నివాసంపై ఉక్రెయిన్ దాడికి ప్రయత్నం చేసిందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని సీఐఏ తేల్చి చెప్పింది. పుతిన్ వ్యక్తిగత నివాసం ఉన్న ప్రాంతంలోని సైనిక లక్ష్యాలపై దాడి చేయాలని ఉక్రెయిన్ యోచిస్తోందని, ఆయన ఇంటికి అత్యంత సమీపంలో సైనిక స్థావరాలు ఏవీ లేవని ఒక అమెరికా అధికారి వెల్లడించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. నోవ్‌గొరొడ్ ప్రాంతంలో పుతిన్ వ్యక్తిగత నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని రష్యా ఆరోపించింది. దీనిని ఉగ్రదాడిగా క్రెమ్లిన్ పేర్కొంది. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను అన్నింటినీ నిర్వీర్యం చేశామని, నివాసానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని రష్యా పేర్కొంది. ఇందుకు సంబంధించిన విడియో దృశ్యాలను కూడా విడుదల చేసింది.


BAJAJ FINANCE

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్ది, పూణె - 411035

గోల్డ్‌లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్‌ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;

(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;

(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;

(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు

(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.

(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.

(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్‌ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్‌ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(10-02-26) ఆర్మూర్ - అంబేడ్కర్ చౌరాస్తా; PBV9SGL14295358, 14289972, 14289140, 14320855, 14319151. భోంగిర్ - హైదరాబాద్ రోడ్; PGC3SGL14999436, 15004487, 15006867, 14994735. భూపాల్‌పల్లి - మైన్ రోడ్; P79QGOL15026072, 15019997, 15021115, 15024976, 15014601, 15030867, 15028337, 15014631. గద్వాల్ - రాజీవ్ మార్గ్; PI85GOL15125792, 15121750, 15129526, 15118436, 15120532, 15126386. గజ్వేల్ - పిడ్చేడ్; PBW4SGL15133503, 15116646. గోదావరిఖని - కల్యాణ్ నగర్; PCR3SGL15127200. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PW65GOL15152711, 15151103, 15144686. (11-02-26) హుజూరాబాద్ - వరంగల్ రోడ్; PB92GOL15176773, 15178198. ఇబ్రాహింపట్నం - బీజీఎల్; P05IGOL15172368, 15178144, 15177447. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PJE3SGL15266255. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; PIY9GOL15278083, 15283122, 15273028, 15273052, 15275047, 15266203, 15270901, 15281603, 15277615, 15271738, 15277262. కరీంనగర్ - సివిఆర్ఎస్ రోడ్; PJF9GOL15277459, 15279774, 15267602. ఖమ్మం - గాంధీ చౌక్; PES3PRN15301962, 15306047, 15305978, 15302667, 15300299, 15297940, 15296624, 15296551, 15295822. (12-02-26) ఖమ్మం - జమ్మిబండ రోడ్; PNB6GOL15304003, 15305693, 15292777, 15296290. కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PCR3SGL15300712, 15295073. కోరుట్ల - బీజీఎల్; PG62SGL15296480, 15304793. కోస్టి - శివాజీ చౌక్; PEK3SGL15300200. కొత్తగూడెమ్ - మధుర బస్తి; PGE2SGL15292396, 15293161. మహబూబ్‌నగర్ - తెలంగాణ చౌరాస్తా; PI91GOL15352197, 15352608, 15357319, 15356271, 15357341, 15357110, 15348579. (13-02-26) మంచెరియాల్ - హైదరాబాద్ రోడ్; PGC4SGL15355955, 15359318, 15353162, 15344874, 15358148. మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్; PGC3SGL15347154, 15358782, 15348923, 15346617, 15347755, 15362096, 15360002, 15346445, 15344614, 15346721. మెటపల్లి - మైన్ రోడ్; PCZ6GOL15352787, 15354736, 15353765, 15358674, 15355468, 15347017, 15348863, 15359825, 15346780. మిర్యాలగూడ - బీజీఎల్; PZB4GOL15356582, 15348357, 15353267. ములుగు - గాంధీ చౌక్; P18IGOL15371876, 15379065, 15381271, 15381858, 15376545, 15374171. నాగర్‌కర్నూల్ - బీజీఎల్; PB63SGL15381013, 15372409, 15369625. నల్గొండ - ఆర్‌పి రోడ్; PCP8GOL15378756, 15371403. (16-02-26) నారాయణ్‌పేట్ - నర్సిరెడ్డి చౌరాస్తా; PAE2PFI15368928, 15381163, 15375356, 15372239, 15372740, 15373946, 15375195. నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PV99GOL15367504, 15369096. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PML9SGL15402033, 15402256, 15410098, 15407922, 15414465, 15407821, 15409876. నిజామాబాద్ - కపిలా హోటెల్ రోడ్; PG91GOL15407910, 15406774, 15402753. నిజామాబాద్ - వినాయక నగర్; PCP6GOL15416869, 15409146, 15406488, 15413552. పరిగి - బహార్‌పేట్; PF49GOL15417014, 15402883, 15402775. (17-02-26) పర్కల్ - బస్ స్టాండ్; P63FGOL15402622, 15406364, 15411799, 15417611, 15413786, 15412828, 15403397. పట్టన్‌చెరు - బీజీఎల్; P79QGOL15412036. పెద్దపల్లె - సుభాష్ నగర్; PF89GOL15403404, 15410976, 15413137, 15416638, 15414201, 15410353, 15407728, 15413654. సదాశివ్‌పేట్ - రాచయ్య నగర్; PB52GOL15461989, 15457553. సహదనగర్ వెంకటేశ్వర కాలోని; PV99GOL15451851, 15452886, 15463383, 15454723, 15453009. సంగారెడ్డి - బీజీఎల్; P7B7SGL15474508, 15487447, 15482025, 15478829, 15476079, 15496972. (18-02-26) సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PU41SGL15481881, 15490054, 15488080, 15481802, 15483407, 15477366. శంశాబాద్ - బీజీఎల్; P65HGOL15474748. సిద్దిపేట్ - మెదక్ రోడ్; PGH7SGL15478951, 15479675, 15488859, 15481289, 15488492, 15485918. సిర్సిల్లా - మెయిన్ రోడ్; PBX4GOL15498697, 15500117, 15498366, 15507075, 15505433, 15498476, 15502767, 15503914, 15508063. సూర్యపేట్ - గాంధీ విగ్రహం; P78KGOL15522164, 15523284, 15522476, 15525470, 15528730, 15524609. తాండూర్ - ఇందిరా చౌక్; P77QGOL15530321, 15520087. తూప్రాన్ - రామాయంపేట్ రోడ్; PCY1GOL15520051, 15520878, 15524525, 15519148, 15524730, 15520243, 15532777, 15526780, 15520941. (19-02-26) వనపర్తి - రాజీవ్ చౌక్; PG01SGL15552313, 15556796, 15551776, 15558525, 15564848, 15565199. వరంగల్ - కెయు క్రాస్ రోడ్; PG61GOL15562073. వరంగల్ - స్టేషన్ రోడ్; P21IGOL15558931, 15552662. వరంగల్ - సుబేదారీ; PGU1GOL15557091, 15561283. యెల్లందు - బుగ్గవాగు; PEL7GOL15561463, 15560536, 15563658, 15562200, 15553931, 15563290. జహీరాబాద్ - ఆర్‌టీసీ బస్ స్టాండ్; PV99GOL15551602, 15561059.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# ఫాస్టాగ్‌ల కోసం 'నో యువర్ వెహికిల్' ప్రక్రియ రద్దు



### ఫిబ్రవరి ఒకటి నుంచే ఉత్తర్వులు అమలులోకి..

**న్యూఢిల్లీ, జనవరి 1:** జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్రం నిబంధనలు సడలించింది. కార్లు, జీపులు, వ్యాన్‌లకు సంబంధించిన ఫాస్టాగ్‌ల కోసం నో యువర్ వెహికల్ (కెవైవి) ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు జాతీయ రహదారుల ప్రాధి కార సంస్థ (ఎన్‌హెచ్ ఎఐ) గురువారం ప్రకటించింది. ఈ కొత్త నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఊరట లభించనుంది. ఫాస్టాగ్ యాక్టివేట్ అయిన తర్వాత కేవైవీ పేరుతో ఎదురవుతున్న ఇబ్బందులు, జాప్యాన్ని నివారించేందుకే ఈ సంస్కరణ తీసుకొచ్చినట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ స్పష్టం చేసింది. వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు ఉన్నప్పటికీ, కేవైవీ అప్‌డేట్ కాలేదన్న కారణంతో వినియోగదారులు ఇబ్బందులు పడు తున్నారని, తాజా నిర్ణయంతో ఆ సమస్యలు తొలగిపోతాయని పేర్కొంది. కొత్త ఫాస్టాగ్ లకే కాకుండా, ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది.

ఫాస్టాగ్ దుర్వినియోగం, తప్పుగా జారీ చేయడం వంటి నిర్దిష్ట ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కేవైవీ అవసరమవుతుందని హైవేస్ అథారిటీ స్పష్టం చేసింది. ఎలాంటి ఫిర్యా దులు లేని పాత ఫాస్టాగ్‌లకు కేవైవీ తప్పనిసరి కాదు. వినియోగదారులకు ప్రక్రియను సులభతరం చేస్తూనే, వ్యవస్థలో పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేందుకు ఎన్‌హెచ్ఎఐ చర్యలు చేపట్టింది.

ఇకపై ఫాస్టాగ్ యాక్టివేషన్‌కు ముందే వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధ్రువీకరించుకోవాలని బ్యాంకులకు కఠిన నిబంధనలు విధించింది. ఒకవేళ వాహన్ పోర్టల్‌లో వివరాలు లేకపోతే, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సి) ద్వారా సరి చూసుకున్న తర్వాతే ఫాస్టాగ్‌ను యాక్టివేట్ చేయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో విక్రయించే ఫాస్టాగ్‌లకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది.

ఈ మార్పులతో వెరిఫికేషన్ బాధ్యత పూర్తిగా బ్యాంకులపైనే ఉంటుందని, వినియోగదారులకు ఇబ్బందులు లేని ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యమని ఎన్‌హెచ్ఎఐ తెలిపింది.

వార్త

ఐశ్వర్యానికి ఆభరణం మంచితనం, విద్యకు అలంకారం నీతి, ధనానికి అలంకారం దానం, అన్ని గుణాలకి అలంకారం మంచి శీలం.

-అబ్రహాం లింకన్

# ఆర్భాటాలే.. ఆచరణేది?


మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం, ఆవశ్యత గురించి పాలకపెద్దలు పదేపదేచెప్తుంటారు. అమ్మభాషలో ఉన్న ఆత్మీయత, ఆనందం మరెందులోనూ లభించదనేది తెలియని విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలకు లిపి లేకపోవడంతో విద్యారూపం అందించే ప్రయత్నాలు చేయకపోవడం వల్ల కాలగర్భంలో కలిసిపోయాయి. కలిసిపోతున్నాయి. దాదాపు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన తెలుగు భాష పరిస్థితి అంత ఆశాజనకంగా కన్పించడం లేదు. ఒకనాడు సంస్కృతి, ప్రాకృతం, అరబిక్, పార్శీ, ఉర్దూ, పోర్చుగీసు, ఇంగ్లీషుతోసహా అనేక భాషల ప్రభావం తట్టుకొని నిలబడగలిగిన తెలుగుకు ప్రస్తుతం ఆశించిన మేరకు చేతల్లో ఆదరణ లభించడం లేదేమోననిపిస్తున్నది. మాతృభాష అయిన తెలుగుపై పాలకులకు అభిమానం, ప్రేమ, వాత్సల్యం లేదనుకోలేం. తెలుగుకు ఉన్న ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇదంతా తెలుగుభాషపై ఉన్న మక్కువను చాటేందుకు తెలుగును నలుదిశగా వ్యాప్తి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలే. అందులో మరో వాదనకు తావులేదు. కానీ మరొకపక్క తెలుగు రాష్ట్రాల్లోనే క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు మోజులో పడి తెలుగుకు తీరని అన్యాయం చేస్తున్నారనే వాదనను కొట్టివేయలేం. తెలుగు భాషకు జరుగుతున్న ద్రోహం, అందువల్ల సామాన్యులు పడుతున్న ఇబ్బందుల గురించి ఆలోచిస్తే ఆవేదన కలుగక తప్పదు. ఇదంతా పరాయి ప్రభువులు చేస్తున్నది కాదు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు ప్రజల ప్రతినిధులమని చెప్పుకుంటున్న నేతలే కావడం విచారకరం. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిందనే విషయం వాస్తవం కావొచ్చు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంటే తెలుగు, తెలుగు అంటూ పరిమితులు గీసుకుంటే ఎలాఅని ప్రశ్నించేవారు ఉన్నారు. అభివృద్ధివైపు పరుగులు పెట్టొదని చెప్పడం లేదు. కానీ మాతృభాషపై అభిమానం పెంచుకోవడం తప్పుకాదు. అన్యభాషలను ద్వేషించమనిఅనడం లేదు. కానీ తెలుగు రాష్ట్రాల్లో మమ్మీ, డాడీ చదువులు ఆరంభమైన తర్వాత తెలుగులో బోధన దాదాపు అదృశ్యమైపోతుందనే చెప్పొచ్చు. తెలుగులో బోధించే ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలు దాదాపు మూతపడ్డాయని చెప్పొచ్చు. ఇంగ్లీషులో చదివించడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. తెలుగు మాట్లాడేవారిని ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచూపు చూడడం పరిపాటి అయిపోయింది. స్వాతంత్య్రం వచ్చినతర్వాత హిందీతో పోటీపడిన తెలుగు దేశంలోనే ప్రత్యేక స్థానమని చెప్పొచ్చు. ఒకప్పుడు రాజ్యాలేలిన భాషలు క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంటున్నాయి.ఐరోపాలో గ్రీక్, లాటిన్, భారత్‌లోసంస్కృతం తదితర భాషల పరిస్థితి అలాగేఉంది. కానీ ఎన్నోదేశాలు మాతృభాషలోనే విద్యాబోధన చేసుకుంటున్నాయి. ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఆంగ్లభాషలోకి భావాలను అనువదించుకుంటూ తల్లిభాషనుకాపాడుకుంటున్నాయి. జపాన్, సింగపూర్, కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్ మలేషియా, తదితర దేశాల్లో విద్యాబోధన పాఠశాలస్థాయిలో మాతృభాషలోనే జరుగుతున్నది. టాంజేనియా, జింబాబ్వే, తదితర ఆఫ్రికా దేశాలు పాఠశాల విద్యను మాతృభాషలోనే అందిస్తున్నాయి. ఇకరష్యా, ఫ్రాన్స్, చైనా, తదితర దేశాధ్యక్షులు, నేతలు ఆంగ్లభాషలో సరైనపరిజ్ఞానం ఉన్నా విదేశీ నాయకులతో తమతమ భాషల్లోనే మాట్లాడుతున్నారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో తమ భావాలను స్పష్టంగా తెలుగులో చెప్పగలిగినా ఆంగ్లంలో వ్యక్తం చేసేంత పరిజ్ఞానం లేకపోయినా వచ్చీరాని మాటలతో ప్రయత్నిస్తున్నారే తప్ప స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడటం నామోషిగా భావించే రోజులు దాపురించాయి. అధికారికంగా వెలువడే ఉత్తర ప్రత్యుత్తరాలు తొంభైశాతం వరకు ఆంగ్లంలోనే ఉంటున్నాయి. అలాని తెలుగుకు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. ఎన్నోచట్టాలు చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు.కానీ దశాబ్దాలు దాటిపోయినా అవినేటికీ అమలుకు నోచుకోవడం లేదు.అధికార భాషా సంఘాలను ఏర్పాటు చేశారు. ఏదో నామమాత్రపు అధికారాలే తప్ప అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకునే అధికారాలు నేటి వరకు ఇవ్వలేదు. గతంలో పనిచేసిన అధికార సంఘం అధ్యక్షులు జిల్లాల్లో పర్యటించి ఏమేరకు తెలుగును అమలు చేస్తున్నారు? చేయకపోతే ఎందుకుచేయలేదంటూ సమీక్షలు, సమావేశాలుపెట్టి సంబంధిత అధికారులను ప్రశ్నించడమేకాదు లిఖితపూర్వకంగా నోటీసులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు ఇంగ్లీషుకు అగ్రపీఠం వేస్తున్నారు. ప్రాథమిక తరగతి నుంచేప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషును ప్రవేశపెడుతున్నారు. జీవిత సారాంశాన్ని వడబోసి రచించిన సుమతీ, వేమన, దాశరథి లాంటి శతకాలు కనుమరగైపోతున్నాయి. క్రమేణ తెలుగుకు ఆదరణ తగ్గిపోతుందని తెలుగుభాషాభిమానులు పడే ఆవేదనను అర్థం చేసుకునేవారే లేకుండాపోయారు. ఇదంతా ఒక ఎత్తైతే ఉభయ రాష్ట్రాల్లో తెలుగు అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం వల్ల సామాన్యులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. గతంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. చార్జ్‌షీట్‌ను పకడ్బందీగా తయారుచేసి దాఖలు చేయకపోవడం వల్ల కేసులు వీగిపోతున్నాయనే విషయం బయటపడింది. ఒక్క పోలీసు శాఖలోనే కాదు మిగిలిన ప్రభుత్వ విభాగాల్లో కూడా ఇంగ్లీషులోనే ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం వల్ల సామాన్యులకు అర్థం చేసుకోవడం కష్టమైపోతున్నది. తెలుగుకు పుట్టినిల్లు అయిన తెలుగు రాష్ట్రాల్లోనే తెలుగు భాషకు ద్రోహం జరగడం ఏమాత్రం సమంజసం కాదు.

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.



సెనెకా

అణుకువ లేకపోతే అందం కూడా వికారంగా, అసహ్యంగా కనిపిస్తుంది.



వి.జాన్సన్

## ప్రజావాక్కు



### తవ్వకాలను ఆపివేయాలి

భారతదేశ పర్యావరణ సమతుల్యతలో ఆరావళి పర్వత శ్రేణుల పాత్ర అత్యంతకీలకం. ఈనేపథ్యంలో గౌరవనీయ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల తీసుకున్న నిర్ణయం పర్యావరణ పరిరక్షణ దిశగా ఒకఆశాజనక ముందడుగుగా నిలిచింది. నవంబర్ ఇరవైనాటి పాత ఉత్తర్వులను నిలిపివేసి, ఈఅంశాన్ని స్వయంగా పునఃసమీక్షించాలని న్యాయస్థానం నిర్ణయించడం ఉత్తర భారత పర్యావరణ భద్రతకు ఎంతో అవసరమైన చర్య. ఆరావళి పర్వతాల నిర్వచనం, ఎత్తు ఆధారిత వర్గీకరణ, పర్యావరణ కొనసాగింపు వంటి అంశాలను శాస్త్రీయంగా పరిశీలించేందుకు ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయం. న్యాయస్థానం పునరాలోచనచేపట్టిన తరుణంలో, ఆరావళి ప్రాంతానికి సంబంధించిన ప్రకటనలు, సర్వేలు, గనుల తవ్వకాలను తుది తీర్పు వచ్చేవరకు నిలిపివేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సిఎన్జి స్టేషన్ల సంఖ్యను పెంచాలి

నేటి ఆధునిక కాలంలో సిఎన్జి (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) వాహ నాల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. వివిధ కార్ల కంపెనీలు సిఎన్జివాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. దీంతోపాటు అనేకమంది సిఎన్జి కార్ల కొనుగోలు మీద మక్కువ చూపిస్తున్నారు. పెట్రోల్ డీజిల్‌తో పోలిస్తే ధర తక్కువగా వుంది. మైలేజీ రావడం జరుగుతుంది. కార్ల సంఖ్యకు అనుగుణంగా సిఎన్జి స్టేషన్లసంఖ్య తక్కువగా ఉండడంతో కార్లవాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాబట్టి ఆయా పెట్రోల్‌కంపెనీ యాజమాన్యాలు స్పందించి కార్ల వాహన దారుల అవసరార్థం సిఎన్జి స్టేషన్ల సంఖ్య పెంచాలి.

- కె. సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013భూసేకరణ చట్టంప్రకారం, భూమి ని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షి ంచి, రైతు ఉత్పత్తులకు అనుకూల మైనవిధంగా మార్చాలి. రైతుకు వాస్తవ లాభం చేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### న్యాయం,అన్యాయం అంతా అన్వయంలోనే

ఢిల్లీ హైకోర్టు తనతీర్పులో ఒకచట్టంలోని సెక్షన్‌ని అన్వయించే విధానంవల్ల సహజ న్యాయాన్ని సందిగ్ధతలోకినెట్టింది. అయితే సుప్రీం కోర్టు దాన్ని సరిదిద్ది న్యాయ వ్యవస్థ పట్ల నమ్మకాన్ని నిలబెట్టింది. 2017లో ఉత్తరప్రదేశ్, ఉన్నావ్‌లో ఒక మైనర్ బాలికపై అప్పటి శాసన సభ్యుడు, సెంగార్ అత్యాచారం చేశాడు. అంతేగాక ఆ బాలిక తండ్రిని హత్య చేయించాడు. కుటుంబ సభ్యులపైదాడి, బెదిరింపులు కొనసాగాయి. అయినా ఆ బాలిక తట్టుకుని, ధైర్యంగా నిలబడి న్యాయ పోరాటం చేస్తూ వస్తోంది. సుప్రీం కోర్టు ఆ రాష్ట్రంలో అయితే ముద్దాయి ప్రభావితం చేస్తాడన్న ఉద్దేశ్యంతో కేసుని ఢిల్లీ పరిధిలోకి మార్చింది. బాలికపై అత్యాచారం, ఆమె తండ్రి హత్య. ఈ రెండు కేసుల్లో నేర నిరూపణ జరిగి ట్రయిల్ కోర్టు తీర్పు మేరకు జైలుశిక్షలో ఉన్నాడు. ముద్దాయి హై కోర్టు కి అప్పీల్ చేయగా ఆ కోర్టు యావజ్జీవ శిక్ష ను తగ్గిస్తూ, బెయిల్ మంజూరు చేసింది. అలా చెయ్యడానికి చెప్పిన ప్రాతిపదిక ఏమంటే క్రింది కోర్టు విధించిన సెక్షన్ ప్రకారం ఆయన పబ్లిక్ సర్వెంట్ అయి ఉండాలని. కానీ చట్టంలో ఎమ్మెల్యే ఆ కేటగిరీ కిందికి వస్తున్నట్లు స్పష్టంగా లేదని. అక్కడ హీనమైన నేరం జరిగింది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### బంగ్లా పరిణామాలు

బంగ్లాలోపరిణామాలుదుఃఖంనుకలిగిస్తున్నాయి. మైత్రి బంధాలు వెల్లి విరియాల్సిన చోటఅపనమ్మకాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పుడు కలిదా జియా మరణంతో ఏ పరిణామాలు చోటు చేసుకుంటాయి అనేది కాలమే నిర్ణయిస్తుంది. కానీ షేక్ హాసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడం మూలంగా భారత్ ఒక అపప్రదనుమూటకట్టుకోవాల్సి వస్తుంది. అసలు బంగ్లాకుఏ మాత్రం చారిత్రక స్పృహ ఉన్నా భారత్‌ను నిందించకూడదు.

-భారత అవినాష్, జనగామ

### సర్పంచుల బాధ్యతలు

గ్రామ ప్రజలకు సంబంధించిన భూమి వివరాలు. భూమి విస్తీర్ణం. సర్వే నెంబర్లు, రెవిన్యూరికార్డులు, ఇండ్లస్థలాలు, వ్యవసాయ భూములు, ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల కోసం ఏర్పాటు చేసిన కాలనీలు వాటి వివరాలు వంటి విషయాలను వివాదాలనుపరిష్కరించడానికి ప్రభుత్వంతప్పనిసరిగా గ్రామ సర్పంచ్‌కీ కొన్ని అధికారాలు, హక్కులు కల్పించాలి. గ్రామాలలో భూ వివాదాలు, అక్రమ నిర్మాణాలు, ఎక్కువగా అవుతున్నాయి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామ రాజకీయాల్లో బీసీల దూకుడు!

**నేటి రాజకీయాల్లో డేటా శక్తి, మీడియా శక్తి అత్యంత కీలకమైంది. బీసీల జనాభా, విద్యా శాతం, గ్రామస్థాయిలో ప్రాతినిధ్యంపై సమగ్ర డాక్యుమెంట్లు, ఇన్ఫోగ్రాఫిక్స్, చిన్న వీడియోలు ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. యువత బిసి ఉద్యమాన్ని డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లో ముందుకు తీసుకెళ్తున్నారు. డేటా సేకరణ, చట్టపరమైన ముసాయిదాలు ప్రజా ఉద్యమ పర్వం, జాతీయ మద్దతు విస్తరణ, అమలు, స్థిరీకరణ, స్థానిక సంస్థల్లో బీసీ ప్రాతినిధ్యం బలపరచడం. ఈ మూడు సంవత్సరాలు బీసీ సామాజిక పునర్నిర్మాణానికి కీలకంగా మారబోతున్నాయి. తెలంగాణలో బీసీల 42శాతం రిజర్వేషన్ డిమాండ్ రాజ్యాంగ హక్కుల పోరాటం మాత్రమే కాదు అది తరతరాలుగా అణగారిన వర్గాల సామాజిక స్వాభిమాన యాత్ర. గ్రామంలోని బిసి ఓటు గ్రామంలోని బిసి నాయకత్వం, గ్రామంలోని బిసి ఐక్యత ఈ మూడుశక్తులు కలిసినాయి. ఈ సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి రిజర్వేషన్ ఉద్యమం విజయవంతం అవుతుంది. బీసీల ప్రాతినిధ్యం పెరగడం అంటే సామాజిక న్యాయం బలపడటం.**

డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు

తెలంగాణలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఒక స్పష్టమైన రాజకీయ సందేశాన్ని ఇచ్చాయి. ఇవి కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత అంశాలపై ప్రజలు ఇచ్చిన తీర్పు. ముఖ్యంగా రాష్ట్రంలో జరుగుతున్న పోరాటం 42శాతం బీసీ రిజర్వేషన్ విధానం ఎంత ప్రభావవంతమో ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టంగా చాటిచెప్పాయి. రిజర్వేషన్ అంటే అవకాశాల పరిమితి అన్న అపోహను ఈ ఎన్నికలు పూర్తిగా ఖండించాయి. బీసీలకు రిజర్వ్‌చేస్తామన్న పార్టీపరంగా చేసిన సీట్లు 42శాతమే అయినప్పటికీ, జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులు సుమారు 56శాతం సీట్లు గెలుచుకోవడం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన పరిణామం. ఇది బీసీలు ఇకపై కేవలం రిజర్వ్ సీట్లకే పరిమితం కాదన్న స్పష్టమైన సంకేతం. మొత్తం 12,707 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగగా, బీసీ రిజర్వేషన్ ద్వారా 2,275 సీట్లు, జనరల్ కేటగిరీ 5,190 సీట్లలో 2,738 సీట్లు బీసీ అభ్యర్థులే గెలుచుకున్నారు. మొత్తంగా 5,013 బీసీ సర్పంచులు ఎన్నికై, రాష్ట్రవ్యాప్తంగా 45.25 శాతం నమోదు చేశారు. జిల్లాలవారీగా చూస్తే బీసీల రాజకీయ బలం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. పెద్దపల్లి జిల్లాలో 63శాతంతో బీసీల విజయం అత్యధికంగా నమోదైంది. మొత్తం 18 జిల్లాల్లో బీసీల గెలుపు 50శాతం మించింది. ఇది గ్రామీణ రాజకీయాల్లో బీసీలు కేంద్ర శక్తిగా ఎదిగిన దానికి నిదర్శనం. ఈ ఫలితాలు ఓటర్ల తీర్పులో వచ్చిన మార్పును కూడా సూచిస్తున్నాయి. ఓటర్లు ఇక కేవలం కుల గుర్తింపులకే పరిమితం కావడం లేదు. పని తీరు, అనుభవం, ప్రజలతో అనుబంధం ఆధారంగా తీర్పు ఇస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య పరిపక్వతకు ఆరోగ్యకరమైన సూచన. రిజర్వేషన్‌వల్ల ప్రతిభ తగ్గుతుంది అన్న వాదనకు ఈ ఎన్నికలు గట్టి సమాధానం ఇచ్చాయి. రిజర్వేషన్ = అవకాశం, అవకాశం = అనుభవం, అనుభవం = పోటీ సామర్థ్యం ఈ సహజ క్రమమే బీసీలను జనరల్ రాజకీయ పోటీలో ముందుకు నడిపించింది. మొత్తంగా చెప్పాలంటే, తెలంగాణ పంచాయతీ ఎన్నికలు ఒక విషయాన్ని స్పష్టంగా నిరూపించాయి. బీసీ రిజర్వేషన్ సమాజాన్ని విభజించలేదు, రాజకీయాలను మరింత సమగ్రంగా మార్చింది. గ్రామ పాలనలో బీసీలు ఇక అనివార్య రాజకీయ శక్తిగా మారారని ఈ ఎన్నికలు చాటిచెప్పాయి. సామాజిక న్యాయం కోసం పునరుద్ధరిస్తున్న బీసీ ఉద్యమం గ్రామాల నుండి రాష్ట్రానికి పునర్నిర్మిస్తున్న సామాజిక న్యాయ పోరాటం ఇది. తెలంగాణలో బీసీ వర్గాలు 42శాతం రిజర్వేషన్ల కోసం కొత్త స్థాయిలో ఉద్యమం మొదలుపెట్టాయి. జనాభా నిష్పత్తి, ఆర్థిక వెనుకబాటు, విద్యాలోపాలు, రాజకీయ ప్రాతినిధ్యం ఇవన్నీ




కలిసి ఈ డిమాండ్‌కు బలమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి. ఈ డిమాండ్ ఇప్పుడు కేవలం రాజకీయ నినాదం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాఉద్యమం రూపం దాల్చుతోంది. బీసీ రిజర్వేషన్లకు శాశ్వత రక్షణ కల్పించాలంటే, తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లుని 9వ షెడ్యూల్‌లో చేర్చడం తప్పనిసరి. ఇది కోర్టుల జోక్యాన్ని తగ్గించి, రిజర్వేషన్లను శాశ్వతంగా నిలబెడుతుంది. ఈ దిశగా బీసీ కమిషన్ బలోపేతం, నిర్వహణ, డేటా ఆధారిత సమగ్ర నివేదికలు అవసరం. తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ఈ ఉద్యమానికి అపూర్వ అవకాశంగా కనిపిస్తున్నాయి. గ్రామ స్థాయి బిసి నాయకత్వం బలపడితే స్థానిక పాలనలో బీసీల నిర్ణయాధికారం పెరుగుతుంది, అనే దానికి ఊపు ఇచ్చింది. జిల్లా-మండల స్థాయిలో బిసి ప్రభావం పెరుగుతుంది, 42 శాతం రిజర్వేషన్ల ఉద్యమానికి నేలస్థాయి బలం ఏర్పడుతుంది అనే దానికి నిదర్శనం. గ్రామం మారితేనే రాష్ట్రం మారుతుంది" అనే మాట ఈ సందర్భంలో మరింత ప్రాముఖ్యం సంతరించుకుంది. 42శాతంబీసీ రిజర్వేషన్ల డిమాండ్‌ను అమలు చేయాలంటే తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినా, పార్లమెంటులో అన్ని పార్టీల మద్దతు కావాలి. జాతీయ స్థాయి బిసి సంఘాలలోడిమాండ్ ఒక పార్టీది కాదు. ఇది రాష్ట్ర ప్రజా డిమాండ్‌గా మారాలి. కులసంఘాల ఐక్యతే ఈ పోరాటానికి శక్తి, తొలిసారి బీసీలలో వందలాది కులాలు ఒకే వేదికపైకి వస్తున్నాయి. బీసీ జేఏసీ, విద్యార్థి సంఘాలు, ఉద్యోగి సంఘాలు, మహిళా సంఘాలు కలిసి రాష్ట్రవ్యాప్తంగా యాత్రలు, అవగాహన సదస్సులు, శాంతియుత ధర్నాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి గ్రామం ఒక బీసీ హక్కుల కేంద్రంగా మారాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. నేటి రాజకీయాల్లో డేటా శక్తి, మీడియా శక్తి అత్యంత కీలకమైంది. బీసీల జనాభా, విద్యా శాతం, గ్రామస్థాయి ప్రాతినిధ్యంపై సమగ్ర డాక్యుమెంట్లు, ఇన్ఫోగ్రాఫిక్స్, చిన్న వీడియోలు ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. యువత బిసి ఉద్యమాన్ని డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లో ముందుకు తీసుకెళ్తున్నారు. డేటా సేకరణ, చట్టపరమైన ముసాయిదాలు ప్రజా ఉద్యమ పర్వం, జాతీయ మద్దతు విస్తరణ, అమలు, స్థిరీకరణ, స్థానిక సంస్థల్లో బీసీ ప్రాతినిధ్యం బలపరచడం. ఈ మూడు సంవత్సరాలు బీసీ సామాజిక పునర్నిర్మాణానికి కీలకంగా మారబోతున్నాయి. తెలంగాణలో బీసీల 42శాతం రిజర్వేషన్ డిమాండ్ రాజ్యాంగ హక్కుల పోరాటంమాత్రమే కాదు అది తరతరాలుగా అణగారిన వర్గాల సామాజిక స్వాభిమాన యాత్ర. గ్రామంలోని బిసి ఓటు గ్రామంలోని బిసి నాయకత్వం, గ్రామంలోని బిసి ఐక్యత ఈ మూడుశక్తులు కలిసినాయి. ఈ సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి రిజర్వేషన్ ఉద్యమం విజయవంతం అవుతుంది. బీసీల ప్రాతినిధ్యం పెరగడం అంటే సామాజిక న్యాయం బలపడటం.

# ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతామా?

తిప్పర్తి శ్రీనివాస్

కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తున్న సాంకేతిక విప్లవంగా నిలుస్తోంది. ఒకప్పుడు సినిమాలు, కథల్లో మాత్రమే చూసిన యంత్ర మేధస్సు నేడు మన దైనందిన జీవితంలో భాగమైపోయింది. మొబైల్ ఫోన్‌లో వాయిస్ అసిస్టెంట్ నుంచి బ్యాంకింగ్, వైద్యం, విద్య, పరిశ్రమల వరకూ ఎఐ వినియోగం విస్తరిస్తోంది. అయితే ఈ వేగవంతమైన మార్పులతో పాటు సమాజంలో ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎఐ వల్ల ఉద్యోగాలు పోతాయా? లేక కొత్త ఉద్యోగాలు పుడతాయా? అనే సందేహం సామాన్యుల నుంచి నిపుణుల వరకూ అందరినీ ఆలోచింపజేస్తోంది. ఎఐ ప్రవేశంతో కొన్ని ఉద్యోగాలు ప్రమాదంలో పడటం అనివార్యమనే అభిప్రాయం విస్తృతంగా ఉంది. ముఖ్యంగా పునరావృతంగా జరిగే పనులు, నిర్దిష్ట విధానంలో చేయాల్సిన ఉద్యోగాలను ఎఐ సులభంగా భర్తీ చేయగలుగుతోంది. ఉదాహరణకు డేటాఎంట్రీ, కాల్ సెంటర్లలో సాధారణ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, ఫ్యాక్టరీల్లో యంత్రాల ఆపరేషన్, బ్యాంకుల్లో కొన్ని లావాదేవీలు వంటి పనులు ఇప్పటికే ఆటోమేషన్‌కు లోనవుతున్నాయి. ఒకప్పుడు వందల మంది చేసే పనిని ఇప్పుడు కొద్దిమంది పర్యవేక్షణతో యంత్రాలు చేస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగాలు తగ్గుతున్నాయనే భావన సహజంగానే కలుగుతోంది. అయితే ఇది ఎఐ కథలో ఒకే ఒక వైపు మాత్రమే. చరిత్రను పరిశీలిస్తే ప్రతి సాంకేతిక విప్లవం ప్రారంభంలో ఇలాంటి భయాలను రేకెత్తించింది. పరిశ్రమల విప్లవ కాలంలో యంత్రాలు వచ్చినప్పుడు కూడా మనుషుల పనులు పోతాయి అనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కానీ కాలక్రమేణా కొత్త పరిశ్రమలు, కొత్త నైపుణ్యాలు, కొత్త ఉద్యోగాలు పుట్టుకొచ్చాయి. అదే విధంగా ఎఐ కూడా కొన్ని ఉద్యోగాలను తగ్గించినా, అంతకన్నా ఎక్కువగా కొత్త అవకాశాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంది. ఎఐ వల్ల పుట్టుకొస్తున్న కొత్త ఉద్యోగాలను గమనిస్తే ఈ విషయం మరింత స్పష్టమవుతుంది. డేటా సైంటిస్టులు, మెషీన్ లెర్నింగ్ ఇంజినీర్లు, ఎఐ ట్రైనర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణులు వంటి ఉద్యోగాలు గత దశాబ్దం క్రితం పెద్దగా లేవు. నేడు ఇవి అత్యంత డిమాండ్ ఉన్న వృత్తులుగా మారాయి. అంతేకాదు, ఎఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడమే కాకుండా వాటిని పర్యవేక్షించడం, నైతికంగా ఉపయోగిస్తున్నామా లేదా అన్నదాన్ని చూసే ఎఐ ఎథిక్స్ నిపుణుల అవసరం కూడా పెరుగుతోంది. ఇక్కడ ఒక



ముఖ్యమైన అంశం మనం గమనించాలి. ఎఐ మనుషులను పూర్తిగా భర్తీ చేయడం కన్నా, మనుషులకు సహాయకుడిగా పనిచేసే అవకాశమే ఎక్కువ. వైద్య రంగాన్ని తీసుకుంటే, ఎఐ స్కాన్లు విశ్లేషించి వ్యాధులను త్వరగా గుర్తించడంలో సహాయపడుతోంది. కానీ తుది నిర్ణయం, రోగితో మానవీయంగా మాట్లాడి చికిత్స ఇవ్వడం మాత్రం డాక్టర్‌దే. విద్య రంగంలో ఎఐ ఆధారిత లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు విద్యార్థుల స్థాయిని అంచనా వేసి వ్యక్తిగతంగా పాఠాలు సూచిస్తున్నాయి. అయినా ఉపాధ్యాయుడి పాత్ర పూర్తిగా తగ్గిపోలేదు. మార్పు చెందింది, కానీ అవసరం తగ్గలేదు. భారతదేశం వంటి యువ జనాభా ఎక్కువగా ఉన్న దేశానికి ఎఐ ఒక పెద్ద సవాల్‌తో పాటు గొప్ప అవకాశంగా కూడానిలుస్తోంది. సరైన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. కానీ అదే సమయంలో కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. అందుకే ఇప్పుడు అవసరమైంది రిస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్. అంటే ఉన్న ఉద్యోగాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, మారుతున్న అవసరాలకు తగినట్లుగా మనల్ని మనం మార్చుకోవడం. ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రములు ఈ విషయంలో కీలకపాత్ర పోషించాలి. పాఠశాలస్థాయి నుంచే డిజిటల్ లిటరసీ, కోడింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలు నేర్పించాలి. కళాశాలల్లో కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలి. పరిశ్రమలు కూడా ఉద్యోగులకు నిరంతర శిక్షణ అందిస్తూ మార్పులకు సిద్ధం చేయాలి. అప్పుడే ఎఐ వల్ల కలిగే నష్టాన్ని తగ్గించి, లాభాన్ని పెంచుకోవచ్చు. ఎఐతో మరో కీలకమైన చర్చ నైతికతకు సంబంధించినది. యంత్రాలు తీసుకునే నిర్ణయాల్లో మానవ విలువలు, సమానత్వం, న్యాయం ప్రతిబింబించాలా? ఉద్యోగ నియామకాలు, లోన్లు, భద్రత వంటి విషయాల్లో ఎఐ తప్పులు చేస్తే బాధ్యత ఎవరిది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకడం కూడా భవిష్యత్ ఉద్యోగాల్లో భాగం కానుంది. అంటే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక బాధ్యత కలిగిన ఆలోచన అవసరం అవుతుంది. ఎఐ వల్ల ఉద్యోగాలు పూర్తిగా నశించిపోతాయనే భయం అతిశయోక్తి. కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు తగ్గినా, కొత్త రంగాలు, కొత్త వృత్తులు తప్పకుండా పుడతాయి. మార్పును అడ్డుకోవడం సాధ్యం కాదు, కానీ దానికి సిద్ధమవడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. భయంతో వెనక్కి తగ్గడం కాకుండా, జ్ఞానంతో ముందుకు సాగితే ఎఐ మన శత్రువు కాదు మన సహచరుడిగా మారుతుంది. రేపటి ఉద్యోగ ప్రపంచంలో విజయం సాధించేది యంత్రాలతో పోటీ పడే వారు కాదు, యంత్రాలతో కలిసి పనిచేసే వారు అనే నిజాన్ని గ్రహించినప్పుడే భవిష్యత్ భద్రమవుతుంది.

# బస్సుల్లో సౌకర్యం కంటే భద్రతే ముఖ్యం!

జి.సత్యనారాయణరాజు

ఈ మధ్య తరచూ స్లీపర్ బస్సు ప్రమాదాల గురించి చదువుతున్నాం. ఈ ప్రయాణం సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, ఇటీవల పెరుగుతున్న ప్రమాదాల కారణంగా భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్లీపర్ బస్‌లు అగ్ని ప్రమాదాలకు గురికావడం, అందులోని ప్రయాణికులు మంటలకు ఆహుతై పదుల సంఖ్యలో చనిపోవడం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో జరిగిన స్లీపర్ బస్ ప్రమాదంలో 20మందికి పైగా చనిపోవడం అందరినీ కలచివేసింది. కర్ణాటకలోని చిత్రదుర్గలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 20మందికి పైగా సజీవ దహనమయ్యారు. హైవేపై బస్సు వేగంగా వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ఓ కంటైనర్ లారీ.. అకస్మాత్తుగా డివైడర్‌ను దాటుకొని వచ్చి బస్సును ఢీకొట్టింది. సరిగ్గా బస్సు డీజిల్ ట్యాంక్ వద్ద ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్లీపర్ బస్సులో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకునేలోపే, మంటల్లో కాలి బూడిదయ్యారు. స్లీపర్ బస్సులు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ అగ్నిప్రమాదాలు, ప్రమాదాల సమయంలో భద్రతపై ఆందోళనలు ఉన్నాయి. ఎందుకంటే ఎగువ బెర్తులలో ఉన్న వారు త్వరగా బయటపడటం కష్టం. కొన్నిబస్సులలోసరైన అత్యవసర నిష్క్రమణలు, వెంటిలేషన్ ఉండవు. చైనావంటి దేశాలు వీటిని నిషేధించాయి. కాబట్టి పేరున్న ఆపరేటర్లను ఎంచుకోవడం భద్రతా లక్షణాలను తనిఖీ చేయడం బస్సు రోడ్డుమీద వేగంగా వెళుతున్నప్పుడు రోడ్డుపై ఏవైనా వాహనాలు ఆగిఉంటే వాటిని ఢీకొనడం ద్వారా నిప్పు అంటుకున్నప్పుడు, మూసి ఉన్న బస్సులలో పొగ వేగంగా వ్యాపిస్తుంది. నిద్రలో ఉన్న ప్రయాణికులను మేల్కొలపడంకష్టం. ప్రమాదాలు జరిగినప్పుడు, పొడవైన బెర్తులు ప్రయాణీకులకు సురక్షితం కాకపోవచ్చు, ఎందుకంటే ఇది గాయాలకు దారి తీయవచ్చు. అధిక లోడింగ్ వల్ల భద్రత మరింత తగ్గుతుంది. సరైన ఫ్యాక్టరీబిల్ట్ మోడళ్ల లేకపోవడం సమస్యగా మారుతోంది. చైనా, బంగ్లాదేశ్ వంటివి స్లీపర్ బస్సులను భద్రతా కారణాల వల్ల నిషేధించాయి. స్లీపర్ బస్సులు సౌకర్యవంతమైనవే కానీ భద్రతాపరంగా సరైనవి కావు. వాటి భద్రత చాలావరకు బస్సు నాణ్యత, ఆపరేటర్ నిబంధనలు అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతపై ఆధారపడి ఉంటుంది. స్లీపర్ బస్సులలో సీట్లకు బదులుగా వాలు పడకలు అమర్చబడి ఉంటాయి. సాధారణ పరిస్థితులలో ప్రయాణానికి సురక్షితంగా ఉంటాయి. చాలా సందర్భాల్లో భద్రతా సమస్యలకు అవే కారణం అవుతాయి. ఒకవేళ స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురైతే బస్సులో ఉండే లాంగిట్యూడినల్ బెర్త్ డిజైన్, తలపై బలంగా తగిలి పెద్ద గాయాలకుకారణం అవుతుంది. వెన్నెముక సంబంధ గాయాలవుతాయి. రాత్రి పూట జర్నీ కారణంగా డ్రైవర్ అలసటకు గురయ్యే అవకాశం ఉంటుంది. తక్కువ లైటింగ్, వంకర రోడ్లు ప్రమాద అవకాశాలను పెంచుతాయి. డ్రైవర్లకు అలసట వస్తే కాసేపు



విశ్రాంతి తీసుకునే అవకాశం ఉండదు. ఎందుకంటే సరైన సమయానికి వారిని వారి గమ్యస్థానాలకు చేర్చాలి. స్లీపర్ బస్సులలో ప్రయాణించడం వల్ల పలురకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. విండోలు మూసివేయడం వల్ల వాంతులు, వికారం లాంటివి కలుగుతాయి. స్లీపర్ బస్సుల్లో ప్రయాణించేవారికి వెన్నెముక, మెడపై ఒత్తిడి కలుగుతుంది. ముఖ్యంగా సుదూర ప్రయాణంలో ఈ సమస్యలు తలెత్తుతాయి. స్లీపర్ బస్సులలో ప్రయాణం చేసే సమయంలో టాయిలెట్స్‌కు ఇబ్బంది ఉండటం వల్లన తక్కువగా నీళ్లు తాగుతారు. సేఫ్‌గా జర్నీచేయాలనుకునే ప్రయాణీకులు అనుభవం ట్రావెల్స్ బస్సులను ఎంచుకోవాలి. మొదట్లో కొద్దిపాటి స్లీపర్ బస్సులే నడిచేవి. క్రమంగా ఎక్కువ మంది ప్రైవేట్ ట్రావెల్ నిర్వా హకులు, సాధారణ సీటింగ్ బస్సులను స్లీపర్ బస్సులుగా మార్చి, ఎక్కువ టికెట్ ధరలు వసూలు చేయడం ప్రారం భించారు. ఇప్పుడు చాలా బస్సుల్లో 35 నుండి 40 వరకు బెర్తులు ఉండటంతో అటూ ఇటూ కదలడం కష్టంగా ఉంటోంది. మామూలుగా చిన్నా చితకా అగ్ని ప్రమాదానికిగురైన సమయాల్లో ప్రాణనష్టం తక్కువే ఉంటుంది. కానీ అగ్ని ప్రమాదం సంభవిస్తే ప్రయాణికులు తేరుకునేలోగానే అగ్నికీలలు వారిని ఎలా ముంచెత్తుతాయి. తాజాగా కర్ణాటకలో జరిగిన మరో బస్సు ప్రమాదంలో 13మంది మృతి చెందారు. సెప్టెంబర్ 14న రాజస్థాన్‌లో దగ్ధమైన ప్రైవేటుట్రావెల్స్ బస్సు. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సులో భారీగా మంటలు చెలరేగి 20మంది సజీవదహనమయ్యారు. సెప్టెంబర్ 23న పెళ్లి బృందం బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. వెంటనే అప్రమత్తమైన అందరూ కిందకు దిగిన తర్వాత బస్సు దగ్ధమైంది. సెప్టెంబర్ 26న హైద రాబాద్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మంటలు వ్యాపించాయి. వెంటనే స్పందించడంతో ప్రాణ నష్టం సంభవించలేదు. అక్టోబర్ 24న కర్నూలులో ట్రావెల్స్ బస్సు ప్రమాదం. అర్ధరాత్రి బైక్‌ను బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో 19 మందిమృతి చెందారు. అక్టోబర్ 26న యూపీలో స్లీపర్ బస్సులో మంటలు చెలరేగాయి. అక్టోబర్ 29న మహారాష్ట్రలోని సమృద్ధి హైవేపై బస్సులో మంటలు వ్యాపించాయి. ఈఏడాది నవంబర్ 3న చేవెళ్ల బస్సు ప్రమాదంలో 19మంది దుర్మరణం పాలయ్యారు. డిసెంబర్ 12న మారేడుమిల్లి వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులోయలో పడి తొమ్మిది మంది మరణించారు. దీంతో రాత్రిళ్ళు ఈ రూట్‌లో బస్ ప్రయాణాలను నిషేధించారు. డిసెంబర్ 16న యూపీలోని మథురవద్ద ఎక్స్‌ప్రెస్ హైవేపై పొగ మంచు కారణంగా బస్సులు ఢీకొనడంతో వాహనాల్లో మంటలు చెలరేగి 13 మంది మరణించారు. డిసెంబర్ 24న తమిళనాడులో ఓ బస్ రెండు కార్లను ఢీకొనడంతో తొమ్మిదిమంది మృత్యువాత పడ్డారు. డిసెంబర్ 25న కర్ణాటకలో బస్సు ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. డిసెంబర్ 26న గుంటూరు జిల్లా నల్లపాడులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మరణించారు. స్లీపర్ బస్సుల్లో ఎగువ బెర్త్‌కంటే సురక్షితమైనది ఏదీలేదు. బస్సులో ప్రయాణించేటప్పుడు మీ వస్తువులను భద్రంగా ఉంచుకోవాలి. ప్రయాణీకులు సౌకర్యంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వాలు కఠినమైన తనిఖీలు నిర్వహించాలని నిపుణులు సూచిస్తున్నారు.




## క్రాన్స్‌మోంటానా రిసార్ట్‌లో

# భారీ అగ్నిప్రమాదం

## 40 మందికిపైగా మృతి

**బెర్న్, జనవరి 1:** స్విట్జర్లాండ్‌లో నూతన సంవత్సర వేడుకలు తీవ్ర విషాదాంతమయ్యాయి. క్రాన్స్ మోంటానా అనే ప్రముఖ లగ్జరీ స్కీ రిసార్ట్‌లోని ఓ బార్‌లో గురువారం తెల్లవారుజామున భారీ పేలుడు సంభవించింది. లీ కాన్స్టలేషన్ అనే బార్‌లో పర్యాటకులు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 40 మంది మృతిచెందగా, అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగిన సమయంలో బార్‌లో 100 మందికి పైగా పర్యాటకులు ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 1:30 గంటల ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. వాలిస్ కంటోన్ పోలీసుల వివరాల ప్రకారం పేలుడు ధాటికి మంటలు చెలరేగాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీస్ ప్రతినిధి గేటన్ లాథియన్ వార్తా సంస్థలకు వివరించారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది సెలవుల కోసం వచ్చిన విదేశీ పర్యాటకులేనని ఆయన పేర్కొన్నారు. మరోవైపు స్థానిక పత్రిక లీ నోవెల్లిస్ట్ కథనం ప్రకారం ఈ ప్రమాదంలో దాదాపు 40 మంది మరణించారని, 100 మందికి పైగా గాయపడ్డారని అంచనా వేస్తున్నారు. అయితే మరణాల సంఖ్యపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఓ సంగీత కచేరీ సందర్భంగా కాల్చిన బాణాసంచా వల్లే మంటలు అంటుకుని పేలుడు సంభవించి ఉండవచ్చని స్విస్ మీడియా సంస్థ బ్లిక్ అనుమానం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు. హెలికాప్టర్ల ద్వారా క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో నో ఫ్లై జోన్ విధించారు. బాధితుల బంధువుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు.

## దేశ సమగ్రతకు మతసామరస్యమే ప్రధానం

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**న్యూఢిల్లీ, జనవరి 1:** సామాజిక సామరస్యంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలకు బీజేపీ గురువారం పూర్తి మద్దతు తెలిపింది. దేశ ప్రజలందరూ కులం, ధనం, భాష అనే భేదాలను పక్కనపెట్టి, విభజన రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని భగవత్ పిలుపునిచ్చారు. దేశం ఏ ఒక్క వర్గానిదో కాదని, ఇది అందరిదని ఆయన స్పష్టం చేశారు. డెహ్రాడూన్‌లో త్రిపుర విద్యార్థి ఏంజెల్ చక్మా హత్య, జాత్యహంకార దాడి ఆరోపణల నేపథ్యంలో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్న సమయంలో భగవత్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశ సమగ్రతకు సామరస్యమే ప్రధానమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్, భగవత్ సరైన స్ఫూర్తితో మాట్లాడారని కొనియాడారు. సమాజాన్ని ఏకం చేస్తూ, భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా అందరినీ కలుపుకుపోవడమే తమ విధానమని తెలిపారు. బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ స్పందిస్తూ భారతలో నివసిస్తూ వందేమాతరం అనే ప్రతి ఒక్కరూ భారతీయులేనని, విశాల దృక్పథంలో హిందువులేనని అన్నారు. మతం ఏదైనా భారతను తమ మాతృభూమిగా భావించే వారందరూ భారతీయులేనని, భగవత్ వ్యాఖ్యల అర్థం సత్యమని పేర్కొన్నారు. శివసేన నేత షైనా ఎన్సీ కూడా భగవత్ పిలుపును స్వాగతించారు. గుడి, మంచినీటి వనరులు, శ్మశానవాటికల వంటి బహిరంగ ప్రదేశాల్లో ఎవరిపైనా వివక్ష ఉండకూడదని, అందరికీ సమాన ప్రవేశం ఉండాలని ఆమె గుర్తుచేశారు. నిజమైన సామరస్యం వివక్షను వీడటంతోనే మొదలవుతుందని భగవత్ స్పష్టం చేశారు.

# రష్యాపై డ్రోన్ దాడి




- 24 మంది మృతి, 50మందికి పైగా గాయాలు
- నూతన సంవత్సర వేడుకల్లో విషాదం
- ఇది ఉక్రెయిన్ పనే: మాస్కో ఆరోపణ

**మాస్కో, జనవరి 1:** రష్యా నియంత్రణలోని ఖేర్సన్ ప్రాంతంలో భారీగా డ్రోన్ దాడులు జరిగాయి. నూతన సంవత్సర వేడుకలు జరుపుతున్న ఓ ఆవాసంపైనా డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోగా, 50 మందికి పైగా గాయపడ్డారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఖేర్సన్ రీజియన్‌లోని నల్ల సముద్రం తీరంలో ఉన్న ఖోర్లీ గ్రామంలో కేఫ్ అండ్ హోటల్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఆ సమయంలో అక్కడ న్యూఇయర్ సెలబ్రేషన్స్ జరుగుతున్నాయి. ప్రజలంతా పార్టీని ఎంజాయ్ చేస్తున్నారు. అదే అదునుగా ఉక్రెయిన్ దాడికి దిగింది. ఈ దాడిలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 50 మంది వరకూ గాయపడ్డారు. ఈ విషయాన్ని ఖేర్సన్ గవర్నర్ వ్లాదిమిర్ సాల్డో వెల్లడించారు. ఉక్రెయిన్ ఈ దారుణానికి పాల్పడిందని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్లాదిమిర్ సాల్డో తెలిపారు. అర్ధరాత్రి వేళ పౌరులే లక్ష్యంగా జరిగిన ఈ ఘటన అత్యంత క్రూరమైనదిగా అభివర్ణించారు.

## 'బ్యాడ్‌బాయ్ బిలియనీర్స్'..

## నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌కు కోర్టు స్టే ఎత్తివేత




**హైదరాబాద్, జనవరి 1:** ఐటీ దిగ్గజం సత్యం కంప్యూటర్స్ వ్యవస్థాపకుడు రామలింగరాజుకు కోర్టులో చుక్కెదురైంది. నెట్‌ఫ్లిక్స్ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన బ్యాడ్ బాయ్ బిలియనీర్స్: ఇండియాడాక్యుమెంటరీ సిరీస్‌లో సత్యం కుంభకోణం ఎపిసోడ్ స్ట్రీమింగ్‌పై విధించిన స్టేను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఎత్తివేసింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నాలుగో ఎపిసోడ్ రైడింగ్ ది టైగర్ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చింది. 2020లో నెట్‌ఫ్లిక్స్ విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, సుబ్రతా రాయ్, రామలింగరాజుల ఆర్థిక నేరాలపై ఒక ఇన్వెస్టిగేటివ్ సిరీస్‌ను ప్రకటించింది. తన ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని, తనపై జరుగుతున్న విచారణ ప్రభావితం అవుతుందని రామలింగరాజు 2020 సెప్టెంబర్‌లో హైదరాబాద్ కోర్టును ఆశ్రయించారు. అప్పట్లో కోర్టు స్టే ఇవ్వడంతో మిగిలిన మూడు ఎపిసోడ్లు విడుదలైనప్పటికీ సత్యం ఎపిసోడ్ మాత్రం నిలిచిపోయింది. ఈ కేసును సుదీర్ఘంగా విచారించిన సిటీ సివిల్ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించారు. ఈ డాక్యుమెంటరీ కేవలం పబ్లిక్ రికార్డులు, వార్తా పత్రికల్లో వచ్చిన సమాచారం, లిఖితపూర్వక పత్రాల ఆధారంగానే రూపొందించబడిందని కోర్టు అభిప్రాయపడింది.

ఇందులో రామలింగరాజు వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసే ప్రయత్నం జరగలేదని, ప్రజలకు ఒక చారిత్రక ఆర్థిక మోసం గురించి వివరించడమే దీని ఉద్దేశమని నెట్‌ఫ్లిక్స్ వాదనతో కోర్టు ఏకీభవించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు త్వరితగతిన విచారణ పూర్తి చేసిన కోర్టు, గతంలో ఇచ్చిన స్టేను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

# పాక్, భారత్ అణుకేంద్ర జాబితాల మార్పిడి

## తమ దేశాల్లోని ఖైదీల వివరాలు కూడా ఇచ్చిపుచ్చుకున్న వైనం



**న్యూఢిల్లీ, జనవరి 1:** భారత్ పాకిస్తాన్‌లు కొత్త సంవత్సరంలో కీలక అవగాహనకు వచ్చాయి. తమతమ దేశాల్లో ఉన్న అణు వ్యవస్థలు, తమ తమ దేశాల్లో ఉన్న ఖైదీల వివరాలను పరస్పరం మార్పిడిచేసుకున్నాయి. ద్వైపాక్షిక బంధం దారుణంగా క్షీణించడం, గత మేనెలనుంచి కూడా రెండుదేశాల సంబంధాలు అథమస్థాయికి చేరుకున్న తరుణంలో ఈ కీలక పరస్పర మార్పిడి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఖలీదా జియా అంత్యక్రియలకు వెళ్లిన భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ ఆయాజ్ సాదిక్‌తో భేటీ అయి పరస్పరం చర్చించారు. రెండుదేశాలమధ్య కీలక ఉన్నతస్థాయి ప్రతినిధులు కలుసుకోవడం కూడా ఇదే మొదటిసారి. ఆపరేషన్ సింధూర్ తర్వాత అటు పాక్ స్పీకర్, ఇటు విదేశాంగ మంత్రుల భేటీ కీలకంగా మారింది. న్యూక్లియర్ వ్యవస్థలపై ఎట్టిపరిస్థితుల్లోను దాడులుచేయకూడదని చేసుకున్న ఒప్పందం ప్రకారం అణు కేంద్రాల జాబితాలను రెండుదేశాలు మార్పిడి చేసుకున్నాయి. దౌత్యమార్గాలకు మాత్రమే పరిమితంచేయాలని ఆనాటి ఒప్పందంలో ఉంది. 1992 నుంచి కూడా రెండుదేశాలమధ్య ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఒప్పందం 1988లో సంతకాలు జరిగాయి. 1991 నుంచి అమలులోకి వచ్చింది. భారత్, పాకిస్తాన్‌లు రెండుదేశాలు కూడా పరస్పరం తమ వద్ద ఉన్న అణు వ్యవస్థల వివరాలను జాబితాలరూపంలో మార్పిడిచేసుకోవాలి. ప్రతి ఏటా జనవరి ఒకటవ తేదీ ఇలా జరుగుతుంది. వరుసగా 35వ సారి కొత్తసంవత్సరంలో ఈ భేటీ జరిగినపరస్పర మార్పిడి జరిగింది. అలాగే 2008లో జరిగిన కాన్సులర్ యాక్సెస్ ఒప్పందం ప్రకారం రెండుదేశాలు కూడా తమతమ దేశాల్లో పట్టుకున్న ఖైదీల వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. భారత్ మొత్తం 391 మంది పౌరఖైదీలు, 33 మంది మత్స్యకారులు తమ కస్టడీలో ఉన్నట్లు ప్రకటించింది. వీరంతా పాకిస్తానీయులేనని స్పష్టంచేసింది. అలాగే పాకిస్తాన్‌కూడా తమ వద్ద 58 మంది పౌర ఖైదీలు, 199 మంది మత్స్యకారులున్నట్లు వెల్లడించింది. వీరంతా భారతీయులేనని ప్రకటించింది. పౌరఖైదీలను పరస్పరం సత్వరమే విడుదల చేసుకోవాలని చర్చల్లో ప్రస్తావించారు. మత్స్యకారులను తమ పడవలతోసహా మార్చుకోవాలి. అలాగే శిక్షలు పూర్తిచేసుకున్న 167 మంది భారత మత్స్యకారులు, పౌర ఖైదీలను వెంటనేవిడుదల చేయాలని కోరింది. 35మంది భారత పౌరులు ఖైదీలుగా ఉన్నవారికి కాన్సులర్ యాక్సెస్ అందించాలని కోరింది. ఇప్పటివరకూ2661 మంది మత్స్య కారులు, 71 మంది పౌరులుగా ఉన్న ఖైదీలు పాకిస్తాన్‌నుంచి భారత్‌కు వచ్చారు. 2014 నుంచి ఇలా జరిగింది. 500 మందికి పైగా మత్స్యకారులు, 13 మంది పౌరఖైదీలను 2023నుంచి బదలీచేసినట్లు భారత్‌ప్రకటించింది.

## బెంగాల్ తొలి మహిళా ప్రధాన కార్యదర్శిగా

# నందినీ చక్రవర్తి



**కోల్‌కత్తా,జనవరి 1:** పశ్చిమ బెంగాల్ రాష్ట్ర చరిత్రలోనే తొలి మహిళా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి నందినీ చక్రవర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటివరకు హోం, హిల్ అఫైర్స్ విభాగంలో అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆమెను ప్రభుత్వం ఈ అత్యున్నత పదవికి ఎంపిక చేసింది. 1994 బ్యాచ్‌కి చెందిన నందినీ చక్రవర్తి తన మూడు దశాబ్దాల కెరీర్‌లో అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ బుధవారంతో పదవీ విరమణ చేసారు. వాస్తవానికి ఆయన గత జూన్‌లోనే రిటైర్ కావాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కోరిక మేరకు కేంద్రం ఆరు నెలల పొడిగింపు ఇచ్చింది. మరో ఆరు నెలల పొడిగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్రంలోని డీవోపీటీ తిరస్కరించడంతో ఆయన పదవీ విరమణ అనివార్యమైంది. అయితే, మనోజ్ పంత్ సేవలను వినియోగించుకోవాలని భావించిన ప్రభుత్వం ఆయనను ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది. నందినీ చక్రవర్తి నియామకానికి సరిగ్గా ఒకరోజు ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెంగాల్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నియామకాల్లో కేంద్ర నిబంధనలను పక్కన పెడుతోందని, తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడానికి నిబంధనలను సడలిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే ఈ మార్పులు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. నందినీ చక్రవర్తి కెరీర్‌లో కొన్ని వివాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా గవర్నర్ సి.వి. ఆనంద బోస్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న సమయంలో రాజ్‌భవన్, రాష్ట్ర సచివాలయం (నబన్న) మధ్య జరిగిన ఘర్షణ ఆమెను వార్తల్లో నిలిపింది. అప్పట్లో ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలని గవర్నర్ కోరినప్పటికీ, ప్రభుత్వం తొలుత నిరాకరించి, ఆ తర్వాత పర్యాటక శాఖకు బదిలీ చేసింది. అయితే, 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, అనుభవజ్ఞురాలైన నందినీ చక్రవర్తిని ఈ పదవిలో నియమించడం ద్వారా పాలనపై పట్టు పెంచుకోవాలని మమతా బెనర్జీ ప్రభుత్వం భావిస్తోంది.

# బంగ్లా మరింత చీకటిలోకి

## ప్రభుత్వంపై విరుచుకుపడిన మాజీ ప్రధాని షేక్ హసీనా

**న్యూఢిల్లీ, జనవరి 1:** అవినీతి, అసత్యాలు, స్వప్రయోజనాలతో ప్రస్తుత పాలకులు దేశాన్ని చీకటిలోకి నెట్టివేస్తున్నారని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నూతన సంవత్సర సందేశంలో భాగంగా గురువారం ఆమె స్పందిస్తూ తీవ్రతీవ్ర ఆరోపణలు చేశారు. దేశాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అవామీ లీగ్ పార్టీ సోషల్‌మీడియాలో షేక్ హసీనా సందేశాన్ని ఇచ్చారు. "దేశాన్ని నాశనం చేయడానికి కుట్రలు పన్నుతున్న వారి ముసుగులు, దుర్మార్గపు ముఖాలు ఇప్పటికే ప్రజల ముందు బట్టబయలయ్యాయి. చట్టవిరుద్ధంగా అధికారాన్ని చేజిక్కించుకున్న వారు, మిమ్మల్ని బందీలుగా పట్టుకుని అంతులేని అవినీతి, అబద్ధాలతో దేశాన్ని ఎలా చీకట్లోకి నెట్టారో మీరంతా చూశారని హసీనా పేర్కొన్నారు. ప్రస్తుత పాలకుల వల్ల ప్రపంచవ్యాప్తంగా బంగ్లాదేశ్ అంటే ఒక భయంగా మారిందని, అందుకే ఏ దేశం కూడా బంగ్లాదేశ్‌ను, దాని ప్రజలను గౌరవంగా చూడటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులు, దాతృత్వ సంస్థలు ఎదుర్కొంటున్న అభద్రత, దేశంలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల కారణంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని వివరించారు. మతం, వర్ణం, వర్గం, వృత్తి, జాతి అనే తేడా లేకుండా ఈ దేశం నిజంగా ప్రజలందరిదీ కావాలన్నదే నా కల, జీవితకాల పోరాట ఆకాంక్ష. కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సామరస్యం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలని హసీనా ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ప్రపంచ వేదికపై దేశానికి గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించడానికి అవిశ్రాంతంగా పనిచేసిందని, కానీ ఇప్పుడు బంగ్లాదేశ్ ప్రత్యేక గుర్తింపు, పాకిస్థాన్ కు వ్యతిరేకంగా 1971 విమోచన యుద్ధ వారసత్వం ప్రశ్నార్థకంగా మారాయని ఆమె ఆవేదన చెందారు. ఈ చీకటి ప్రయాణం నుంచి దేశాన్ని కాపాడేందుకు మనమందరం ఏకం కావాలి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతిజ్ఞ చేద్దాం. ప్రజలు ఈ కష్టాలను ఎక్కువ కాలం కొనసాగనివ్వరని నేను గట్టిగా నమ్ముతున్నాను. కొత్త సంవత్సరంలోనే దీనికి ఒక నిర్ణయాత్మక ఫలితాన్ని చూస్తామని షేక్ హసీనా ధీమా వ్యక్తం చేశారు. గతానుభవాలను గుర్తుచేస్తూ, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రజలు భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఏకతాటిపై నిలిచారని ఆమె అన్నారు.

## బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ దురంధర్‌కు కేంద్రం ఝలక్!

## మార్పులు చేసి రిలీజ్ చేయాలని ఆదేశం

**ముంబయి, జనవరి 1:** బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ధురంధర్ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న తరుణంలో కేంద్రం కొన్ని మార్పులు చేయాలని ఆదేశించడంతో మార్పులతో కూడిన చిత్రాన్ని మళ్లీ వసూలుచేసారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు చిత్రంలో వివాదాస్పదంగా మారే అవకాశం ఉన్న బలోచ్ అనే పదాన్ని మ్యూట్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో కొన్ని పదాలను, డైలాగులను తొలగించాలని కేంద్రం చిత్ర బృందానికి సూచించింది. ఈ మేరకు డిస్ట్రిబ్యూటర్లు దేశవ్యాప్తంగా ఉన్న థియేటర్ యాజమాన్యాలకు ఈమెయిల్స్ పంపారు. పాత ప్రింట్ స్థానంలో మార్పులు చేసిన కొత్త డిజిటల్ సినిమా ప్యాకేజీని డౌన్‌లోడ్ చేసుకుని, జనవరి 1 నుంచి ప్రదర్శించాలని కోరారు. ఇందులో రెండు పదాలను మ్యూట్ చేయగా, ఒక డైలాగ్‌ను మార్చారు. మ్యూట్ చేసిన పదాల్లో ఒకటి పాకిస్థాన్‌కు సంబంధించిన బలోచ్ కాగా, రెండో పదం, మార్చిన డైలాగ్ వివరాలు ఇంకా తెలియరాలేదు. ఉరి: ది సర్జికల్ స్ట్రైక్ దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం పాకిస్థాన్ సామాజిక ఘర్షణలు, ఉగ్రవాదానికి, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య ఉన్న సంబంధాల నేపథ్యంలో సాగుతుంది. ఇందులో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా, ఆర్.మాధవన్, సంజయ్ దత్ వంటి భారీ తారాగణం నటించింది. ఈ కథ వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన కల్పిత గాథ అని సెన్సార్ బోర్డు ఇప్పటికే స్పష్టం చేసింది. రాజకీయ, సామాజిక సున్నితత్వం దృష్ట్యా కేంద్రం ఈ తాజా మార్పులను సూచించినట్లు తెలుస్తోంది.

# ఒడిశాలో అవినీతి తిమింగలం

అడిషనల్ తహసీల్దార్ ఇంట్లో విజిలెన్స్ అధికారుల సోదాలు

రూ.73.66 లక్షల నగదు, భారీగా స్థిరాస్తుల దస్త్రాలు సీజ్

నిందితుడు అరెస్టు, ప్రత్యేక కోర్టుకు తరలింపు, రిమాండ్



**భువనేశ్వర్, జనవరి 1:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణపై ఒడిశా రెవెన్యూ శాఖలో అదనపు తహసీల్దార్ ఇంట్లో విజిలెన్స్ అధికారులు చేశారు. రూ.73.66 లక్షల నగదు, 560 గ్రాముల బంగారం, భారీగా స్థిరాస్తులు, బ్యాంకుల్లోనూ, పోస్టాఫీసులోనూ భారీగా డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. నగదుతోపాటు స్థిరాస్తుల దస్త్రాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటన కటక్ జిల్లాలోని బారంగ్‌లో జరిగింది. అదనపు రెవన్యూ అధికారి జితేంద్ర కుమార్ పాండా ఇంటితోపాటు, అతని బంధువుల ఇంట్లోనూ విజిలెన్స్ అధికారులు సోదాలు చేశారు. తాళం వేసిన ఓ ఇంట్లో సోదాలు చేయగా, రూ.70 లక్షల నగదు వెలుగు చేసింది. అది జితేంద్రకుమార్ పాండా అత్తగారిల్లుగా గుర్తించారు. రూ.560 గ్రాముల బంగారం, రూ.36.97 లక్షలకు పైగా విలువైన బ్యాంక్, పోస్టల్ డిపాజిట్లు, రూ.23.40 లక్షల విలువైన లగ్జరీ కారు, నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు లెక్కల్లో చూపని స్థిరాస్తులను విజిలెన్స్ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. భువనేశ్వర్‌లోనే మూడు ట్రిపుల్ స్టోరీ బిల్డింగ్‌లు, రెండు బీహెచ్‌కే ఫ్లాట్ ఉన్నది. ఖోర్ధా జిల్లాలో డబుల్ స్టోరీ బిల్డింగ్ ఉన్నది. నాలుగు ఖరీదైన ప్లాట్లు ఉన్నాయి. భువనేశ్వర్‌లోని చాలా సంపన్నమైన ప్రాంతంలో ఆ ప్లాట్లు ఉన్నాయి. మరో లొకేషన్ నుంచి 7 లక్షల నగదు, వంద గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. ఎస్బీఐ బ్యాంకుకు చెందిన లాకర్ వివరాలను సేకరిస్తున్నారు.

## గోల్డ్ స్మగ్లింగ్ రాకెట్ గుట్టు రట్టు

- రూ.3.89 కోట్ల విలువైన 3.05 కేజీల బంగారు స్వాధీనం

**ముంబై, జనవరి 1 :** ముంబై ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారు స్మగ్లింగ్ ముఠాను డిఆర్ఐ అధికారులు రట్టు చేశారు. నీటి గ్లాసులో దాచిపెట్టిన 3.05 కిలోల 24 క్యారెట్ల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విలువ రూ.3.89 కోట్లు. డిఆర్ఐ అధికారులు బుధవారం రాత్రి ముంబై ఛత్రపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. బహ్రెయిన్ నుండి వచ్చిన ఒక భారతీయుడిని అదుపులోకి తీసుకుని అతని వస్తుసామగ్రిని సోదా చేయగా, అతని బ్యాగులో మైనపు రూపంలో బంగారు ధూళి ఉన్న పన్నెండు గుళికలు బయటపడ్డాయి.

## సంక్షిప్తంగా..

### మద్యం వాసన.. ఎయిరిండియా పైలట్ అదుపులోకి

**న్యూఢిల్లీ, జనవరి 1:** విమానం ఎక్కుతుండగా మద్యం వాసన రావడంతో ఎయిరిండియా పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. కెనడాలోని వాంకోవర్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. జాతీయ మీడియా కథనం ప్రకారం.. పైలట్ నుంచి మద్యం వాసన వస్తుందని గమనించిన విమానాశ్రయ సిబ్బంది ఒకరు కెనడా అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే అతనికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా అందులోవిఫలమయ్యారు. దాంతో వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ పైలట్ వాంకోవర్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన విమానాన్ని నడపాల్సి ఉంది. ఈ ఘటనతో అదికాస్త ఆలస్యమైంది. డిసెంబర్ 23న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా దీనిపై దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా స్పందించింది. విధి నిర్వహణకు తగిన అర్హతపై ఆందోళన వ్యక్తంచేసిన కెనడా అధికారులు తర్వాత తమ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారని పేర్కొంది. భద్రతా ప్రోటోకాల్స్‌ను పరిగణనలోకి తీసుకుని వేరే పైలట్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపింది.

### బిఎండబ్ల్యూ కార్ల టెండర్‌ను రద్దు చేసిన లోక్‌పాల్



**న్యూఢిల్లీ, జనవరి 1:** అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ లోక్‌పాల్ ఒక్కొక్కటి రూ.70 లక్షల విలువైన ఏడు బిఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు టెండర్ ఆహ్వానించడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. దీంతో అంబుడ్స్‌మెన్ వెనక్కి తగ్గింది. ఆ కార్ల టెండర్‌ను రద్దు చేసింది. లోక్‌పాల్ చైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ సహా ఏడుగురు జ్యుడీషియల్, నాన్ జ్యుడీషియల్ సభ్యుల కోసం కొన్ని నెలల క్రితం కార్ల టెండర్‌ను లోక్‌పాల్ ఆహ్వానించింది. ఎంపికైన విక్రయదారు బిఎండబ్ల్యూ కార్లను నడిపే విధానంపై ఏడు రోజులు తమ డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని, ఈ ఖర్చును వారే భరించాలని షరతు విధించింది. దాంతో విమర్శలు వ్యక్తమయ్యాయి.

### బంగ్లాలో మరో హిందూ వ్యక్తిపై దాడి.. తీవ్రగాయాలు

**ఢాకా, జనవరి 1:** మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆగడం లేదు. తాజాగా మరో హిందువుపై మూక దాడి జరిగింది. ఈ దాడిలో సదరు వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక మీడియా వివరాల ప్రకారం.. డిసెంబరు 31న దేశంలోని షరియత్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. 50 యేళ్ల వ్యక్తి ఖోకోన్‌దాస్‌పై ఓ బృందం దాడి చేసింది. పదునైన ఆయుధాలతో గాయపరిచింది. తర్వాత నిప్పంటించింది. ఈ దాడిలో ఖోకోన్‌దాస్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తిపై దాడి జరగడం నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో ఘటన.

గతనెల 24న బంగ్లాదేశ్‌లోని కలిమోహర్ యూనియన్‌లో హోస్సైన్‌డంగా ప్రాంతంలో 29 యేళ్ల అమృత్ మండల్ అనే వ్యక్తిని ఓ గుంపు కొట్టి చంపిన విషయం తెలిసిందే.

### చైనాలో కండోమ్స్‌పై 13 శాతం పన్ను అమలు



**బీజింగ్, జనవరి 1:** జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోన్న చైనా జననాల రేటును పెంచేందుకు ఎన్నో అవస్థలు పడుతోంది. ఇందులో భాగంగా కండోమ్ సహా గర్భనిరోధక సాధనాలు, ఔషధాలపై 13 శాతం పన్ను విధించింది. కొత్త సంవత్సరం (జనవరి 1 నుంచి) వేళ ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. వృద్ధ జనాభా పెరిగిపోతుండటం, ఆర్థిక వ్యవస్థ మందగమనంలో కొనసాగుతుండటం వంటి పరిస్థితుల్లో యువత పెళ్లి చేసుకొని పిల్లల్ని కనేలా చైనా ప్రభుత్వం ప్రోత్సహకాలను ప్రకటిస్తోంది.

ఈ క్రమంలో గర్భనిరోధక సాధనాలు సహా పలు వస్తువులపై 13 శాతం పన్ను విధిస్తూ విలువ ఆధారిత పన్ను (వ్యాట్) చట్టాన్ని ఇప్పటికే సవరించింది.

డ్రాగన్ కొన్ని దశాబ్దాల పాటు కుటుంబ నియంత్రణ కఠినంగా అమలు చేసింది. దాంతో ఈ ఉత్పత్తులపై 1993 నుంచి పన్ను మినహాయింపు కొనసాగింది. ఇటీవల దానిని ఎత్తివేసిన ప్రభుత్వం.. తాజాగా కొత్త పన్నును అమల్లోకి తీసుకువచ్చింది.

## ఖురాన్‌పై ప్రమాణంచేసి బాధ్యతలు స్వీకరించిన న్యూయార్కు మేయర్ మమ్దానీ



**న్యూయార్కు, జనవరి 1:** అమెరికాలోనే అతిపెద్ద నగరమైన న్యూయార్క్ పాలనా పగ్గాలను యువ డెమొక్రాట్ జోహ్రాన్ మమ్దానీ చేపట్టారు. నూతన సంవత్సరం 2026 ప్రారంభమైన తొలి నిమిషాల్లోనే ఆయన పదవీ స్వీకార ప్రమాణం చేసి సరికొత్త చరిత్ర సృష్టించారు. న్యూయార్క్ నగర చరిత్రలో ఒక మేయర్ పవిత్ర ఖురాన్‌పై ప్రమాణం చేయడం ఇదే తొలిసారి. మమ్దానీ కేవలం మొదటి ముస్లిం మేయర్ మాత్రమే కాదు, ఈ పదవిని చేపట్టిన మొట్టమొదటి దక్షిణాసియా వాసి, ఆఫ్రికా సంతతి వ్యక్తిగా కూడా రికార్డుల్లోకి ఎక్కారు.హమ్దానీ తన మొదటి ప్రమాణ స్వీకార వేడుకను అత్యంత విభిన్నంగా నిర్వహించారు. మన్హట్టన్ భూగర్భంలో 1945 నుంచి మూసివేసి ఉన్న చారిత్రక ఓల్డ్ సిటీ హాల్ సబ్‌వే స్టేషన్‌ను ఈ వేడుకకు వేదికగా ఎంచుకున్నారు. ఈ నగరాన్ని నడిపించే శ్రామిక వర్గం పట్ల నాకున్న గౌరవానికి ఇది సంకేతమని వ్యాఖ్యానించారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ సమక్షంలో, తన కుటుంబ సభ్యుల మధ్య ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.ప్రమాణ స్వీకారంకోసం మమ్దానీ మూడు పవిత్ర ఖురాన్ ప్రతులు వాడారు.ఒకటి తన తాతగారికి చెందిన ఖురాన్ ప్రతి కాగా, రెండోది 18వ శతాబ్దానికి చెందిన, నల్లజాతీయుల చరిత్రను ప్రతిబింబించే అర్టురో షోంబర్గ్ సేకరించిన అత్యంత అరుదైన ఖురాన్ ప్రతి. మూడోది తన నానమ్మ ఖురాన్ ప్రతిని కూడా ఆయన ఉపయోగించారు. అర్ధరాత్రి జరిగిన ప్రైవేట్ వేడుక తర్వాత, గురువారం మధ్యాహ్నం 1 గంటకు సిటీ హాల్ మెట్లపై బహిరంగ ప్రమాణ స్వీకార వేడుక జరిగింది.

## యూరియాపై కెటిఆర్ దుష్ప్రచారం తగదు

### బిఆర్ఎస్ పాలనలో కంటే ఎక్కువగానే తెచ్చాం

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** యూరియాపై కెటిఆర్ దుష్ప్రచారం చేస్తూ రైతులను రెచ్చగొట్టడం తగదని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. నూతన సంవత్సరం తొలి రోజునే కెటిఆర్ గోబెల్స్ ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఒకపక్క హరీశ్ రావు, మరోపక్క కెటిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, పాలనపైన విమర్శలు చేస్తున్నారని ఆవేదన చెందారు. మీ బావ హరీశ్‌రావు కృష్ణా, గోదావరి నదీ జలాలు, పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారనీ పేర్కొన్నారు. కెటిఆర్ రైతులకు యూరియా సరఫరాపైన తప్పుడు ప్రచారంచేస్తూ మీరు ప్రజాసమస్యలు, వాస్తవాల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. బిఆర్ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు భూస్థాపితం చేశారని, లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అవయవదానం చేసి బిజెపిని 8 సీట్లలో గెలిపించి గుండు సున్నా తెచ్చుకుందని ఎద్దేవా చేశారు. రైతులకు యూరియా కోసం ధర్నాలు చేశామనీ, నడ్డాతో మాట్లాడి యూరియా తెప్పించామని తెలిపారు. 2024-25 సంవత్సరానికి వానకాలం పంటకు 9.66 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగికి 10.41 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తీసుకువచ్చామని గణాంకాలతో వివరించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఈ స్థాయిలో ఎప్పుడూ యూరియా తేలేదని అన్నారు. 2025-26 వానకాలం పంటకు 9.79 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తెచ్చాము యూరియాను తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ఫెయిల్ కాలేదని వివరించారు.

## యూనివర్సిటీల్లోని 1,200 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించండి

### ఆ తర్వాతే మిగిలిన ఖాళీలకు నోటిఫికేషన్ జారీ చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపి అసదుద్దీన్ ఒవైసి లేఖ

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం లేఖ రాశారు. సీఎంకి రాసిన లేఖలో యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని.. ఆ తరువాతనే మిగిలిన పోస్టుల భర్తీకి యూనివర్సిటీల్లో నోటిఫికేషన్లను జారీ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యా లయాల్లో సుమారు 1200 మంది కాంట్రాక్ట్, అడ్‌హక్ ఉపాధ్యాయులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా అనేక సంవత్సరాలుగా అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తున్నారని సీఎంకి రాసిన లేఖలో ఎంపి తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యా నాణ్యతను నిలబెట్టడంలో, విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడంలో వారి కీలక పాత్ర ఉన్నప్పటికీ, క్రమబద్ధీకరణతో వచ్చే ఉద్యోగ భద్రత, ప్రయోజనాలు లేకపోవడం వల్ల వారి భవిష్యత్తు అనిశ్చితంగానే ఉందన్నారు. ఇంకా యూనివర్సిటీల్లో నియామక నోటిఫికేషన్లు జారీ చేయకపోవడం వల్ల విశ్వవిద్యాలయాలలో అనేక మంజూరైన బోధనా పోస్టులు భర్తీ కాకుండానే ఉన్నాయన్నారు. తద్వారా ఉన్న అధ్యాపకులపై భారాన్ని పెంచడమే కాకుండా విద్యా ప్రమాణాలు, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని కూడా దెబ్బతీస్తుందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర విద్యారంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. కాబట్టి దయచేసి 1200 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణను చేసిన తరువాత మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడాన్ని పరిశీలించాలని అభ్యర్థిస్తున్నట్టు సిఎంకి రాసిన లేఖలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ కోరారు. ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యమంత్రికి రాసిన లేఖ నేపథ్యంలో రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1200 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని ఆ తరువాతనే యూనివర్సిటీల్లో నియామకాలకు నోటిఫికేషన్లను జారీ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

## జర్మనీలో అగ్నిప్రమాదం

### భవనంపై నుంచి దూకి జనగామ విద్యార్థి మృతి



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** బంగారు భవిష్యత్తు కోసం ఖండాంతరాలు దాటి వెళ్లిన ఓ తెలుగు విద్యార్థి విధి ఆడిన వింత నాటకానికి బలైపోయాడు. జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల సంపత్‌రెడ్డి -కరుణ దంపతుల కుమారుడు హృతిక్‌రెడ్డి ఎమ్మెస్ ఉన్నత చదువుల నిమిత్తం జర్మనీకి వెళ్లారు. అక్కడ ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటూ చదువు కొనసాగి స్తున్నారు. బుధవారం రాత్రి హృతిక్‌రెడ్డి ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో భయాం దోళనకు గురైన హృతిక్ రెడ్డి మంటల నుంచి తప్పించుకునే క్రమంలో ప్రాణాలు కాపాడుకోవడానికి భవనం పైనుంచి కిందికి దూకిన సమయంలో ఆయన తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ మార్గమధ్యలోనే హృతిక్‌రెడ్డి పరిస్థితి విష మించి కన్నుమూశారు.

**మల్కాపూర్‌లో విషాద ఛాయలు..**

నూతన సంవత్సరారంభంలో కుమారుడి నుంచి శుభాకాంక్షలు వస్తాయని ఆశించిన తల్లిదండ్రులకు అతను ఇక లేడన్న వార్త పిడుగుపాటులా తగిలింది. హృతిక్‌రెడ్డి మరణవార్త మల్కాపూర్ గ్రామంలో విషాద ఛాయలు నింపింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు విదేశీ గడ్డపై ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. తమ కుమారుడి భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల శాఖను కోరుతున్నారు. ఈ అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై జర్మనీ పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఇటీవల అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఉన్నత చదువుల కోసం కాలిఫోర్నియా వెళ్లిన మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మేఘన గార్ల మీసేవ నిర్వాహకుడు నాగేశ్వరరావు కుమార్తె కాగా... భావన ముల్కనూరు ఉపసర్పంచ్ కోటేశ్వరరావు కుమార్తె. మెరుగైన భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్లిన తమ బిడ్డలు శవాలై వస్తున్నారన్న వార్తతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

## ఎఐ ఆధారిత అవసరాలకనుగుణంగా నైపుణ్యం పెంపొందాలి

### కార్మిక, ఉపాధి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** కృత్రిమ మేధస్సు ఆధారిత అవసరాలకు అనుగుణంగా కార్మికుల నైపుణ్యాపెంపొందాలని ఆవిధంగా ఉపాధి,శిక్షణకు కొత్త కోర్సులు డిజైన్ చేయాల్సిన అవసరం ఉందని కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం సచివాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీలు,ఇఎస్ఐ శాఖల అధికారులతో సమావేశమై, వారి పనితీరు మరియు సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.ఈ సందర్భంగా శాఖల వారిగా సమీక్షి ంచిన మంత్రి, రాబోయే ఏడాదికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో కృత్రిమ మేధస్సు ఆధారిత కోర్సులు సహా కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించాలని సూచించారు.

యువత ఉపాధి అవకాశాలు పెంచేలా అన్ని కొత్త కోర్సులు ప్రస్తుతంతో పాటు భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తానని శ్రమదోపిడి లేకుండా కార్మికులు నిజవేతనం పొందాలని వివేక్ వెంకటస్వామి ఆకాంక్షను వ్యక్తీకరించారు. పరిశ్రమల ప్రమాదాలను నివారించేందుకు ఫ్యాక్టరీల శాఖ భద్రతా ప్రమాణాలు, సన్నద్ధతను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సిగాచీ ఘటన వంటి సంఘటనలను ప్రస్తావిస్తూ, కార్మికుల భద్రత, సంక్షేమంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టంచేశారు. అదేవిధంగా ఈఎస్ఐ శాఖ పనితీరును కూడా సమీక్షి ంచిన మంత్రి, ఇన్స్యూర్డ్ పర్సన్స్‌కు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఐపీల నుంచి ఫిర్యాదులు రావడం సహించబోమని, అవసరమైన చోట అదనపు డిస్పెన్సరీలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు.నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ శాఖల అధికారులు సచివాలయంలోని మంత్రి కలిశారు. మంత్రి శుభాకాంక్షలను స్వీకరిస్తూ, అధిక బాధ్యత, నిబద్ధత తో పనిచేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, ఉపాధిశిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను తగ్గించే చర్యలను చేపడుతున్నాం

### పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్కులు

### రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

### అధికారులకు హెల్మెట్లు అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో వికాస్‌రాజ్, ఇలంబర్తి, హరిచందన తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ఈ నెల 1 నుంచి 31 వరకు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జేటీసీ, డీటీసీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణతోపాటు వాహనాల స్టిక్కర్స్, విద్యార్థుల అవాహన పుస్తకాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడానికి ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక మరణాలు రోడ్డు ప్రమాదాల కారణంగానే జరుగుతున్నట్లు రాష్ట్ర డీజీపీ సైతం మీడియా సమావేశంలో స్పష్టం చేశారన్నారు. ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్ తొలగిస్తూనే దానిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులను, అధికారులను భాగస్వామ్యం చేస్తూ నెల రోజులపాటు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తామి తల్లిదండ్రుల నుంచి ప్రతి విద్యార్థి హామీపత్రం తీసుకోవాలన్నారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ఎక్కువగా మరణాలు సంభవించినట్లు అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ. 10 వేలు జరిమానా వేస్తున్నా కేసులు నమోదు తగ్గడం లేదన్నారు. ప్రతి విద్యార్థి దగ్గరకు రవాణా శాఖ చేరుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. ప్రాణాలను కాపాడే ఈ క్రతువులో రాష్ట్ర యంత్రాంగం భాగస్వామ్యం ఉంటుందన్నారు. రాష్ట్రంలో వేయి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే 1.80 కోట్ల వాహనాలు ఉన్నాయన్నారు. నిబంధనలు పాటించని వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. యూనిఫెస్ సూచనలతో పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రవాణా శాఖ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవంపై మీడియా సైతం ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

**బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో..**

**హైదరాబాద్ (చిక్కడపల్లి) :** ఆర్టీసీ సంస్థ మూసేస్తామనే పరిస్థితి నుండి అన్ని డిపోలకు లాభాల్లోకి వస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు గురువారం బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో జరిగాయి. ఈ సందర్భం గా ప్రమాదరహిత డ్రైవర్లకు మంత్రి పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదాల్లో చని పోయిన వారి కుటుం బాలు, శాశ్వత దివ్యాంగులయిన కుటుంబాలు దుర్భరంగా ఉన్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెహికిల్ ఫిట్‌నెస్ ఉండాల్సిందే.. ఫిట్‌నెస్ ఉంటేనే బస్సులు రోడ్డెక్కించాలన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి, నగర ట్రాఫిక్ అదనపు కమీషనర్ జోయెల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

## పోటెత్తిన భక్తులతో ఆలయాలు కిటకిట

### కొత్త సంవత్సరంలో అంబరాన్నంటిన సంబురాలు

### యాదగిరిగుట్టలో మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు

### స్వర్ణగిరిలో ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** కొత్త సంవత్సరాన్ని ఆధ్యాత్మికతతో స్వాగతించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు తరలి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాది తొలి రోజున స్వామివారి దర్శనం చేసుకుని శుభారంభం



కావాలనే ఆకాంక్షతో భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాల బాట పట్టారు. ఆలయ ప్రాంగణాలు భక్తిశ్రద్ధలు, జయజయధ్వానాలతో సందడిగా మారాయి. ప్రత్యేకించి శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీ ‌్మ నరసింహస్వామి దేవాలయం, స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంల్లో తెల్లవారు జామున నుంచే భక్తుల రద్దీ కనిపించింది. స్వామివారి దర్శనం కోసం దీర్ఘ క్యూలైన్లలో భక్తులు ఓర్పుతో నిలబడి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.కొత్త సంవత్సరాన్ని శుభప్రదంగా మలచుకోవాలనే ఉద్దేశంతో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతి నిధులు కూడా ఆలయాలను దర్శించారు. ఈ క్రమంలో యాదగిరిగుట్టలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు శాంతి, శ్రేయస్సు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. స్వర్ణ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బిజెపి సీనియర్ నేత రాజ్యసభ సభ్యులు కే లక్ష్మణ్ తో పాటు ఇతర ప్రముఖులు కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్ల సక్రమ నిర్వహణ, ప్రసాద పంపిణీ, తాగునీరు, వైద్య సౌకర్యాలు, భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేశారు. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు .మొత్తంగా కొత్త ఏడాది వేడుకలు భక్తి, ఉత్సాహం, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగాయి. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాలు భక్తుల జయజయధ్వానాలతో మార్మోగాయి.

## టెట్ పరీక్షలకు హాజరయ్యే ఇన్‌సర్వీస్ టీచర్లకు ఒడి సౌకర్యం కల్పించాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు ఆర్‌యుపిపి టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శనివారం నుంచి జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లకి హాజరవుతున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకి ఆన్ డ్యూటీ (ఒడి) సౌకర్యం కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరి షత్తు, తెలంగాణ రాష్ట్రం(ఆర్‌యుపిపి టిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి విజ్ఞప్తి చేసినట్టు సంఘం రాష్ట్ర అధ్య క్షులు సి జగదీశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములుకనూరి



శంకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం పాఠశాల విద్య డైరెక్టర్‌ను కలిసి ఆర్‌యుపిపి టిఎస్ నాయకులు తమ సంఘం రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరింపచేసిన అనం తరం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు. ఈ నెల 3 నుంచి 20 వరకు జరగనున్న టెట్ పరీక్షలకు హాజరయ్యే ఉపాధ్యాయులందరికి పరీక్ష రోజు ఆన్‌డ్యూటీ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అలాగే సబ్జెక్ట్‌కి సంబంధంలేని అంశాలలో కూడా స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యా యులు టెట్ పరీక్షను రాయవలసి వస్తుందని, ఇది చాలా గందరగోళానికి గురిచేస్తుందన్నారు. 20 నుంచి 30 సంవత్సరాలు ఒకే సబ్జక్టు బోధించిన ఉపాధ్యాయులు ఇప్పుడు సోషల్, సైన్స్, గణితము మొదలైన వాటిని పరీక్షల కొరకు 50 ఏండ్లు పైబడ్డ వయసులో నేర్చుకోవలసి వస్తుందన్నారు. ఇది అశా స్త్రీయ విధానమని.. దయచేసి తమరు కలుగజేసుకుని రాష్ట్రానికి అనుగుణంగా ఇన్ సర్వీసు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు వారు బోధి స్తున్న సబ్జెక్ట్‌లనే 6 నుండి 10వ తరగతి వరకు గల సిలబస్ ఆధారంగా టెట్‌ను నిర్వహిం చాల్సిందిగా ప్రభుత్వానికి సూచన చేయాలని కోరినట్టు తెలిపారు. ఇందుకోసం టెట్ 3వ పేపర్‌ను ప్రవేశ పెట్టాల్సిందిగా కోరుతున్నట్టు జగదీశ్ తెలిపారు. టెట్ మాండేటరీ విషయంలో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తం ఁపున కూడా కేంద్రానికి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు నిర్ణీత అర్హతలు, కలిగి ఎంపిక య్యారనే విషయాన్ని తెలుపుతూ.. 2011 కన్నా ముందు సర్వీసులో ఉన్న వారికి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖను ప్రభుత్వం తరఫున పంపించి మినహాయింపును ఇప్పించాలని కోరారు. ఇదే విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తమ కార్యాలయం ద్వారా నివేదించాల్సిందిగా కోరినట్టు వారు తెలిపారు.

## కొత్త యేడాదిలోనైనా సర్వీసు నిబంధనలు రూపొందించాలి

### పర్యవేక్షణ అధికారుల ఖాళీలను భర్తీ చేయాలి

### ప్రభుత్వానికి టిఎస్ యుటిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సర్వీస్ నిబంధనల కోసం ఎదురు చూస్తున్నామని.. కనీసం ఈ 2026 సంవత్సరంలో అయినా ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలు రూపొందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టిఎస్ యుటిఎఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో పర్యవేక్షణ అధికారుల ఖాళీలను భర్తీ చేసి పాఠశాల విద్యాశాఖలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యాలయంలో గురువారం 2026 సంవత్సర డైరీ, క్యాలెండర్, అధ్యాపక దర్శిని జిఒల సంపుటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రెగ్యులర్ జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు లేక కీలకమైన పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఒక కారణమని, నూతన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 కి అనుగుణంగా సమగ్రమైన సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. తెలంగాణ విద్యావిధానంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని కోరారు. రాష్ట్రాల హక్కులను హరించి పేదలకు విద్యను దూరం చేసే జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా తిరస్కరించాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణత నుండి మినహాయింపు ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలైనా కేంద్ర ప్రభుత్వం గానీ, ఎన్సీటిఈ గానీ రివ్యూ పిటిషన్, క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయలేదని, పార్లమెంటులో సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించిన సమయంలోనూ సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అవసరమైన న్యాయ, చట్టపరమైన చర్యలు చేపట్టి సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు పెంపు ఆలోచన విరమిం చుకోవాలని, రిటైరైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల బకాయిలను తక్షణమే చెల్లించాలని, అవసరమైతే పదివేల కోట్లు అప్పు తెచ్చి ఒకేసారి బకాయిలన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. 2026 సంవత్సరం పోరాటాల సంవత్స రంగా ఉండనుందన్నారు. టిఎస్ యుటిఎఫ్ కార్యకర్తలు పనిచేసే పాఠ శాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని ఇటీవల జనగామలో జరిగిన రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయించుకున్నామని చెప్పారు. జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో కూడా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, వెంకటప్ప, విశాలి, ఎస్‌వై కొండల రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారావు, శ్యామ్ సుందర్, జగన్నాథశర్మ, జిల్లాల నాయకులు భగవంత్‌రాజ్, భువనేశ్వరి, కవిత, భాషా, మాజీద్, సీనియర్ నాయకులు మస్తాన్‌రావు, అశోక్, వెంకటేశ్వర్లు, అరుణ మ్మ, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

### భారీగా సబ్సిడీలు కేటాయింపు

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఇవ్వాలని ఆ శాఖ అధికారులు నిర్ణయించారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకంలో భాగంగా పండ్ల తోటలతో పాటు, పూల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. కొత్త పండ్ల తోటలు బొప్పాయి, అరటి, అల్లనేరడు, సీతాఫలం, మామిడి, నిమ్మ, జామ, బత్తాయి, పూల సాగుకు 40శాతం రాయితీ వర్తింపజేయనున్నారు. అదేవిధంగా వంగ, టమాట, పచ్చిమిర్చి, కూరగాయల నారును ఈ పథకం కింద రైతులకు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. మామిడి, బత్తాయికి సంబంధించి పాత తోటలు పునర్జీవం కింద 40 శాతం రాయితీ ఇస్తారు. పాలీ, గ్రీన్‌హౌస నిర్మాణం, మల్చింగ్ పద్ధతిలో సాగుకు 50శాతం రాయితీ ఇవ్వనుండగా, సమగ్ర తెగులు నివారణకు, సమీకృత పోషణ నిర్వహణకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఉద్యాన పంటల రైతులకు ట్రాక్టరు, పవర్‌టిల్లర్, పవర్ వీడర్, రష్ కట్టర్, స్ప్రేయర్లను కేటాయిస్తారు. ఇక వర్మికంపోస్టు యూనిట్లకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. పండ్ల తోటలతో పాటు, కూరగాయలకు, మిరప, ఆయిల్‌పామ్ సాగుకు బిందు, తుంపర సేద్యాన్ని రాయితీపై పరికరాలు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ, బీసీ, సన్నచిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీ ఇవ్వనున్నారు. శాశ్వత పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయల సాగును ప్రోత్సహించనున్నారు. వీటికి కూడా 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. అలాగే ఎస్‌బీఎం కింద వెదురు మొక్క పెంపకానికి ప్రోత్సాహకం అందించనున్నారు. ఎకరానికి 50శాతం రాయితీపై రూ.14,400లు రైతులకు అందజేస్తారు. కాగా మల్బరీ సాగు ద్వారా పట్టు పురుగులు ఉత్పత్తి చేసే రైతులకు పట్టుగూళ్లకు కిలోకు రూ.75ను ప్రోత్సాహకంగా అందించనున్నారు. ఇందుకు గాను ఎకరానికి రూ.60వేల నుంచి రూ.78వేలు, అదేవిధంగా రూ.2.25లక్షల నుంచి రూ.2.90లక్షలు రేరింగ్ షెడ్ నిర్మాణంతో పాటు క్రిమిసంహారక మందుల సరఫరా, ఉద్యాన యాంత్రీకరణ పరికరాలకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు.

## రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని బాండ్ రాసిస్తా

### మావోయిస్టులు మార్చి 31 వరకు దేశంలో ఉండరు

### మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామన్న మోడీ, అమిత్ షా వ్యాఖ్యల్లో నూటికి నూరుశాతం జరుగుతుందని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఊరందరికి శకునం చెప్పే బల్లి పోయి కుడితిలో పడ్డట్టు కెసిఆర్ ప్రస్తుత పరిస్థితి ఉందని ఎంపి ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు ఊరందరి పంచాయితీలు తెంపిన కెసిఆర్‌ఇప్పుడు కుటుంబంలో కొడుకు కూతురు, అల్లుడు బిడ్డ మధ్య పంచాయతీ తెంపలేకపోతున్నాడని విమర్శించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రఘునందన్ రావు.. త్వరలో బిఆర్ఎస్ ఫేడ్ అవుట్ కావడం ఖాయం అన్నారు. కవిత త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెట్టడం ఖాయం అన్నారు. అసెంబ్లీలో కెసిఆర్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు కెటిఆర్, కౌశిక్ రెడ్డి లేచి నిలబడకపోవడం వారి విజ్ఞతకే వదిలేయాలన్నారు. ముఖ్యమంత్రి కావాలని కెటిఆర్ ఆశపడుతున్నా ఆ మేరకు బిఆర్ఎస్ పార్టీ, ఆయన క్యాడర్, కుటుంబ సభ్యులు సహకరించడం లేదని అభిప్రాయపడ్డారు. హరీశ్ రావు ప్రస్తుతం మౌనంగా ఉండి జరుగుతున్న సంఘటనలు గమనిస్తున్నారని చెప్పారు. పచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి ఖచ్చితంగా అధికారంలోకి రాబోతోందని ఈ విషయంలో బాండ్ రాసి ఇవ్వగలనని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ బిజెపి లో నేతల మధ్య వర్గపోరు పార్టీని డ్యామేజ్ చేస్తోందన్న అభిప్రాయంపై స్పందించిన రఘునందన్ రావు.. నాలుగు గోడల మధ్య నేతలు తమ తమ అభిప్రాయాలు చెబుతాదని అయితే అంతిమంగా అధ్యక్షుడితే తుది నిర్ణయం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఖరారు అయ్యాక ఎవరూ విభేదించలేదన్నారు. ప్రజాస్వామ్యంలో కూర్చొని మాట్లాడుకునే అవకాశం కూడా లేదన్నట్లు మా పార్టీలో విభేదాలు ఉన్నాయని మీడియా ప్రచారం చేస్తోందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బండి సంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్ అంశంపై స్పందించారు. పార్టీ గుర్తులు లేకుండా జరిగిన ఎన్నికలను బట్టుకుని ఆయన క్యాండిడేట్ ఈయన క్యాండిడేట్ అని మాట్లాడటం ఏమిటన్నారు. ఒక ఎన్నికకు మరో ఎన్నికకు పొత్తు, సొంతన పెట్టకూడదన్నారు. ఇప్పటి వరకు ఉన్న తెలంగాణ వేరు ఇప్పుడున్న తెలంగాణ వేరు అని పదేళ్ల బిఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలన చూశాక ప్రజలు బిజెపి వైపు అసక్తి చూపుతున్నారని ధీమా వ్యక్తం చేశారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 1:** జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తానని సిఎం రేవంత్‌రెడ్డి భరోసానిచ్చారు. గురువారం రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. అదేవిధంగా యూనియన్ రూపొందించిన 2026 మీడియా డైరీని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింప చేయించింది. జర్నలిస్టులకు నూతన సంవత్సర కానుకగా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ సిఎం రేవంత్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.


## 2028లో తిరిగి కెసిఆర్‌ను సిఎంగా చూడటమే లక్ష్యం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 1:** తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భారత రాష్ట్ర సమితి నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ తెలంగాణ ప్రజలకు, భారతదేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2026 నూతన సంవత్సర సందర్భంగా ప్రసంగించారు. క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రం అభివృద్ధి వైపు కాదు, తిరోగమనం వైపు ప్రయాణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా నేడు పండుగ వాతావరణంలో ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని, చలి కాలంలో కూడా గంటల తరబడి, దినాల తరబడి లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చిందని విమర్శించారు. 2026వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న ఈ శుభసందర్భంలో ఒకటే విషయం గుర్తుంచుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గెలుపులు, ఓటములు శాశ్వతం కావని, అవి తాత్కాలికమని, అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగులుతాయని, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు. ఇతర పార్టీలకు తెలంగాణ రాజకీయాలు ఒక ఆటలా ఉంటే, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌కు రాజకీయాలు ప్రజల సంక్షేమానికి సంబంధించిన ధర్మమని, ఒక విధి అని కేటీఆర్ తెలిపారు. గెలుపుఓటములతో సంబంధం లేకుండా పార్టీ ప్రయాణం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఈ ఏడాది ఒక వైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరో వైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్రం, రాష్ట్రం కలిసి రెండు పార్టీలు ఒకటై బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, ప్రజల ఆశీర్వాదం, దైవ ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. చివరగా 2028లో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని స్పష్టం చేస్తూ, చిన్నచిన్న ఎదురుదెబ్బలను పెద్దగా పట్టించుకోకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# శాశ్వత శాంతి ఒప్పందంపైనే సంతకం చేస్తా!

### కొత్త సంవత్సరం వేళ ఉక్రెయిన్ ప్రజలకు జెలెన్‌స్కీ సందేశం

**క్వీవ్, జనవరి 1:** దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న భీకర యుద్ధం మధ్య ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ నూతన సంవత్సర వేళ ప్రపంచానికి తన మనసులో మాట చెప్పారు. యుద్ధం ముగియాలి శాంతి కావాలి కానీ అది ఉక్రెయిన్ అంతానికి దారితీసేదిగా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధం వల్ల ఉక్రెయిన్ ప్రజలు తీవ్రంగా అలసిపోయిన మాట నిజమేనని అంగీకరిస్తూనే, ఆ అలసట లొంగుబాటుకు సంకేతం కాదని తేల్చి చెప్పారు. జెలెన్‌స్కీ తన 21 నిమిషాల ప్రసంగంలో ఒక ప్రధాన అంశంవెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫ్లోరిడాలో జరిపిన చర్చల తర్వాత శాంతి ఒప్పందం 90 శాతం సిద్ధమైందని ఆయన తెలిపారు. మిగిలిన ఆ 10 శాతంలోనే అంతా ఉంది. అదే శాంతిని, ఉక్రెయిన్, యూరప్ భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. కేవలం కొన్ని వారాలు లేదా నెలల కోసం కాకుండా, దశాబ్దాల పాటు శాంతిని ఇచ్చే పటిష్టమైన ఒప్పందంపైనే తాను సంతకం చేస్తానని జెలెన్‌స్కీ భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఉక్రెయిన్ భూభాగం సుమారు 19 శాతం రష్యా ఆధీనంలో ఉంది. తూర్పు డాన్‌బాస్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ దళాలను వెనక్కి తీసుకోవాలని రష్యా డిమాండ్ చేస్తోంది. అయితే, ఈ డిమాండ్‌ను మోసంగా వర్ణించిన జెలెన్‌స్కీ ప్రస్తుతమున్న యుద్ధ రేఖలను అలాగే స్తంభింపజేయాలని కోరుతున్నారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన న్యూ ఇయర్ ప్రసంగంలో మాట్లాడుతూ మనం విజయం సాధిస్తామని గట్టిగా నమ్ముతున్నాం. దేశం మొత్తం మీ వెంటే ఉందని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ భూభాగంలో రష్యా ఆధిపత్యం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. పుతిన్ తన ప్రసంగంలో తన నివాసంపై ఉక్రెయిన్ జరిపినట్లుగా చెబుతున్న డ్రోన్ దాడుల గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం.



## హెచ్-1బి వీసా ఫీజు పెంపులో ట్రంప్ నిర్ణయాన్నే సమర్థించిన కోర్టు




**వాషింగ్టన్, జనవరి 1:** అమెరికాలో ఐటీ ఉద్యోగం చేయాలనుకునే విదేశీయులకు, ముఖ్యంగా భారతీయులకు మరో షాక్ తగిలింది. హెచ్1బి వీసా దరఖాస్తులపై ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 84 లక్షలు) ఫీజును విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి న్యాయస్థానంలో ఊరట లభించింది. ఈ ఫీజు పెంపును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను డిస్ట్రిక్ట్ కోర్టు కొట్టివేయడంతో, ఇప్పుడు ఈ పోరాటం అప్పీల్ కోర్టుకు చేరింది. గత సెప్టెంబర్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రత్యేక ప్రకటన ద్వారా హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌లో భారీ మార్పులు చేశారు. విదేశీ నిపుణులను నియమించుకోవాలనుకునే కంపెనీలు ఒక్కో దరఖాస్తుకు అదనంగా లక్ష డాలర్లు చెల్లించాలని నిబంధన పెట్టారు. దీనివల్ల అమెరికా కంపెనీలు విదేశీయులకు బదులుగా స్వదేశీయులకే (అమెరికన్లకే) ఉద్యోగాలు ఇస్తాయని ట్రంప్ వాదన. ఈ నిర్ణయం వల్ల టెక్నాలజీ, హెల్త్‌కేర్, విద్యారంగాలు కుప్పకూలుతాయని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వాదిస్తోంది. ఆశ్చర్యకరంగా, మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో నియమితులైన జడ్జి బెరిల్ హోవెల్ ఈ కేసులో ట్రంప్ నిర్ణయమే సరైనదని తీర్పునివ్వడం గమనార్హం. సెక్షన్ 212() ప్రకారం విదేశీయుల ప్రవేశాన్ని నియంత్రించే లేదా పరిమితం చేసే పూర్తి అధికారం అధ్యక్షుడికి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఇది దేశ ఆర్థిక భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి, ఇందులో కోర్టులు జోక్యం చేసుకోలేవని ఆమె పేర్కొన్నారు. దీనివల్ల ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించినట్లయింది. డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ వారమే అప్పీల్ కోర్టులో పిటిషన్ వేసింది. మసాచుసెట్స్, కాలిఫోర్నియా వంటి డెమొక్రాట్ పాలిత రాష్ట్రాలు కూడా ఈ ఫీజుకు వ్యతిరేకంగా వేర్వేరుగా కేసులు వేశాయి.

ఈ ఫీజు భారం వల్ల ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలతో పాటు చిన్న స్థాయి స్టార్టప్‌లు కూడా భారత్ నుంచి నిపుణులను అమెరికాకు తీసుకెళ్లడం దాదాపు అసాధ్యంగా మారనుంది. ప్రస్తుతం అమెరికా కాన్సులేట్లలో వీసా ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనికి తోడు సోషల్ మీడియా స్క్రీనింగ్ వంటి కొత్త నిబంధనలు కూడా తోడయింది. ఇపుడు ఈన్యాయపోరాటం చివరకు అమెరికా సుప్రీంకోర్టుకు చేరే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## భారత్‌లో చిక్కుకున్న హెచ్1బి ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్‌హోమ్

### అమెజాన్ ఉద్యోగులకు స్వల్పఊరట

**న్యూఢిల్లీ, జనవరి 1:** హెచ్1బీ వీసా జాప్యం కారణంగా అమెరికాకు వెళ్లలేక భారత్‌లో చిక్కుకుపోయిన తమ ఉద్యోగులకు టెక్ దిగ్గజం అమెజాన్ భారీ ఊరటనిచ్చింది. వీసా అపాయింట్‌మెంట్ల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు 2026 మార్చి 2 వరకు భారత్ నుంచే పని (వర్క్ ఫ్రమ్ హోమ్) చేసుకునే వెసులుబాటు కల్పించింది. 2025 డిసెంబర్ 13 నాటికి భారత్‌లో ఉండి, వీసా స్లాట్స్ దొరక్క ఇబ్బంది పడుతున్న వారికి మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుంది. ఈ వెసులుబాటుతో పాటు కంపెనీ కొన్ని వింత ఆంక్షలను విధించింది. ఇండియా నుంచి పనిచేసే ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ కోడింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ వంటి సాంకేతిక పనులు చేయకూడదని స్పష్టం చేసింది. భారత్‌లోని ఏ అమెజాన్ కార్యాలయానికి వెళ్లకూడదని, టీమ్ మేనేజ్‌మెంట్ లేదా ఒప్పందాలపై సంతకాలు చేయడం వంటి అధికారిక నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చిచెప్పింది. చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకే ఈ నిబంధనలు విధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. అమెజాన్ తీసుకున్న ఈ నిర్ణయం వేలాది మంది టెక్కీలకు తాత్కాలికంగా ఊరటనిచ్చింది. గూగుల్, యాపిల్ వంటి సంస్థలు కూడా వీసా సమస్యల దృష్ట్యా అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని తమ ఉద్యోగులను ఇప్పటికే హెచ్చరించాయి.

## హైకోర్టు చీఫ్‌జస్టిస్‌కు సిఎం రేవంత్‌రెడ్డి కొత్త సంవత్సర శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 1:** నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేశ్‌కుమార్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. స్వయంగా ప్రధాన న్యాయమూర్తి నివాసానికి వెళ్లిన సిఎం ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వివిధ అంశాలపై చర్చించుకున్నారు.




FINANCE BAJAJ

**బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన**
**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035**

గోల్డ్‌లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(10-02-26) ఆర్మూర్ - అంబేడ్కర్ చౌరాస్తా; PBV9SGL14295358, 14289972, 14289140, 14320855, 14319151. భోంగీర్ - హైదరాబాద్ రోడ్; PGC3SGL14999436, 15004487, 15006867, 14994735. భూపాల్‌పల్లి - మైన్ రోడ్; P79QGOL15026072, 15019997, 15021115, 15024976, 15014601, 15030867, 15028337, 15014631. గద్వాల్ - రాజీవ్ మార్గ్; PI85GOL15125792, 15121750, 15129526, 15118436, 15120532, 15126386. గజ్వేల్ - పిడ్చేడ్; PBW4SGL15133503, 15116646. గోదావరిఖని - కల్యాణ్ నగర్; PCR3SGL15127200. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PW65GOL15152711, 15151103, 15144686. (11-02-26) హుజూరాబాద్ - వరంగల్ రోడ్; PB92GOL15176773, 15178198. ఇబ్రహీంపట్నం - బీజీఎల్; P05IGOL15172368, 15178144, 15177447. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PJE3SGL15266255. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; PIY9GOL15278083, 15283122, 15273028, 15273052, 15275047, 15266203, 15270901, 15281603, 15277615, 15271738, 15277262. కరీంనగర్ - పీవీఆర్ఎన్ రోడ్; PJF9GOL15277459, 15279774, 15267602. ఖమ్మం - గాంధీ చౌక్; PES3PRN15301962, 15306047, 15305978, 15302667, 15300299, 15297940, 15296624, 15296551, 15295822. (12-02-26) ఖమ్మం - జమ్మిబండ రోడ్; PNB6GOL15304003, 15305693, 15292777, 15296290. కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PCR3SGL15300712, 15295073. కోరుట్ల - బీజీఎల్; PG62SGL15296480, 15304793. కోస్గి - శివాజీ చౌక్; PEK3SGL15300200. కొత్తగూడెమ్ - మధుర బస్తి; PGE2SGL15292396, 15293161. మహబూబ్‌నగర్ - తెలంగాణ చౌరాస్తా; PI91GOL15352197, 15352608, 15357319, 15356271, 15357341, 15357110, 15348579. (13-02-26) మంచెరియాల్ - హైదరాబాద్ రోడ్; PGC4SGL15355955, 15359318, 15353162, 15344874, 15358148. మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్; PGC3SGL15347154, 15358782, 15348923, 15346617, 15347755, 15362096, 15360002, 15346445, 15344614, 15346721. మెట్‌పల్లి - మైన్ రోడ్; PCZ6GOL15352787, 15354736, 15353765, 15358674, 15355468, 15347017, 15348863, 15359825, 15346780. మిర్యాలగూడ - బీజీఎల్; PZB4GOL15356582, 15348357, 15353267. ములుగు - గాంధీ చౌక్; P18IGOL15371876, 15379065, 15381271, 15381858, 15376545, 15374171. నాగర్‌కర్నూల్ - బీజీఎల్; PB63SGL15381013, 15372409, 15369625. నల్గొండ - ఆర్‌పి రోడ్; PCP8GOL15378756, 15371403. (16-02-26) నారాయణ్‌పేట్ - నర్సిరెడ్డి చౌరాస్తా; PAE2PFI15368928, 15381163, 15375356, 15372239, 15372740, 15373946, 15375195. నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PV99GOL15367504, 15369096. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PML9SGL15402033, 15402256, 15410098, 15407922, 15414465, 15407821, 15409876. నిజామాబాద్ - కపిలా హోటెల్ రోడ్; PG91GOL15407910, 15406774, 15402753. నిజామాబాద్ - వినాయక నగర్; PCP6GOL15416869, 15409146, 15406488, 15413552. పరిగి - బహార్‌పేట్; PF49GOL15417014, 15402883, 15402775. (17-02-26) పర్కల్ - బస్ స్టాండ్; P63FGOL15402622, 15406364, 15411799, 15417611, 15413786, 15412828, 15403397. పట్టన్‌చెరు - బీజీఎల్; P79QGOL15412036. పెద్దపల్లె - సుభాష్ నగర్; PF89GOL15403404, 15410976, 15413137, 15416638, 15414201, 15410353, 15407728, 15413654. సదాశివ్‌పేట్ - రాచయ్య నగర్; PB52GOL15461989, 15457553. సహద్‌నగర్ వెంకటేశ్వర కాలోని; PV99GOL15451851, 15452886, 15463383, 15454723, 15453009. సంగారెడ్డి - బీజీఎల్; P7B7SGL15474508, 15487447, 15482025, 15478829, 15476079, 15496972. (18-02-26) సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PU41SGL15481881, 15490054, 15488080, 15481802, 15483407, 15477366. శంశాబాద్ - బీజీఎల్; P65HGOL15474748. సిద్ధిపేట్ - మెదక్ రోడ్; PGH7SGL15478951, 15479675, 15488859, 15481289, 15488492, 15485918. సిర్సిల్లా - మెయిన్ రోడ్; PBX4GOL15498697, 15500117, 15498366, 15507075, 15505433, 15498476, 15502767, 15503914, 15508063. సూర్యపేట్ - గాంధీ విగ్రహం; P78KGOL15522164, 15523284, 15522476, 15525470, 15528730, 15524609. తాండూర్ - ఇందిరా చౌక్; P77QGOL15530321, 15520087. తూప్రాన్ - రామాయంపేట్ రోడ్; PCY1GOL15520051, 15520878, 15524525, 15519148, 15524730, 15520243, 15532777, 15526780, 15520941. (19-02-26) వనపర్తి - రాజీవ్ చౌక్; PG01SGL15552313, 15556796, 15551776, 15558525, 15564848, 15565199. వరంగల్ - కెయు క్రాస్ రోడ్; PG61GOL15562073. వరంగల్ - స్టేషన్ రోడ్; P21IGOL15558931, 15552662. వరంగల్ - సూబేదారీ; PGU1GOL15557091, 15561283. యెల్లందు - బుగ్గవాగు; PEL7GOL15561463, 15560536, 15563658, 15562200, 15553931, 15563290. జహీరాబాద్ - ఆర్‌టీసీ బస్ స్టాండ్; PV99GOL15551602, 15561059.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# అన్నదాతకు సర్కార్ ఆసరా

### రైతులకు రూ.1.04 లక్షల కోట్లు ఖర్చు

### వ్యవసాయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పునరుద్ధరణకు, ఇతర రాష్ట్రాల దృష్టిని ఆకర్షించడానికి దాదాపు రూ.1.04 లక్షల కోట్లు ఖర్చు చేసింది. రైతాంగానికి అనుకూలమైన విధానాలను అవలంబిస్తోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వ్యవసాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ప్రధానంగా అప్పుల ఊబిలో ఉన్న రైతులను ఆదుకునేందుకు ఒక విడతలోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసింది. ఇది కేవలం ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రంలోని 25 లక్షల మంది రైతులకు రుణ విముక్తి కల్పించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.20,616 కోట్ల విలువైన పంట రుణాలను మాఫీ చేసింది. ఇది తెలంగాణ వ్యాప్తంగా రైతులకు తక్షణ ఉపశమనం కలిగించి, వారి ఆర్థిక గౌరవాన్ని పునరుద్ధరించిందని రైతు సంఘాలు సైతం అంగీకరిస్తున్నాయి. అలాగే రైతు భరోసా పథకం తొలిసారిగా ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రూ. 7,310.59 కోట్లు పంపిణీ చేసింది, దీనివల్ల 65.12 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. గత ఖరీఫ్ సీజనులో 69.40 లక్షల మంది రైతులకు సంబంధించి 145.73 లక్షల ఎకరాలకు రైతు భరోసాను అందించింది. ఇందుకు మొత్తం రూ.8,744.13 కోట్ల రూపాయలను రైతుల ఖాతల్లో జమ చేసింది. ఈ సారి దాదాపు 1.50 కోట్ల ఎకరాలకు అందించే అవకాశం ఉన్నట్లు అంచనా. అలాగే ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల పాటు 7 రోజులూ ఉచిత విద్యుత్‌ను కొనసాగించి, 29 లక్షల పంపుసెట్లకు రూ.16,691 కోట్ల సబ్సిడీని అందించింది. వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రోత్సాహకంతో వరి సేకరణ వ్యవస్థ కొత్త స్థాయికి చేర్చింది.

ఇది వరి ఉత్పత్తిలో కొత్త మైలురాయిని సాధించడానికి సహాయపడిందని చెబుతున్నారు. ఇక దాదాపు 15 లక్షల మంది రైతుల నుండి సుమారు రూ.24 వేల కోట్ల వ్యయంతో 95.31 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి తెలంగాణ ఆయిల్ పామ్ సాగులో కూడా ముందంజలో ఉండేలా విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టి అందుకు లక్ష్యాలను నిర్దేశించింది. రాష్ట్రంలో 18,985 మంది రైతులు 60,432 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారని అధికారులు పేర్కొన్నారు. మరోపక్క అకాల వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10,000 చొప్పున పరిహారం అందించగా, దీనికి గాను మొత్తం రూ.260 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా కేంద్ర పథకాలకు సంబంధించి అదనంగా, మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల కాకపోవడం వల్ల నిలిచిపోయిన 16 కేంద్ర ప్రాయోజిత పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. వాటిని తిరిగి ప్రారంభించడానికి రూ.245 కోట్లు కేటాయించారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీతో డ్రిప్ మరియు స్ప్రింక్లర్ నీటిపారుదల వ్యవస్థలను అందిస్తోంది. స్ప్రింక్లర్లపై 75 సబ్సిడీ కూడా ఇస్తున్నారు. వీటి నిమిత్తం రూ.282 కోట్ల విలువైన పరికరాలను 40,265 మంది రైతులకు పంపిణీ చేశారు. కాగా ప్రస్తుతం యాంత్రీకరణపై దృష్టిసారించి, ఇప్పటికే రైతుల నుండి దరఖాస్తులను సేకరించింది. ఈ కొత్త సంవత్సరంలో వాటని అంద చేయనుంది.

## కృష్ణా జలాల్లో కెసిఆర్ 299 టిఎంసిలకు ఒప్పుకున్నారనడం పచ్చిఅబద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ తన నోటి నుంచి టీఎంసీల కొద్దీ అబద్ధాలు, క్యూసెక్కుల కొద్దీ అజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నారని, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ ఆయనేనని ఘాటుగా విమర్శించారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. నదీ జలాల పంపకాలు, ప్రాజెక్టులపై ముఖ్యమంత్రికి కనీస పరిజ్ఞానం లేదని ఎద్దేవా చేశారు. బచావత్, బ్రిజేష్ ట్రిబ్యునళ్ల మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి సీఎంగా ఉండటం దురదృష్టకరమని అన్నారు. కేసీఆర్‌ను విమర్శించడం సూర్యుడిపై ఉమ్మేయడమేనని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

సభకు వస్తే కేసీఆర్‌ను అవమానించబోమని చెబుతూనే, మరోవైపు ఆయనను ముంబై ఉగ్రవాది కసబ్‌తో పోల్చడం రేవంత్ రెడ్డి సంస్కారహీనతకు నిదర్శనమని హరీశ్ రావు మండిపడ్డారు. "ప్రాణాలకు తెగించి, కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించిన మహనీయుడు కేసీఆర్. అలాంటి వ్యక్తిని కసబ్‌తో పోల్చిన మీకు సంస్కారం, మర్యాద అనే పదాలకు అర్థం తెలుసా? మీకు తెలిసిందల్లా అనాగరిక భాష, అసభ్య పదజాలం, బూతు ప్రసంగాలే" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను, తనను ఉరితీయాలని, రాళ్లతో కొట్టాలని వ్యాఖ్యలు చేస్తూనే, మర్యాద పాటిస్తానని సుద్దులు చెప్పడం రేవంత్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.

కృష్ణా జలాల్లో కేసీఆర్ 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటని, అది పచ్చి అబద్ధమని హరీశ్ రావు కొట్టిపారేశారు. కేసీఆర్ 299 టీఎంసీలకు ఒప్పుకుంటే, రాష్ట్రం ఏర్పడిన 42 రోజుల్లోనే 811 టీఎంసీలను పునఃపంపిణీ చేయాలని కేంద్రానికి ఎందుకు లేఖ రాశారు? ఆనాడు మొత్తం నీటిలో 69 శాతం వాటా తెలంగాణకు దక్కాలని కేసీఆర్ డిమాండ్ చేసిన విషయం మీకు తెలియదా?" అని ప్రశ్నించారు. కేంద్రం స్పందించకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లారని, బ్రిజేష్ ట్రైబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకు 50:50 నిష్పత్తిలో నీటి పంపిణీ జరపాలని 28 లేఖలు రాసి, అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో కేంద్రాన్ని నిలదీసిన ఘనత కేసీఆర్‌దని గుర్తు చేశారు, సెక్షన్ 3 ద్వారా కృష్ణా జలాల పునఃపంపిణీ చేస్తామని కేంద్రం హామీ ఇవ్వడంతోనే సుప్రీంకోర్టు నుంచి కేసు వెనక్కి తీసుకున్న నిజాన్ని ఎందుకు దాచిపెడుతున్నారని నిలదీశారు. ఈ మేరకు అపెక్స్ కౌన్సిల్ సమావేశపు మినిట్స్‌ను ప్రదర్శిస్తూ, వాటిని చదువుకోవాలని రేవంత్‌కు సవాల్ విసిరారు.

పోలవరం, నల్లమలసాగర్ విషయంలో తాను అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పకుండా, రేవంత్ రెడ్డి డొంకతిరుగుడు మాటలు మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. గోదావరి బేసిన్‌పై సుప్రీంకోర్టులో పోరాడుతామని చెబుతూనే,

### గోదావరి జలాలను ఎపికి దోచిపెట్టేందుకే రహస్య కమిటీ వేశారని ఆరోపణ

### పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులు తేలేకపోయారు: బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు

ఢిల్లీలో రహస్యంగా కమిటీ ఎందుకు వేశారు? ఆ విషయాన్ని ప్రజల నుంచి ఎందుకు దాచిపెట్టారు? కమిటీ వేయడమంటేనే ఆంధ్రప్రదేశ్ జలదోపిడికి తలుపులు బార్లా తెరవడం అని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. అన్ని నదుల నీళ్లు జూరాలకే వస్తాయని, కొత్తగా శ్రీశైలంకు వచ్చేదేముందని సీఎం మాట్లాడటం ఆయన అజ్ఞానానికి పరాకాష్ఠ అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. "తుంగభద్ర అనే నది ఉందని మీకు తెలుసా? దాని ద్వారా ఏటా 450-600 టీఎంసీల నీరు శ్రీశైలంకు వస్తుందనే కనీస అవగాహన కూడా లేదా?" అని ప్రశ్నించారు. ఈ ఏడాది జూరాలపై ఆధారపడ్డ ప్రాజెక్టుల కింద 5.50 లక్షల ఎకరాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే పంట విరామం ప్రకటించి, శ్రీశైలంపై ఆధారపడ్డ కల్వకుర్తికి 2.80 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఎన్జీటీలో కేసులు వేయించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం 90 టీఎంసీలకు డీపీఆర్ పంపి 7 అనుమతులు తెచ్చింది. మీరు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల ఒక నెలలో ఒక్క అనుమతి తేలేకపోయారు. పైగా డీపీఆర్‌ను వెనక్కి వచ్చేలా చేశారు. ఇదేనా మీ సమర్థత? అని ప్రశ్నించారు.

# తిరుమల సమాచారం

## తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలి

### - తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రెండు తెలుగురాష్ట్రాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్నారు. నూతన సంవత్సరంలో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని తెలంగాణా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆనందనిలయంలో శ్రీవారిని ,వైకుంఠద్వారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. నూతన సంవత్సరం క్యాలండర్లు బహుకరించారు. అలాగే తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్‌బాబు కూడా వైకుంఠద్వారంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఐసిసిసి కేంద్రాన్ని పరిశీలించి,భక్తుల కదలికలు, ఏఐ అమలు పరిశీలించారు.

## 15నుండి శ్రీవారికి సుప్రభాతసేవ పునరుద్ధరణ



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు దేవదేవుడిని నిద్రనుండి మేల్కొలిపేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే సుప్రభాతసేవ తిరిగి ఈనెల 15వతేదీ గురువారం నుండి పునఃప్రారంభంకానుంది. ధనుర్మాసం ఘడియలు 14వతేదీతో అర్ధరాత్రితో ముగియనున్నాయి. ఈ నేపధ్యంలో 15వతేదీ కనుమపర్వదినంనుండి ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామం వినిపించనుంది. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవను గృహస్థభక్తులను అనుమతినిస్తారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్నాం: న్యాయమూర్తులు



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం మూడవరోజు వైకుంఠద్వారంలో పలువురు న్యాయమూర్తులు దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అతుల్‌చందూర్కర్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ గోపాలకృష్ణరావు, జస్టిస్ శరత్‌చంద్ర చందూర్కర్‌లు నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభాన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 13.52కోట్ల లడ్డూలు విక్రయం

### - రికార్డు స్థాయిలో డిసెంబర్ 27న 5.13లక్షలు విక్రయాలు



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతటి పవిత్రమైన లడ్డూలను భక్తులు ఈ ఏడాది 13.52కోట్ల లడ్డూలు కొనుగోలుచేశారు. లడ్డూల నాణ్యత రుచి పెరగడంతో భక్తులు సంతృప్తికరంగా స్వామివారి ప్రసాదాలను కొనుగోలుచేయడానికి సుముఖత చూపారు. గత డిసెంబర్ 27వతేదీ రికార్డుస్థాయిలో 5.13లక్షలు లడ్డూలు టిటిడి భక్తులకు విక్రయించడం జరిగింది. గత ఏడాది 12.15కోట్ల లడ్డూలు విక్రయించగా 2025లో 13.52కోట్ల లడ్డూలు విక్రయించింది. 2024తో పోల్చితే 1.37కోట్ల లడ్డూలు అదనంగా విక్రయాలు జరిగాయి. గత దశాబ్ధకాలంలో లడ్డూలు డిసెంబర్‌లోనే అధికంగా విక్రయించడం విశేషం. రెండు షిఫ్టుల్లో 24గంటలూ కార్మికులు శ్రమిస్తూ నాణ్యత,రుచికరంగా తయారుచేయడమో ఈ విక్రయాలు నిదర్శనం, లడ్డూల నాణ్యత, రుచి పెరగడంపై భక్తులు సంతోషం వెలిబుచ్చారు.

## నూతన సంవత్సరం సందడి

### - గోవిందనామస్మరణలతో మారుమోగిన తిరుమల



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి 2026 నూతన సంవత్సరానికి స్వాగతం పలకడంతోబాటు ఇష్టదైవం దర్శనానికి వచ్చిన అశేషసంఖ్యలో భక్తులు ఆలయం ముందే సంబరాలు చేసుకున్నారు. అర్ధరాత్రి 12గంటలు దాటిన తరువాత సామాన్యభక్తులు ఆలయం ముందుకు చేరి అక్కడ గోవిందనామస్మరణలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలకడం కొత్త సాంప్రదాయంగా కనిపించింది. ఎక్కడెక్కడి నుండో వచ్చిన భక్తులు నూతన సంవత్సరం ఆరంభ సమయానికి ఆలయం ముందుకు చేరుకున్నారు. అందరూ గోవిందనామ ఉచ్చరణ చేసి అఖిలాండం వద్ద కర్పూర హారతులు పట్టారు. ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ లడ్డూలను, మిఠాయిలను పంచుకున్నారు. ఇష్టదైవం చెంత నూతన సంవత్సరం స్వాగతం ఆనందంగా ఉందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రూ.78లక్షలు విలువైన మందులు విరాళం



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:**దాతల నుండి టిటిడి వైద్యశాలల్లోఅవసరమైన ఔషధాలను విరాళంగా అందించారు. నూతన ఆంగ్ల సంవత్సరాన గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన త్రిశూల్ ఎంటర్‌ప్రైజెర్స్ సంస్థ అధినేతలు చక్రధర్, శివరంజని 78లక్షలు రూపాయలు విలువైన ఔషధాలను బోర్డు సభ్యుడు సదాశివరావుతో కలసి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. స్విమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ పాల్గొన్నారు.

## తిరుమలేశుని సన్నిధిలో ప్రముఖులు



**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని,కాశ్మీర్ ప్రజలకు మంచి జరగాలని వేడుకున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ మనోజ్‌సిన్హా తెలిపారు. 2026 నూతన ఆంగ్ల సంవత్సరం అందరికీ మంచి జరగాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ఆరంభం వేళ గురువారం వేకువజామున అనుచరులతో కలసి ఆయన తిరుమలకు వచ్చారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. అలాగే తమిళనాడు మంత్రి ఆర్.గాంధీ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు,నూతన సంవత్సరం క్యాలండర్,డైరీలు అందజేశారు.

# తెలుగు భాష సంబరాలకు అంతా సిద్ధం

### రేపటి నుంచి గుంటూరులో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు -52 దేశాలకు చెందిన ప్రతినిధులు, తెలుగు సంఘాల ప్రతినిధుల రాక - 4న విచ్చేయనున్న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ - 5న హాజరుకానున్న సిఎం చంద్రబాబు

ప్రపంచ తెలుగు మహాసభల లోగో

**విజయవాడ, జనవరి1, ప్రభాతవార్త ప్రతినిధి:**ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి మూడు నుంచి ఐదవ తేదీ వరకూ గుంటూరులో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, మహాసభల సమన్వయకర్త రామచంద్రరాజు తెలిపారు. నగరంలోని స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొలి రోజు ఉదయం తొమ్మిది గంటలకు అన్నమయ్య గళార్చనలతో మహాసభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సభకు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పి.నరసింహా, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, జి.కిషన్‌రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరు అవుతారని తెలిపారు. మూడవ తేదీ సాయంత్రం 'ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారాల సభ'కు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, పలువురు న్యాయమూర్తులు, పార్లమెంటు సభ్యులు హాజరు కానున్నారు. నాల్గవ తేదీ 'తెలుగు వెలుగుల సభ'కు మారిషస్ దేశ అధ్యక్షులు ధరమ్‌బీర్ గోకుల్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారని తెలిపారు. అదే రోజు సాయంకాలం తెలుగు వైభవ సభలో వివిధ రంగాలకు చెందిన కవులు, కళాకారులు, నృత్యకారులకు పురస్కారాలను ప్రదానోత్సవం చేయనున్నట్లు చెప్పారు. ఐదవ తేదీ 'ఆంధ్ర మేవ జయత్తే సభ'కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గోవా గవర్నర్ పి. అశోక్‌గజపతి రాజు హాజరు అవుతారని తెలిపారు. ఈ సభలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభల పోస్టల్ కవర్‌ను సిఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరిస్తారని చెప్పారు. ఐదవ తేదీ సాయంకాలం జరిగే 'మన తెలుగు భాష, అమృత భాష సభ'లో మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పాల్గొననున్నారని చెప్పారు. తరువాత సమాపనోత్సవ సభ జరుగుతుందని, ఈ సభలో మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కవితా గోష్టులు, సాహితీ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుంటూరు వేదికగా మూడు రోజుల భాషా సేవా సంబురం తెలుగువారి ఆత్మీయ పండుగకు గుంటూరు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 16వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న సాయి బొమ్మిడాలనగర్‌లోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు వేదికవుతోంది.

**అనురాగ సంగమం నామకరణం**

ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమం నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ మహాసభల ముఖ్య సమన్వయకర్తగా పి. రామచంద్రరాజు వేదికల నిర్మాణం, రోడ్ల ఏర్పాటు వంటి తదితర పనులను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ సభలు జరగనున్నాయి. అయితే ప్రధానంగా 10 ఎకరాల్లో పార్కింగ్, మరో 10 ఎకరాల్లో వేదికలు ఏర్పాటవుతున్నాయి. దాదాపు 5,000 మంది కూర్చునేలా నందమూరి తారకరామారావు ప్రధాన వేదికను నిర్మిస్తున్నారు. కవి సమ్మేళనాలకు జాషువా, కరుణశ్రీ వేదిక, అవధానాల ప్రదర్శనల కోసం కొప్పరపు కవుల వేదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తూము నరసింహదాసు వేదిక, పాడనా తెలుగు పాట కోసం ఘంటసాల, ఎస్.పి.బాలు వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద మూడు క్యాప్సూల్ హోమ్స్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఇంటిని తలపించేలా షవర్లు, బెడ్‌రూమ్, బాల్కనీ వంటి వసతులన్నీ ఉన్నాయి. అతిథుల కోసం గుంటూరు పరిసరాల్లో 3,000 గదులను నిర్వాహకులు ఇప్పటికే సిద్ధం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు దాదాపు 25,000 మంది యువతీ యువకులతో తెలుగు భాషపై వివిధ

## వడ్డీకాసులవానికి రికార్డుస్థాయిలో హుండీ ఆదాయం

### - రూ.1,300కోట్లు పైమాటే

**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత సంపన్నవంతమైన దేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం కూడా రికార్డు సృష్టిస్తోంది. ప్రతినెలా 110-120 కోట్ల రూపాయలు మధ్య హుండీ ఆదాయంతో 2025జనవరి నెలనుండి 2025 డిసెంబర్‌నెల వరకు వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి అత్యధిక సంపన్నవంతమైన దేవుడుగా విరాజిల్లుతున్నాడు. శ్రీవారి భక్తులు తమ కానుకలుగా హుండీకి సమర్పించిన ఆదాయమే 1,300కోట్ల రూపాయలు పైమాటగానే నమోదైంది. సగటున ఒక్కోనెలలో హుండీ ఆదాయం 125 కోట్లురూపాయలు కూడా నమోదైంది. ఒక్కోరోజు ఐదుకోట్ల రూపాయలు కూడా హుండీకి ఆదాయం వచ్చింది. ఈ ఏడాది డిసెంబర్‌లో 125కోట్లు రూపాయలు ఆదాయం లభించింది. 2021వ సంవత్సరంనుండి ప్రతినెలా వందకోట్ల రూపాయలుపైగానే కానుకల రూపంలో హుండీకి చేరుతుండటం ప్రత్యేకత. సామాన్యుడి నుండి సంపన్నులు వరకు దేశవిదేశాల్లోని భక్తులు తమ ఇష్టదైవం కలియుగవైకుంఠవాసుడు ఆ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని సంతృప్తికరంగా ప్రతిరోజూ 70వేలమంది వరకు దర్శించుకొంటున్నారు. ప్రతి నెలలో సరాసరి 22లక్షలమంది వరకు భక్తులు దర్శనాలు చేసుకుంటున్నట్లు గణాంకాలు తెలుస్తున్నాయి. భక్తుల సంఖ్యకు రెట్టింపుగా,స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డుసృష్టిస్తోంది. డిసెంబర్ నెలకు సంబంధించి 21.07లక్షలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా హుండీ కానుకలు 125.06కోట్ల రూపాయలు ఆదాయం లభించింది. ఇక వెంకన్న లడ్డూ ప్రసాదాలు కూడా నెలవారీగా కోటివరకు లడ్డూలు విక్రయించగా ఏడాదిలో 13.52కోట్లు లడ్డూలు విక్రయించారు. భక్తుల కానుకల ద్వారానే హుండీకి గణనీయమైన ఆదాయం చేకూరడం విశేషం.

## మూడవరోజు ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం



**తిరుమల,జనవరి 1ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనంలో భాగంగా మూడవరోజు గురూవారం ,జనవరి 1న భక్తుల సంఖ్య కొనసాగుతోంది. ఎంతో పవిత్రమైన మోక్షమార్గం వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ముందుగానే ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీచేసింది. ఈ టోకెన్లు పొందిన తెలుగురాష్ట్రాల భక్తులేగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ,ఒడిశ్శాకు చెందిన భక్తులు తిరుమలకు చేరుకుని మహాలఘులో ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. వైకుంఠద్వారంలో తొలిరోజు ఏకాదశిన 30న మంగళవారం 67,053 ముంది భక్తులు, రెండవరోజు ద్వాదశిన 70,256మంది. మూడవరోజు గురువారం సాయంత్రం వరకు 37వేలమంది భక్తులకు మహాలఘులో వెంకన్నను దర్శించుకునేలా చూశారు.

## అర్ధరాత్రి నుండి సాధారణ సర్వదర్శనం

**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి సామాన్యభక్తులకు ప్రశాంతంగా దర్శనం కల్పించేలా టిటిడి అధికారులు తొలిమూడురోజులు సఫలీకృతులయ్యారు. కాగా ఎటువంటి టోకెన్, టిక్కెట్ లేకపోయినా శుక్రవారం ఉదయంనుండి సామాన్యభక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించేలా ముందుగానే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ,విజిలెన్స్‌అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. వైకుంఠమ్ 2లోనికి ఆక్టోపస్ భవనం వద్ద క్యూలైన్లనుండి భక్తులను అనుమతించేలా పూర్తిగా క్యూలైన్లు మార్చారు. భక్తులు ఈ వారంరోజులు ఔటర్‌రింగురోడ్డుకు చేరుకుంటే ఆయా ప్రాంతాలకు ఉచితంగా భక్తులను చేరవేస్తారు.భక్తులను ఎక్కడ నుండి అనుమతించాలి అనే విషయంపై క్యూలైన్లను గురువారం తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, ఆర్టీసి అధికారులు తనిఖీ చేశారు.

### 25న మినీబ్రహ్మోత్సవం - ఒకేరోజు ఏడువాహనాలపై మలయప్ప దర్శనం

**తిరుమల,జనవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలక్షేత్రంలో ఈనెల 25వ తేదీ ఆదివారం రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు కటాక్షించనున్నారు. మాఘమాసంలో సప్తమితిధి అత్యంత విశిష్టమైనది. ఆ రోజు దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఉదయం సూర్యప్రభవాహనం నుండి రాత్రి చంద్రప్రభవాహనం వరకు ఏడువాహనాలపై అధిరోహించి ఊరేగుతారు. దీనికి మినీబ్రహ్మోత్సవం అని కూడా పేరు. సాధారణంగా ఏడాదిలో వరుసగా తొమ్మిదిరోజులు పాటు 16వాహనాలపై ఊరేగే శ్రీవేంకటేశ్వరుడు రథసప్తమిన ఒకేరోజు ఏడువాహనాలను అధిరోహించి భక్తులకు దర్శనమిస్తాడు. ఆపదమొక్కులవాడు అనాధరక్షకుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి శ్రీదేవిభూదేవి ఉభయనాంచారులతో కలసి పలు వాహనాలపై విహరిస్తారు. 25వతేదీ ఆదివారం ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభతో మొదలై వరుసగా పెద్దశేషవాహనం, చిన్నశేషవాహనం, గరుడవాహనం, చక్రస్నానం, సర్వభూపాలవాహనం , అశ్వవాహనం, చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయి. ఈ వేడుకలకు తిరుమలను సర్వాంగసుందరంగా ముస్తాబుచేస్తారు. భక్తులు అశేషసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, ఆలయం పరిసరాల్లో రంగవల్లులు తీర్చిదిద్దడం పనులు మొదలుకానున్నాయి. రథసప్తమి వేడుకలను అంగరంగవైభవంగా జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్దమవుతోంది.

## గురువుతో దెబ్బలు కొట్టించుకున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి



గురువుతో దెబ్బలు కొట్టించుకుంటున్న రఘువీరారెడ్డి

**అనంతపురం, జనవరి 1, (ప్రభాతవార్త బ్యూరో)** శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామం సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి స్వగ్రామం. నూతన సంవత్సర వేడుకలు వేడుకల్లో భాగంగా తమకు పదవ తరగతిలో పాఠాలు చెప్పిన గురువు హనుమంత రాయప్పకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఇతర మిత్రబృందం కాళ్లు కడిగి నమస్కారం చేసుకున్నారు. ఘనంగా గురువు హనుమంతరాయప్ప దంపతులను సత్కరించారు. తాము చదువుకున్న సమయంలో టీచర్ దెబ్బలను గుర్తు చేసుకుంటూ గురువు హనుమంతరాయప్పతో బెత్తంతో మాజీమంత్రి రఘువీరారెడ్డి, ఇతర మిత్రులు కొట్టించుకున్న సంఘటన ఆసక్తికరంగా మారింది. నూతన సంవత్సరం సందర్భంగా జరిగిన సంఘటనను గ్రామస్తులు ఆనందంతో ఆస్వాదించారు.

## స్త్రీశక్తి అమల్లో సిబ్బంది కృషి అభినందనీయం

### - ఆర్టీసి వి.సి. ఎండి ద్వారకా తిరుమల రావు

**సచివాలయం, జనవరి 1 ప్రభాతవార్త:** 2025 సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన "స్త్రీశక్తి పథకం అమల్లో మన సిబ్బంది కృషి అభినందనీయమని తద్వారా ప్రభుత్వానికి ఆర్టీసీ పట్ల మంచి నమ్మకం కలిగిందని అదే ఎప్పటికీ నిలబెట్టుకుంటూ ముమ్మందు కూడా అందరూ అంకితభావంతో పని చేయాలని సంస్థ విసి ఎండి సిహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం ఆర్టీసీ హౌస్‌లో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి, ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈఏడాది కూడా ఎండిగా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఉద్యోగుల సంక్షేమా నికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సంస్థ ఎండి ద్వారకా తిరుమలరావు తెలిపారు. 2025లో ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం ప్రమోషన్లు ఇచ్చేందుకు అంగీకారం తెలపడమే కాకుండా ఇప్పటికే చాలా మందికి ప్రమోషన్లు ఇవ్వడం కూడా జరిగిందని వారంతా మరింత ఉత్సాహంతో పనిచేస్తారని నమ్ముతున్నట్లు తెలిపారు. త్వరలో 1500ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని మొదటగా రాజమండ్రి పుష్కర సమయంలో వాటిని అందుబాటు లోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచి స్తుందని ఆ దిశగా చార్జింగ్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని ద్వారకా తిరుమలరావు తెలిపారు. చివరగా ఈ నూతన సంవత్సరాన్ని ఆనందంగా ఆహ్వానిస్తున్నామని ఇదే ఉత్సాహంతో సంస్థ అభివృద్ధికి, ప్రతి ఉద్యోగి తమ గురుతర బాధ్యతలు నిర్వర్తించాలని, ఈ కొత్త సంవత్సరం కూడా అందరికీ మంచి జరగాలనే ద్వారకా తిరుమలరావు అశాభావం వ్యక్తంచేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్. బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో సంస్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి.రవి వర్మ, ఎఫ్ఏ అండ్ సీఏఓ ఎన్. సుధాకర్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ మధు, ఆర్టీసీ హౌస్ అధికారులు, వివిధ అసోసి యేషన్ల ప్రతినిధులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, విజయవాడ పిఎన్ బిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు

- మొత్తం రూ. 5.50 కోట్ల సొత్తు రికవరీ
- సత్యసాయి జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ వెల్లడి

హిందూపురం, జనవరి 1 ప్రభాతవార్త: ఐదు నెలల కిందట దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 12 కేజీల బంగారు భారీ దోపిడీ కేసును హిందూపురం పోలీసులు ఛేదించారు. సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం హిందూపురం అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ నందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గతేడాది జులై 27న హిందూపురం మండలం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న తూముకుంట పారిశ్రామిక వాడలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు దోపిడీ జరిగింది. ఈ ఘటనలో దాదాపు 12 కేజీల బంగారు ఆభర ణాలు, లక్షలాది రూపాయల సొమ్ము చోరీ జరిగింది. డి.ఎస్.పి మహేష్ నేతృతంలో అప్గ్రేడ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, పోలీస్ బృందం పెద్ద ఎత్తున ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్ ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టి రెండు నెలల కిందట రెండు కేజీల బంగారం రికవరీ చేశారు. ఈ క్రమంలో ఈ కేసు విచారణను మరింత ముమ్మరం చేశారు. కాగా ఏడాది కిందట కోయంబత్తూర్ జైలులో హర్యానాకు చెందిన అనిల్ కుమార్, రాజస్థాన్ చెందిన ఇషార్ ఖాన్ మధ్య స్నేహం ఏర్పడి భారీ దోపిడీలు చేయాలని నిర్ణయించారు. వీరిద్దరూ జైలు నుంచి విడుదలయ్యాక ఒక ద్విచక్ర వాహనం తీసుకొని ఐదు ఆరు నెలలపాటు 14000 కిలోమీటర్ల వరకు వివిధ రాష్ట్రాల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహించి చివరకు హిందూపురం సమీపంలోని తూముకుంట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ను సెలెక్ట్ చేసుకున్నారు. వీరిద్దరూ ఇక్కడ దోపిడీకి పాల్పడి బెంగళూరు మీదుగా ఢిల్లీకి పారి పోయారు. విచారణలో అనిల్ కుమార్ పోలీసులకు చిక్కడంతో మొదట్లో రెండు కేజీల బంగారం రికవరీ అయింది. ఈ విషయం తెలుసుకొని తనను కూడా ఏపీ పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో ఇషార్ ఖాన్ ఓ పాత కేసులో అక్కడి పోలీసులకు లొంగిపోయి జైలుకు వెళ్లాడు. అక్కడి కోర్టులో పిటి వారింట్‌ను వేసి అతడిని అదుపులోకి తీసుకొని విచారణ నిర్వహించా మని ఎస్పీ చెప్పారు. తన బ్యాచ్ మెంట్ ఐపీఎస్‌ల సహకారంతో, అక్కడి స్థానిక పోలీసుల సహకారంతో కేసును చేదించామని చెప్పారు. ఇతడి నుంచి మూడున్నర కేజీల బంగారం రికవరీ చేశారు. కాగా చోరీ అయిన దాదాపు 12 కేజీలలో కరిగించిన తర్వాత బంగారం 10.3 కేజీలు అయిందని చెప్పారు. ఇప్పటిదాకా మొత్తం 5.5 కేజీల బంగారం రికవరీ చేశామని అన్నారు. నేపాల్‌లో అనిల్ కుమార్ జూదం ఆడి భారీగా ఖర్చు చేశాడని, మరోవైపు ఇషార్ కాన్ రెండు జెసిబిలు కొని ఇంటి నిర్మాణం తన ప్రాంతంలో చేపట్టాడన్నారు. మిగిలిన సొత్తు రికవరీకి కోసం ప్రాపర్టీ అటా చ్మెంట్ చేసేందుకు ఆ రాష్ట్రాల ప్రభుత్వాలతో ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ కేసును చాలెంజిగా తీసుకొని చేదించిన డిఎస్‌పి మహేష్, సిఐ ఆంజనేయులును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంకుల్లో వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని, అలారం ఏర్పాటు చేసుకొని, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను తగిన విధంగా భద్రత పరుచుకునేందుకు బ్యాంకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఎక్కడైనా అనుమానితులపై సమాచారం ఉంటే పోలీసులకు చెప్పాలనిఎస్పీ కోరారు.

## తాడిపత్రి బాగు కోసం జె.సి ప్రభాకర్‌రెడ్డి దీక్ష

తాడిపత్రిఅర్బన్, జనవరి 1 ప్రభాతవార్త: తాడిపత్రి బాగుకోసం మున్సిపల్ ఛైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి జనవరి 1న నిరాహార దీక్ష చేయడం అనంతపురం జిల్లాలో సంచలనంగా మారింది. తాడిపత్రి మున్సిపాలిటీ అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో మున్సిపాలిటీ ఆస్తుల వివరాలు ప్రజలకు తెలపాలని దీక్ష చేపట్టిన జె.సి ప్రభాకర్‌రెడ్డి దీక్ష వల్ల 50శాతం విజయవంతం అయ్యానని ప్రకటించారు. గాంధీ సర్కిల్‌లో జెసి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి బాగు కోసం దీక్ష చేపట్టి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రజలు చేయాల్సిన పనులపై కరపత్రాన్ని తయారు చేయించి గురువారం ఉదయం 10 గంటలకు దీక్ష చేపట్టి సాయంత్రం 5 గంటలకు విరమించారు. ఉదయం దీక్ష చేపట్టినప్పుడు 20శాతం మంది మాత్రమే గమనించారని, సాయంత్రం అయ్యేసరికి 50శాతం ప్రజలు చర్చించుకుని తాను చేపట్టిన దీక్ష గురించి మాట్లాడుకున్నారని దీనివల్ల తాను సక్సెస్ అయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరం వేడుకలు ప్రజలందరూ చేసుకుంటున్నారని కొన్ని కట్టుబాట్లు చేసుకుంటే ప్రజలందరూ సంతోషంగా ఉంటారన్నారు. అనంతపురం పట్టణంలోని సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాల్ వద్ద చెత్త భారీగా వేశారని దాన్ని ఎలా తొలగిస్తారో అధికారులకు అర్థం కావడం లేదన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో ఆ పరిస్థితి లేదన్నారు. గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో కొద్ది శాతం వెనుకబడి ఉందని ప్రస్తుతం ఆ లోటును పూర్తి చేయడం జరిగిందన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం, ఎంత ఖర్చు అవుతోందో ప్రజలకు తెలపాలని ఫ్లెక్సీ వేశామన్నారు. స్వయం సహాయక సంఘాల పేరుతో బ్యాంకులో రుణం తీసుకొని హిటాచిని కొన్నామని, ఆ హిటాచిని మున్సిపాలిటీకి అద్దెకు ఇచ్చి వచ్చే ఆదాయం ద్వారా బ్యాంకు రుణం తీర్చి, మిగిలిన మొత్తాలను స్వయం సహాయక సంఘాలకు ఇస్తామన్నారు. తన దీక్ష గురించి తాడిపత్రి పట్టణంలో చర్చ మొదలైందన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ ఎక్కడా లేదని చెత్తను గార్బేజి వాహనాల్లో ప్రజలు వేస్తున్నారన్నారు. ప్రజలందరికీ మున్సిపాలిటీపై అవగాహన కల్పించడానికి దీక్షను చేసినట్లు పేర్కొన్నారు. 2026 సంవత్సరం చివరికల్లా తాడిపత్రిని నెంబర్-1 మున్సిపాలిటీగా చేస్తామన్నారు. భూగర్భ నీటి వ్యవస్థ ద్వారా వచ్చిన నీటిని శుద్ధి చేసి పట్టణ సమీపంలోని ఆర్జాస్ స్టీల్ ప్లాంట్‌కు సరఫరా చేసి ఆదాయం చేకూర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా 270 ఎకరాలు మున్సిపాలిటీకి ఆస్తిగా ఉందన్నారు. దాదాపు 2 వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని,

సంవత్సరానికి 3 కోట్ల రూపాయలు మున్సిపల్ రూముల ద్వారా అద్దె వస్తోందన్నారు. మున్సిపాలిటీకి వస్తున్న అద్దె మరో కోటి రూపాయలు ఎక్కువ వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సోలార్‌ను ఏర్పాటు చేసి 26 లక్షల రూపాయలు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

శానిటేషన్ ద్వారా మరో 25 లక్షల రూపాయల ఆదాయం వచ్చేలా వనరులు సమకూర్చుకుందామని తాడిపత్రి ప్రజల అభివృద్ధి కోసమే తాము ఈ ప్రయత్నం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



# పిల్లలకు పుస్తకాలు చేరువ చేస్తూ..

**ఈ తరం పిల్లలు సాంకేతికతతో పోటీపడుతున్నారు. చదువు, కాలక్షేపం ఏదైనా... ఆధారపడేదీ ల్యాపీలు, మొబైళ్ల మీదే! అంటే... వాళ్లకి పుస్తకాలతో పని లేనట్లేనా? కాదంటారు. క్రాంతి గద. వ్యాపారవేత్తగా మారి... పిల్లలకు పుస్తకాలను చేరువ చేస్తున్నారీమె!**

"నా చిన్నప్పుడు పుస్తకమే లోకం. అది నాకు ప్రపంచాన్ని తెలుసుకునే మార్గం. నా ఊహలకు రెక్కలిచ్చేది. కొత్త లక్ష్యాలను నా ముందు ఉంచేది అలాంటి నేస్తాన్ని నా పిల్లలకు పరిచయం చేయకుండా ఉంటానా! అందుకే ఇంట్లో కచ్చితంగా పుస్తకాలకు చోటుండేది. చదవమని మా వాళ్లని ప్రోత్సహించేదాన్ని కూడానంటారు క్రాంతి ఈమెది ముంబయి. 'వెప్సికో' సంస్థలో కెరియర్ ప్రారంభించిన ఈమె తరవాత షిమారూ ఎంటర్టైన్మెంట్కి మారారు. ఆ సంస్థకి సీఓఓగా చేశారు. అలాంటి ఆమెకు సవాలు ఇంట్లోనే ఎదురైంది. నాకిద్దరు బాబులు. ఓరోజు చిన్నవాడు వచ్చి, అమ్మ రోజూ నేను పుస్తకం చదువుతున్నాను అని చెబుతున్నా కదా! నిజానికి లేదు. రోజూ ఇలా నీకు అబద్ధం చెప్పడం నాకు నచ్చలేదు అన్నాడు. నేను కోప్పడలేదు. ఇద్దరినీ ఒకేలా. ప్రోత్సహించా. అయినా ఒకరు చదవడానికి ఇష్టపడుతున్నారు. మరొకరికి ఎందుకు నచ్చట్లేదు. అనిపించింది. గమనిస్తే వాడి ఆసక్తులు వేరని తెలిసింది. దానికి తగ్గట్టుగా పుస్తకాలను మార్చా, ఇష్టంగా పుస్తకాన్ని తెరవడం మొదలుపెట్టాడు అని గుర్తు చేసుకుంటారు క్రాంతి. మొబైల్, సిస్టమ్ ముందు గంటలకొద్దీ కూర్చొనే పిల్లలకి... కాసేపు పుస్తకం పట్టుకోమంటే మాత్రం విసుగు, ఇది తన ఇంటి సమస్యే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఉందని అర్థమయ్యాక దీనికో పరిష్కారం చూపాలి అనుకున్నాడు క్రాంతి, పుస్తకం చదవడం ఇష్టమైన వ్యాపకంగా మలచాలి అనుకున్నారామె. అందులో భాగంగా తీసుకొచ్చిందే 'ఇఒన్' స్క్రీమ్ తగ్గించాలి. స్కూళ్లల్లో పిల్లలు పుస్తకాలు చదవట్లేదన్న ఫిర్యాదులు, పుస్తకాన్ని పరిచయం చేయాలన్న తపన కారణమేదైతేనేం, పిల్లలకు చదవడం అలవాటు చేయాలనుకుంటున్న తల్లిదండ్రులు చాలామందే. ఇదే నా పరిశోధనలో తేలింది. అయితే పుస్తకాల ఖరీదు ఉండటం, ఇంట్లో అవి దొంతరలుగా పేరుకుపోవడం కూడా సమస్యగా ఉందని గ్రహించా. అందుకే ఆన్లైన్లో పుస్తకాలు అందించడం మొదవలుపెట్టానంటారు క్రాంతి.

**నెలకు ఐదు ...** చదవాలన్న కోరిక, ఏది చదవాలన్న ఎంపిక పిల్లల చేతిలోనే ఉండాలనుకుంటున్నారామె. అందుకే 'నిఒన్'ని డిజిటల్ రూపంలో తీసుకొచ్చారు. ఒకరకంగా పుస్తకాలను అద్దెకు ఇచ్చే సంస్థగా చెప్పొచ్చు. 50 వేలకుపైగా పుస్తకాలను దానిలో ఉంచారు. నెలవారీగా కొంత మొత్తం కట్టి, పిల్లలు తమకు నచ్చిన అయిదు పుస్తకాలను ఎంచుకోవచ్చు. వాటిని కొరియర్ ద్వారా ఇంటికి పంపుతారు. చదవడం పూర్తయ్యాక, వేరేవి ఏంచుకునేలా ఏర్పాటు చేశారు. పూర్తయిన పుస్తకాలను సంస్థ ప్రతి నిధులే తీసుకెళ్లిపో తారు. ప్రత్యేకంగా అయిదు పుస్తకాలు అని పెట్టడానికి కారణ మైంది. వాటిలో ఒకటి నచ్చకపోతే మరొకటి ఎంచుకునే అవకాశం పిల్లలకు ఉంటుంది. పైగా అయిదూ పూర్తిచేయాలనేం లేదు. కనీసం ఒక్కటి నచ్చి పూర్తిగా చదివినా మేలే కదా! మిగిలినవాటి పేర్లు, అది దేనికి సంబంధించిందో తెలుస్తుంది. పోటీగా భావించేవాళ్లైతే మొత్తం చదివేస్తారు. ఏవిధంగా అయినా వాళ్లకి పుస్తకం అలవాటు అవుతుంది అంటారు క్రాంతి. పుస్తకాల సేకరణకి చాలానే కష్టపడ్డాం. నా గత సంస్థ లైబ్రరీ సాయమూ తీసుకున్నా, హిందీ, ఇంగ్లీషుతోపాటు దేశీ భాషలన్నింటిలో పుస్తకాలు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మా దగ్గర క్యూరేటర్ బృందం ఉంది. ముందు ఏ పుస్తకమైనా వాళ్లు చదువుతారు. పిల్లలకు అనుకూలం అన్నాకే వెబ్సైట్లో పెడతాం. ప్రస్తుతం దేశంలో దొరకని పుస్తకాలు మా దగ్గరున్నాయి' అనే క్రాంతి సేవలు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని 300 పట్టణాలు, నగరాలకు విస్తరించాయి. పుస్తకాన్ని చేతిలోకి తీసుకోవడం, ఆ సువాసనని ఆస్వాదిస్తూ.. అక్షరాల వెంట కళ్లను పరుగెత్తించడం ఓ అనుభూతి. తెర నుంచి ఆ అనుభూతి దిశగా పిల్లలను నడిపించాలన్నదే నా కోరిక అంటోన్న క్రాంతి ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!

# మెరిసే జుట్టుకి గంజి

వాతావరణం మారింది. పొడిగాలకు తేను తగ్గి. జుట్టు నిర్జీవంగా మారుతుంది. మరి వాటికి తగిన పోషణ ఖరీదైన సాంపూలు, కండి షనర్లే వాడక్కర్లేదు. గంజి కూడా మేలు చేస్తుంది.



చైనీస్, కొరియన్ బ్యూటీ కేడీ దీనికి ప్రత్యేక ప్రాధాన్యమూ ఉంది. మరి దీన్నెలా వాడాలి? ఆ ప్రయోజనా లేంటో తెలుసుకుందామా! గంజిలో ఇనోసిటాల్ అనే కార్బోహైడ్రేట్ జుట్టు కుదుళ్లని బలాన్ని ఇస్తుంది. ఒత్తుగా ఎదిగేలా వేస్తుంది. ఇందులో కాస్త నిమ్మరసం కలిపి పెడితే మెరుపు కనిపిస్తుంది. ఉడికించిన అన్నం నీళ్లల్లో విటమిన్ బి, ఇ, సి విటమిన్లు ఉంటాయి. ఇవి వెంట్రుకలకు పోషణ అందించి ఆరోగ్యంగా మారుస్తాయి. కండిషనర్గా వాడితే జుట్టు చిట్లడం తగ్గుతుంది. పొడవూ జుట్టు బిరుసుగా మారిందా? అయితే, గోరువెచ్చగా ఉన్నపుడే గంజిని తలకు పట్టించి ఓ పదిహేను నిమిషాలు వది లేయండి. ఇది కురులను మెత్తగా మారుస్తుంది. ఇందుల తెస్తుంది.

# తిరుప్పావై

## 18వ పాశురము

ఉన్దు మదకళిత్తన్ ఓడాద తోళ్
వలియన్
గోపాలన్ మరుమగళే!
నప్పిన్నాయ్!
కన్దమ్ కమరుమ్ కుళ్ల కడైతిఅ
వాయ్,
వన్దు ఎంగుమ్ కోళి
యళైత్తనకాణ్, మాదవి
ప్పనల్ మేల్పల్ కాల్ కుయిలి
నంగళ్ కూవినకాణ్,
పన్దార్విరలి! ఉన్మైత్తునన్
పేర్పాడ,
శెన్దామరైక్కైయాల్ శీరార్
వళైయొలిప్ప
వన్దుతిఅవాయ్ మకిళ్ న్దేలో
రెమ్బావాయ్



ఏనుగులతో పోరాడే శక్తిగలిగిన, చాలా ఏనుగులు కలవాడైన, యుద్ధములో శత్రువులను చూచి వెను కంజవేయని, భుజబలము గలిగిన నందగోపాలుడి కోడ లైన. నీలాదేవిని తలుపు తెరువమంటు న్నారు.కోడికూతలు వినవస్తున్నాయి. మాధవీలత ప్రాకిన పందిరి మీద, గుంపులు గుంపులుగ చేరి కోకిలలు కూస్తున్నాయి.సుగంధము వెదజల్లుతున్న కేశపాశములుగల, బంతిని చేతపట్టుకొన్న, ఎఱ్ఱతామరను పోలిన బంగారు గాజుల శబ్దముతో ఓనీలా ! నంతోషముతో నడిచివచ్చి తలుపుతీయవమ్మా ! మేము నీ బావను కీర్తించుటకు వచ్చి రాము" అని వెలుపలి గోపికలు నీలాదేవిని కోరుతున్నారు.

ఫలం : 'లక్ష్మీ కటాక్షం.

# బరువు తగ్గాలా ..

చోరదోర జామకాయలను చూడగానే చటు క్కున్న కొరుక్కుని తినేయాలనిపి స్తుంది. పచ్చగా, చూడచక్కగా ఉండే వీటిలో పోష కాలూ ఎక్కువే 'పేదవాడి యాపిల్గా'గా పిలిచే వీటిల్లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలెన్నో.... వ వీటిల్లో విటమిన్సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి.. తరచూ అనారోగ్యాల బారినపడకుండా కాపాడుతుంది. అంతేకాదు ఈ విటమిన్ తెల్లరక్తకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరా డికల్స్ బారి నుంచి శరీరాన్ని కాపాడ తాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. వీటిల్లో ఉండే అధిక పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుండెపోటుకు గురికాకుండా సాయపడుతుంది. ఇది రక్త పోటును నియంత్రించడానికీ తోడ్పడుతుంది. జామకాయల్లో ఉండే పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రిం చడానికి సాయపడతాయి. ఎక్కువగా ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరు స్తుంది. అంతేకాదు మలబద్ధకాన్నీ పోగొడుతుంది. పీచు ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇవి సరైన ఎంపికకాగలవు.



# సహజంగా మెరిసిపోదాం !



అందంగా కని పించాలనే ప్రయత్నంలో మేకప్ తప్పనిసరి అని భావించేవారి సంఖ్యలో రోజుకి పెరుగుతోంది. అయతే,కరణ ఎబ్బెట్టుగా కాకుండా సహజంగా ఫౌండేషన్ వేస్తే తెల్లగా, అందంగా కనిపిస్తామనేది చాలామంది అపోహ. అయితే, అ శరీరంలో కలవకపోయినా, మీ చర్మ ఛాయకు, తత్వానికి పరిపడకపోయినా... ముఖ వర్చస్సుని చెడగొడుతుంది. ఇలాంటప్పుడు ఒక రంగుని ఎంచుకునే కంటే మీ ఛాయకు దగ్గరగా వచ్చేలా చిత్రా లను కలిపి చూడండి. దాన్ని లైటింగ్ కింద కాకుండా ఆరుబయట వెలుతురులో చెక్ చేసుకోండి, ఇక, ఫౌండేషన్ ప్యాచుల్లా కనిపించకూడదంటే ఆయిల్ ఫ్రీ ధకాలను ఎంచుకోవాలి. లైట్ ఫౌండేషన్ లేదా టింటెడ్ మాయి శ్చరైజర్ని ఎంచుకుంటే చర్మం మేకప్కి అనువుగా మారుతుంది. అయితే, అలంక రణకు ముందు తప్పనిసరిగా ముఖాన్ని శుభ్రంగా, తేమగా ఉంచుకోవడం తప్పనిసరి. చివరిగా నుదురు, ముక్కు కణతల దగ్గర బ్రాంజ్ పౌడర్ తో టచప్ చేయాలి... చర్మం ఎక్కువగా మెరుస్తున్నా. జిడ్డుగా కనిపిస్తున్నా కాంపాక్ట్ పౌడర్ని పూర్తిగా అద్దేయండి. అప్పుడు సహజంగా కనిపించొచ్చు. పెదాలకు లేత గులాబీ న్యూ, పీచ్ షేడ్స్ లిప్ స్టిక్ను ఏంచుకుంటే బాగుంటుంది. అయితే, ముందుగా బామ్ రాసి పెదవులను తేమగా ఉంచడం మరిచి పోవద్దు. తక్కువ కళ్ల మేకుతోచాలా సహజంగా కనిపించొచ్చు. ఇతర బ్లాక్ ఐలైనర్ వాడండి. కనురెప్పలపై బ్రాంజ్ షేడ్ని ఎంచుకుని లైట్గా అద్దండి.

# ఇంట్లోనే వెన్న చేద్దామిలా !

పెరుగు, మజ్జిగ వినియోగం పెరుగుతుంది. పాత రోజుల్లో అయితే... మజ్జిగని ఇంట్లో చిలికేవారు. దీని కోసం కవ్వాలుండేవి. ఇప్పుడైతే మజ్జిగ, వెన్న, పెరుగు అన్నీ రెడీమేడ్గానే తెచ్చుకుంటున్నాం. కానీ పిల్లలకి అన్నీ తెలియాలన్నా, ఇంట్లోనే కమ్మని వెన్నని తయారు చేసుకోవాలన్నా ఈ పరికరం మీకు సహకరిస్తుంది. ఇది బటర్ చర్నర్. కిందున్న గాజు సీసాలో పెరుగు వేసి మూత బిగించి ఆ పిడిని తిప్పితే చాలు. నాలుగైదు నిమిషాలకు పాల నుంచి తాజా వెన్న వెరవుతుంది. వంటల్లోకి, పిల్లలకు పెట్టడానికి బాగుంటుంది. పైగా ఇలా చిలకడాన్ని పిల్లలు ఆస్వాదిస్తారు కూడా.




## రంగవల్లి



24 నుండి
8 వరకు


- టి.యమ్. దమయంతి
సనత్నగర్



### ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు



# 'హానీ' ఫిబ్రవరి 6న విడుదల

**నవీన్ చంద్ర,** దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హానీ. ఒవిఎ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణతో మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ ఎలిమెంట్స్ తో ఉండబోతోంది. ఈ చిత్రంలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'మ్యాజిక్' మూవీని చూసి హిట్ చేయాలని కోరుకుంటున్నా: మెహర్ రమేష్





**టుత్రీ వెంచర్స్** బ్యానర్ మీద రాజు సత్యం నిర్మించిన మరాఠీ చిత్రం 'మ్యాజిక్'. జితేంద్ర జోషి హీరోగా రానున్న ఈ మూవీకి రవింద్ర విజయ కర్మార్కర్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని జనవరి 1న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమానికి మహారాష్ట్ర మండలి అధ్యక్షురాలు గీతా, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, దర్శకుడు మెహర్ రమేష్లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో.. మెహర్ రమేష్ మాట్లాడుతూ.. ..'రాజు సత్యం నాకు చాలా మంచి స్నేహితుడు. స్వర్గీయ పునీత్ రాజ్ కుమార్ గారితో నేను చేసిన 'వీర కన్నడిగ' చిత్రంలో రాజు నటించాడు. అప్పటి నుంచి మా స్నేహం కంటిన్యూ అవుతూనే ఉంది. మహారాష్ట్ర మండలి అధ్యక్షురాలు గీతా మాట్లాడుతూ.. 'మ్యాజిక్' ఎలా ఉండబోతోందో టీజర్, ట్రైలర్ చూస్తే అర్థమై ఉంటుంది. రాజు సత్యం గారు ఈ మూవీని మరాఠీలో నిర్మించి ఓ గొప్పఅడుగు ముందుకు వేశారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. 'మ్యాజిక్' నిర్మాత రాజు సత్యంకి ఆల్ ది బెస్ట్. అన్నారు. అరవింద్ మాట్లాడుతూ.. .. 'రాజు సత్యం గారికి ఆల్ ది బెస్ట్.'మ్యాజిక్' చిత్రం చాలా పెద్ద హిట్ కాబోతోంది. రాజు సత్యం గారెప్పుడూ డబ్బుల కోసం సినిమాలు తీయలేదు. నిర్మాత రాజు సత్యం మాట్లాడుతూ.. 'హైదరాబాద్లో చాలా మంది మరాఠీలు నివసిస్తున్నారు. అరుణ్ భయ్యా సహకారంతో ఈ 'మ్యాజిక్' మూవీని ఇక్కడ రిలీజ్ చేస్తున్నాం అన్నారు. జితేంద్ర జోషి మాట్లాడుతూ.. 'తెలుగు సినిమా అనేది ఎప్పటినుంచో హిందీ సినిమాని ప్రభావితం చేస్తూనే ఉంది. తెలుగు దర్శక, నిర్మాతల వల్లే టాలీవుడ్ ఈ స్థాయి వరకు వచ్చింది.'మ్యాజిక్' చిత్రం అందరికీ నచ్చుతుంది అన్నారు.

## తెర

# 'స్పిరిట్' నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్ రిలీజ్

**రెబల్ స్టార్ ప్రభాస్,** హ్యాట్రిక్ బ్లాక్బస్టర్లను అందించిన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కు తున్న 'స్పిరిట్'లో తన కెరీర్లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్లో కనిపించబో తున్నారు. మేకర్స్ కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక ఒక పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ను విడుదల చేశారు. ఇది నిమిషాల్లో వైరల్గా మారింది. 'ఇండియన్ సినిమా.... మీ అజానుబాహుడును చూడండి. నూతన సంవత్సర శుభాకాంక్షలు 2026 స్పిరిట్ ఫస్ట్ లుక్" అని సందీప్ రెడ్డి వంగా ట్వీట్ చేశారు. ఒళ్లంతా గాయాలతో, బ్యాండేజ్లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడి వున్న రా అండ్ రస్టిక్ పోస్టర్ అదిరిపోయింది. పొడవాటి జుట్టు, గడ్డం పాత్ర ఇంటన్సిటీని మరింత పెంచుతోంది. చేతిలో మద్యంసీసా పట్టుకుని ఉన్న ప్రభాస్లుక్ ఇంటర్నల్ కాన్ఫ్లిక్ట్ని తెలియజేస్తోంది. అతని పక్కన ఉన్న త్రిప్తి డిమ్రీ ఒక ఎమోషనల్ మూమెంట్లో అతని సిగరెట్ను వెలిగిస్తూ కనిపించడం మరింత ఆసక్తిని పెంచింది.



# 'టాక్సిక్' నుంచి నయనతార ఫస్ట్ లుక్ రిలీజ్



**రాకింగ్ స్టార్ యశ్** లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్అప్స్' మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ అవుతోంది. ఈ క్రమంలో మేకర్స్ మూవీలోని ఎవరికీ తెలియని, ఆకట్టుకునే ప్రపంచాన్ని బయటపెడుతోంది. ఇప్పటికే కియారా అద్వానీ, హుమా ఖురేషి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్స్ విడుదల చేసిన మేకర్స్.. ఇప్పుడు గంగ పాత్రలో నటిస్తోన్న నయనతార పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ను విడుదల చేశారు. యశ్ చేస్తోన్న ఈ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్లో నయనతార పాత్ర చాలా కీలకంగా ఉండబోతుందని ఈ పోస్టర్ ద్వారా తెలుస్తోంది. తన స్టార్ పవర్, వైవిధ్యమైన ఎమోషనల్ యాక్టింగ్తో నయనతార భారతదేశంలోని స్టార్హీరోయిన్స్లో ఒకరిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. గంగ పాత్రలోని నయనతార లుక్ చూస్తుంటే.. ఆమెలోని ధైర్యం, భయంలేని వైఖరి సినిమా భారీ స్థాయికి తగ్గట్టుగా కనిపిస్తోంది. యష్, గీతూ మోహన్దాస్ కలిసి కథను రాసి.. గీతూ మోహన్దాస్ దర్శకత్వం వహిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్అప్స్' సినిమాను ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఒకేసారి చిత్రీకరిస్తున్నారు. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం సహా మరి కొన్ని భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నారు.

# 'ది బ్లాక్ గోల్డ్' సమ్మర్లో పాన్ ఇండియా రిలీజ్

**అద్భుతమైన** నటనతో ఆకట్టుకునే సంయుక్త తన కెరీర్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టలలో ఒకటిగా నిలవనున్న పాన్ఇండియన్ యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్'లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మాగంటి పిక్చర్స్ భాగస్వామ్యంతో హాస్య మూవీస్ బ్యానర్పై రజేష్ దండా నిర్మిస్తున్నారు. పవర్ ఫుల్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్గా రూపొందుతున్న 'ది బ్లాక్ గోల్డ్' చిత్రంలో సంయుక్త ఇంటెన్స్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా కనిపించనున్నారు. చిత్ర బృందం నూతన సంవత్సరం సందర్భంగా ఒక ప్రత్యేక పోస్టర్ను విడుదల చేసింది, ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. వరుస విజయాలు, యూత్ఫుల్ ఎంటర్టైనర్లను అందించిన నిర్మాత రజేష్ దండా, ఈ పాన్ ఇండియా యాక్షన్ విజువల్తో ఒక కొత్త జోన్ లో అడుగుపెడుతున్నారు. ఖికెరాంప్ఖి విజయం తర్వాత, ఆయన నిర్మిస్తున్న భారీ స్థాయి యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్'. ఇప్పటికే ట్రేడ్ వర్గాలలో, సినీ ప్రేక్షకులలో బలమైన బజ్ను సృష్టిస్తోంది.



# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నేడు సాంగ్ లాంచ్

**మాస్ మహారాజా** రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ఈ సంక్రాంతికి అద్భుతమైన వినోదాన్ని అందించడానికి సిద్ధంగాఉన్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై మ్యాసీవ్ బజ్ను సృష్టించాయి. తాజాగా మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నుంచి వామ్మోవాయ్యో సాంగ్ జనవరి 2న వరంగల్లో నిర్వహిస్తున్న గ్రాండ్ఈవెంట్లో లాంచ్చేయను న్నారు. రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కలర్ ఫుల్ అవుట్ ఫిట్స్లో మాస్ అండ్ స్టైలిష్గా కనిపించిన ఈ పోస్టర్ పర్ఫెక్ట్ ఫెస్టివల్ వైబ్ని సెట్ చేసింది. జనవరి 13న ఈ చిత్రం గ్రాండ్గా రిలీజ్ కానుంది.



## విజయ్ హజారే ట్రోఫీ.. హైదరాబాద్ నాలుగో పరాజయం

### 37 రన్స్ తేడాతో బరోడా గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పరాజయాలను కొనసాగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన హైదరాబాద్ వరుసగా నాలుగో పోరులోనూ ఓటమిని చవిచూసింది. ఈ మ్యాచ్‌లో బరోడా 37 పరుగుల తేడాతో హైదరాబాద్‌పై గెలుపొందింది. మొదట బరోడా నిర్ణీత50 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 417 పరుగులు చేసింది. కెప్టెన్ కృనాల్ పాండ్యా (109 నాటౌట్) అజేయ శతకంతో విజృంభించగా, ఓపెనర్లు నిత్యా పాండ్యా (122), అమిత్ పసి (127) సెంచరీలతో కదం తొక్కారు. ఆఖర్లో భాను పనియా (42) వేగంగా ఆడాడు. ఎడాపెడా బౌండరీలు బాదిన బరోడా బ్యాటర్లు ఈ మ్యాచ్‌లో 44 ఫోర్లు, 11 సిక్స్‌లు కొట్టడం విశేషం. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 2 వికెట్లు పడగొట్టగా, తనయ్ త్యాగరాజన్, వరుణ్‌గౌడ్ చెరో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో హైదరాబాద్ 49.5 ఓవర్లలో 380 పరుగులకు ఆలౌట్‌అయింది. అభిరత్‌రెడ్డి (130),ప్రజ్ఞయ్‌రెడ్డి (113)సెంచరీలతో పోరాడినా ఫలితం లేకపోయింది.అమన్‌రావు (39),తన్మయ్ అగర్వాల్(32), నితీశ్‌రెడ్డి(33) ఫర్వాలేదనిపించారు. బరోడా బౌలర్లలో అతిత్, మహేశ్ పితియా చెరో 3 వికెట్లు పడగొట్టారు. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైన హైదరాబాద్ పాయింట్ల పట్టికలో ఖాతా తెరవలేక ఏడో స్థానంలో ఉంది.



ఆట

## వర్డ్ బ్లిట్జ్ ఛాంపియన్‌గా కార్ల్‌సెన్

**న్యూఢిల్లీ:** మాగ్నస్ కార్ల్‌సెన్ రికార్డు స్థాయిలో తొమ్మిదవ ప్రపంచ బ్లిట్జ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. చెస్‌లో తాను చాలా అరుదుగా కనిపించే ఒక దృగ్విషయమని కార్ల్‌సెన్ మరోసారి నిరూపించుకున్నాడు. కొన్ని రోజుల క్రితం రాపిడ్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్నప్పటికీ, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లో కార్ల్‌సెన్ అంత సులభం కాలేదు, భారతదేశానికి చెందిన అర్జున్ ఎరిగైసి చేతిలో ఒక ఆటతో సహా పలు ఆటలను కోల్పోయాడు. నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌తో డ్రాగా ఆడి సెమీఫైనల్స్‌కు కార్ల్‌సెన్ చేరుకోవడంతో ఇది టచ్ అండ్ గో అయింది. అతను 19వ రౌండ్‌లో అర్మే నియన్ గ్రాండ్ మాస్టర్ హైక్ మార్టిరోస్యన్ చేతిలో ఒక మ్యాచ్‌ను కూడా కోల్పోయాడు.సెమీఫైనల్స్‌లో, కార్ల్‌సెన్ అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ ఫాబి యానో కరువానాను 3-1తేడాతో ఓడించాడు. ఫైనల్‌లో, కార్ల్‌సెన్ ఉజ్బెక్ అబ్దుసత్తోరోవ్ నుండి డ్రా ఆఫర్‌ను తిరస్కరించాడు. 2.5-1.5 తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకోవడానికి ఒక ప్రత్యేకమైన పాన్ మూవ్‌తో తిరిగి వచ్చాడు. ఇది కార్ల్‌సెన్‌కు 20వ ప్రపంచ టైటిల్ విజయం.



## కొత్త యేడాది 2026లో.. టీమిండియా షెడ్యూల్

### న్యూజిలాండ్ సిరీస్‌తో స్టార్ట్.. శ్రీలంకతో చివరి మ్యాచ్



**న్యూఢిల్లీ:** టీమిండియాకు 2026లో పక్కాగా షెడ్యూల్ ఉంది. ఈ సంవత్సరంలో ఎన్ని మ్యాచ్‌లు, ఏయే జట్లతో తలబడు తుందనేది నిర్ధారణ అయింది. 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు నాలుగు టెస్టులు, దాదాపు 18 వన్డేలు, 29 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. జనవరిలో న్యూజిలాండ్ సిరీస్‌తో టీమిండియా టూర్ స్టార్ట్ అయి శ్రీలంకతో జరిగే మ్యాచ్‌తో ఏడాది డిసెంబరుతో ముగియనుంది. 2026లో కూడా టీమిండియాకు ఐసీసీ టైటిల్ గెలిచే అవకాశం ఉంది. 2027 ప్రపంచకప్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కంబ్యాక్ ఇవ్వనున్నారు. 2026 కొత్త సంవత్సరానికి గానూ భారత జట్టు షెడ్యూల్ జనవరిలో ప్రారంభమవుతుంది. తన తొలి సిరీస్‌ను స్వదేశంలో ఆడనుంది. జనవరి 11-18 మధ్య న్యూజిలాండ్‌తో మూడు వన్డేలు, ఆపై ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జనవరి 21న ప్రారంభమై జనవరి 31 వరకు కొనసాగుతుంది. న్యూజిలాండ్ సిరీస్ ముగియగానే ఫిబ్రవరిలో టీ20 ప్రపంచకప్ ఉంటుంది.డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఈ టోర్నమెంట్‌లోకి అడుగుపెట్టనున్న టీమిండియా టైటిల్‌ను గెలుస్తుందో చూడాలి.

ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంకలో జరుగుతుంది. ఇక ఈ ప్రపంచకప్‌ను ఎవరు గెలుస్తారన్నది పక్కన పెడితే, ఐపీఎల్ 2026 సీజన్ మార్చిలో ప్రారంభమవుతుంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లు తమ ప్రతిభను ఈ టోర్నీలో చూపనున్నారు. ఈ మ్యాచ్‌లు మార్చి నుంచి మే వరకు జరుగుతాయి. ఐపీఎల్ తర్వాత, టీమిండియా ఆటగాళ్లు జూలైలో ఇంగ్లాండ్‌లో పర్యటిస్తారు. అయితే, ఈసారి పర్యటన టెస్ట్ సిరీస్ కోసం కాకుండా వైట్‌బాల్ సిరీస్ కోసం ఉంటుంది. భారత్ మొదట ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. ఇది జూలై 1 నుంచి 11 మధ్య జరుగుతుంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జూలై 14 నుంచి 19 మధ్య ఉంటుంది.ఇంగ్లాండ్ పర్యటనముగిసిన తర్వాత, రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా ఆగష్టులో శ్రీలంకకు వెళ్లనుంది. అయితే, ఈ సిరీస్‌కు ఇంకా తేదీలను ప్రకటించలేదు. అలాగే భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ నెలలో అత్యధిక సిరీస్‌లు ఆడుతుంది. టీమిండియా మొదట సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌లో, తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్ ఆడనుంది. ఆపై వెస్టిండీస్‌తో స్వదేశంలో సిరీస్ ఉంటుంది. బంగ్లాదేశ్ పర్యటనలో భారత జట్టు మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడ నుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు టీ20లు కూడా ఆడనుంది. అదే సమయంలో, స్వదేశంలో, టీమిండియా వెస్టిండీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ సిరీస్‌ల తేదీలు ఇంకా ప్రకటించాల్సి ఉంది. అక్టోబర్, నవం బర్‌లో టీమిండియా న్యూజిలాండ్‌లో పర్యటిస్తుంది. టీమిండియా అక్కడ రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. డిసెంబర్‌లో టీమిండియా శ్రీలంకతో స్వదేశంలో సిరీస్ ఆడుతుంది.



## వన్డే కెప్టెన్‌గా రోహిత్

### టాపార్డర్ బ్యాటర్లుగా కోహ్లీ, రూట్

**న్యూఢిల్లీ:** వన్డేల్లో వీరకొట్టుడుతో అభిమానులను అలరిస్తున్న భారత క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ ప్రోగ్రామింగ్ నెట్ వర్క్ (ఈఎస్‌పీఎన్) వన్డే జట్టు 2025కు ఎంపికయ్యారు. నిరుడు టీమిండియాకు ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన హిట్‌మ్యాన్‌కు కెప్టెన్సీ దక్కగా, దక్షిణాఫ్రికాపై శతకాలతో రెచ్చిపోయిన కోహ్లీ బ్యాటింగ్ ఆర్డర్లో మూడో స్థానం కాపాడుకున్నాడు.

2025లో వన్డేల్లో అద్భుతంగా రాణించిన 11 మందితో గురువారం ఈఎస్‌పీఎన్ జట్టును ప్రకటించింది. అందులో భారత్ నుంచి రోహిత్, కోహ్లీకి మాత్రమే చోటు దక్కింది. కెప్టెన్, ఓపెనర్‌గా రోహిత్ ఎంపికవ్వగా, అతడికి జోడీగా దక్షిణాఫ్రికా కుర్రాడు మాథ్యూ బ్రీట్జ్‌ను తీసుకున్నారు. మూడో స్థానంలో కోహ్లీ, నాలుగో స్థానానికి జో రూట్ సెలెక్ట్ అయ్యారు. నిరుడు సెంచరీలతో రెచ్చిపోయిన విండీస్ కెప్టెన్ షాయ్‌హోప్ వికెట్ కీపర్‌గా ఎంపిక య్యాడు. న్యూజిలాండ్ క్రికెటర్ గ్లెన్‌ఫిలిప్స్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా చోటు దక్కించుకున్నాడు. మిచెల్ శాంట్నర్, హ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్) బౌలింగ్ యూనిట్‌లో నిలిచారు. ఇంగ్లండ్ స్టార్లు ఆదిల్ రషీద్‌స్పిన్నర్‌గా, జోఫ్రా ఆర్చర్, జైడెన్ సీల్స్ (వెస్టిండీస్) పేస్ బౌలర్లుగా వన్డే జట్టు ఆఫ్ ది ఇయర్ 2025కు ఎంపికయ్యారు. ఇక వన్డే జట్టు ఆఫ్ ది ఇయర్ 2025లో రోహిత్ శర్మ(కెప్టెన్), మాథ్యూ బ్రీట్జ్, విరాట్ కోహ్లీ, జో రూట్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, మ్యాట్ హెన్రీ, జైడెన్ సీల్స్ ఉన్నారు.

## ఫ్యూచర్ ట్రేడింగ్‌లో వెండి మరింత దూకుడు

### లాభాల స్వీకరణతో పసిడిధరల్లో స్వల్ప సవరణ



**మంబయి, జనవరి 1:** కొత్త సంవత్సరం ప్రారంభంలో దేశీయ కమోడిటీ మార్కెట్ (ఎంసీఎక్స్) మిశ్రమ ఫలితాలను నమోదు చేసింది. గత ఏడాది (2025) అసాధారణ లాభాలను ఆర్జించిన బంగారం, గురువారం ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణతో స్వల్పంగా తగ్గింది. పారిశ్రామికంగా పెరిగిన డిమాండ్ కారణంగా వెండి ధరలు మాత్రం మరింత పుంజుకున్నాయి. ఎంసీఎక్స్‌లో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ 0.07 తగ్గి 10 గ్రాములు రూ. 1,35,350 వద్ద కొనసాగింది. అమెరికా డాలర్ బలోపేతం కావడమే ఇందుకు ప్రధాన కారణం.మార్చి నెల వెండి కాంట్రాక్టులు 0.17 శాతం పెరిగి కేజీ రూ. 2,36,108 వద్ద ట్రేడ్ అవుతోంది. గత ఏడాదిని (2025) విశ్లేషిస్తే బంగారం, వెండి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. ఇన్వెస్టర్లకు ఇది ఒక కలల సంవత్సరంగా మిగిలిపోయింది. డిసెంబర్ 31, 2024న రూ. 75,913 ఉన్న 10 గ్రాముల బంగారం, ఏడాది తిరిగేసరికి (డిసెంబర్ 31,2025) రూ. 1,32,640 కి చేరింది. అంటే సుమారు 75 శాతం లాభాలను అందించింది. వెండి ధర మరింత వేగంగా దూసుకుపోయింది. 2024 చివరిలో రూ. 85,851 ఉన్న కేజీ వెండి, 2025 చివరి నాటికి ఏకంగా రూ. 2,29,452కు పెరిగి 167 శాతం భారీ వృద్ధిని నమోదుచేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం, రాబోయే రోజుల్లో మరిన్ని కోతలు ఉండవచ్చనే అంచనాలు పసిడికి ప్రాణం పోశాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు మళ్లేలా చేశాయి. విద్యుత్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్ల రంగాల్లో వెండి వినియోగం పెరగడంకూడా ధర భారీగా పెరగడానికి కారణమైంది. డాలర్ పెరుగుదల వల్ల బంగారం ధరలో నేడు స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, అంతర్జాతీయంగా సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం, వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల వల్ల ఈ ఏడాది కూడా పసిడి మెరుపులు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



## రూ.111 పెరిగిన వాణిజ్య సిలిండర్

**న్యూఢిల్లీ, జనవరి 1:** నూతన సంవత్సరంలో దేశీయ హోటళ్లు, రెస్టారెంట్లు, సర్వీస్ ఆపరేటర్లకు ఆయిల్ కంపెనీలు ఝలక్ ఇచ్చాయి. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.111 పెంచాయి. ఈ పెరుగుదల గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌కు వర్తించదు. గృహ అవసరాల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. తాజా సవరణతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.111 పెరిగి రూ.1,691.50కి చేరుకుంది. ముంబైలో రూ.1,531.50 నుంచి రూ.1,642.5కు, కోల్‌కతాలో రూ.1,684 నుంచి రూ.1,795కి, చెన్నైలో రూ.1,739.50 నుంచి రూ.1,849.50కి పెరిగింది. అదే సమయంలో విమానాల్లో వాడే ఇంధనం ఏటీఎఫ్ ధర భారీగా తగ్గింది. ఢిల్లీలో జెట్ ఇంధనం కిలో లీటర్‌కు రూ.7,353 తగ్గింది.

## ఒక్కనెలలోనే 21.63 బిలియన్ యుపిఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ,జనవరి 1:** దేశంలో డిజిటల్ చెల్లింపుల హవా జోరుగా సాగుతోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపిఐ) వినియోగంలో భారత్ సరికొత్త రికార్డులను బ్రేక్‌చేస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం డిసెంబర్ నెలలో యూపిఐ లావాదేవీలు భారీగా పెరిగాయి. ఒక్క డిసెంబర్‌లోనే ఏకంగా 21.63 బిలియన్ లావాదేవీలు జరగగా, వాటి విలువ రూ.27.97 లక్షల కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్య 29 శాతం, విలువ పరంగా 20 శాతం వృద్ధి సాధించడం విశేషం. నవంబర్ నెలతో పోల్చినా డిసెంబర్‌లో వృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. డిసెంబర్‌లో రోజువారీ సగటు లావాదేవీల విలువ రూ.90,217 కోట్లుగా ఉండగా, సంఖ్య పరంగా చూస్తే రోజుకు సగటున 698 మిలియన్ లావాదేవీలు జరిగాయి. ఇన్‌స్టంట్ మనీ ట్రాన్స్‌ఫర్ తక్షణ నగదు బదలీ లావాదేవీలు కూడా పెరిగాయి. డిసెంబర్‌లో రూ.6.62 లక్షల కోట్ల విలువైన ఐఎంపిఎస్ లావాదేవీలు జరిగాయి. ఇక, క్యూఆర్ కోడ్ వినియోగం దేశవ్యాప్తంగా విస్తృతంగా పెరిగింది. వరల్డ్ లైన్ ఇండియా నివేదికను చూస్తే దేశంలో 709 మిలియన్ల యాక్టివ్ యూపిఐ క్యూఆర్ కోడ్స్ ఉన్నాయి. కిరాణా షాపులు, మందుల దుకాణాలు, రవాణా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో స్కాన్ అండ్ పే విధానం సర్వసాధారణమైపోయింది. వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీల (పి2పి) కంటే, వ్యక్తులు దుకాణాలకు చెల్లించే (పి2బి) లావాదేవీలే ఎక్కువగా జరుగుతున్నాయి. సగటు లావాదేవీ పరిమాణం రూ.1,363 నుంచి రూ.1,262కు తగ్గడం వల్ల చిన్న చిన్న అవసరాలకు కూడా జనం యూపీఐనే వాడుతున్నారని స్పష్టమవుతోంది. భారత్ డిజిటల్ పవర్ హౌస్‌గా మారుతున్నదనడానికి ఈ డేటాయే నిదర్శనం.

भारत सरकार
GOVERNMENT OF INDIA

హెచ్చరిక!
పాన్ మసాలా తయారీదారులకు

ఆరోగ్య భద్రతతో జాతీయ భద్రత (HSNS)
సెస్ చట్టం, 2025 ఫిబ్రవరి 1, 2026 నుండి వర్తిస్తుంది

పాన్ మసాలా తయారీకి యంత్రాలు/ప్రక్రియలపై HSNS సెస్ విధించబడుతుంది.
ప్రతి పన్ను చెల్లించదగిన వ్యక్తి నమోదు చేసుకుని చెల్లించాలి.

నమోదు తప్పనిసరి
(ఫారమ్ HSNS REG-01)
- మీరు www.cbic-gst.gov.in ని సందర్శించి HSNS సెస్ ట్యాబ్ క్రింద "కొత్త యూజర్" పై క్లిక్ చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- నమోదు సూచన సంఖ్య (ERN) పొందడానికి పేరు, పాన్, ఇ-మెయిల్, మొబైల్‌తో నమోదు చేసుకోండి.
- ఫారమ్ HSNS REG-01 ని పూరించడానికి ERN ని ఉపయోగించండి.
- ప్రారంభ చెల్లింపు కోసం తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబర్ (TRN) పొందండి.

నెలవారీ సెస్సు చెల్లింపు
(ఫారమ్ HSNS PMT-01)
- ఆ నెలలో 7వ తేదీ నాటికి ఎలక్ట్రానికల్లీగా గడువు.
- (ఉదా. ఫిబ్రవరి 2026 గడువు పూచీ ఫిబ్రవరి 7, 2026 నాటికి).
- మీరు పన్ను చెల్లింపుదారుల డాష్‌బోర్డ్‌లోకి లాగిన్ అయి మెనూ ట్యాబ్ క్రింద ఇ-పేమెంట్‌ను ఎంచుకోవడం ద్వారా సెస్ చెల్లించవచ్చు.

సెస్సు ప్రకటన
(ఫారమ్ HSNS డిసెంబర్-01)
- రిజిస్ట్రేషన్ మంజూరు చేసిన 7 రోజుల్లోపు ఫైల్ చేయండి.
- మీరు పన్ను చెల్లింపుదారుల డాష్‌బోర్డ్‌లోకి లాగిన్ అయి మెనూ ట్యాబ్ క్రింద ఉన్న డిక్లరేషన్‌పై క్లిక్ చేయడం ద్వారా మీ డిక్లరేషన్ దాఖలు చేయవచ్చు.

నెలవారీ రిటర్న్
(ఫారమ్ HSNS RET-01)
- తదుపరి నెల 20వ తేదీ నాటికి ఎలక్ట్రానికల్లీగా ఫైల్ చేయండి
  (ఉదా. ఫిబ్రవరి 2026 రిటర్న్ 20 మార్చి 2026 నాటికి గడువు)
- మీరు పన్ను చెల్లింపుదారుల డాష్‌బోర్డ్‌లోకి లాగిన్ అయి మెనూ ట్యాబ్ క్రింది రిటర్న్‌పై క్లిక్ చేయడం ద్వారా మీ రిటర్న్‌ను దాఖలు చేయవచ్చు.

మరింత సమాచారం కోసం, దయచేసి 31.12.2025 నాటి DoR నోటిఫికేషన్ నంబర్ S.O. 6153(E) మరియు 01.01.2026 నాటి 01/2026-HSNS సెస్సు చూడండి.

తదుపరి విచారణల కోసం హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించండి: cbicmitra.helpdesk@icegate.gov.in 18004250232

@cbic_india @cbicindia @CBICINDIA @cbicindia @CBICIndia www.cbic.gov.in

CBC 15502/13/0049/2526

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.